

ఆంధ్రపత్రిక
చిత్ర వార పత్రిక
25 నయాపైసలు
29-5-'57
ANDHRA PATRIKA

ఆంధ్రకేసరి అస్తమయం



కురుక్షేత్రంలాంటి జీవిత క్షేత్రంలో తను నమ్మిన ఆదర్శాలకోసం ఎడతెగని పోరాటం సాగించి, సుఖంలో, దుఃఖంలో, కలిమి లేముల్లో, జయాపజయాల్లో ఎన్నడూ ఎత్తిన తల దించకుండా, వేసిన అడుగు తీయకుండా, బ్రతికి నన్నాళ్లూ కర్మయోగిలా బ్రతికిన ఒక మహాపురుషుడు ఆంధ్ర రాజకీయ రంగంనుంచి నిష్క్రమించారు.

ప్రకాశం అంటే తెలియని తెలుగువాడు లేడు. ఆయన చేసిన సాహస కార్యాలను, త్యాగాలను ఎరగనివాడు తెలుగునాట ఎక్కడా కనబడడు. ఆయన చేసిన పనులను కథలూ, గాథలుగా చెప్పుకోని సందర్భం ఉండదు. ఎనభైయారు సంవత్సరాల సుదీర్ఘ జీవితయాత్ర సాగించి, నలభై సంవత్సరాలపాటు ఆంధ్ర రాజకీయాలను తన ప్రాబల్యంతో ప్రచలితం చేసిన ప్రకాశంపంతులుగారిని తెలుగుజాతి ఈనాటితో మరిచిపోదు. మృతి చెందినా స్మృతినుంచి తొలగిపోని కొద్దిమంది యశఃకాయులలో ఆయనొకరు.

భారతదేశంచుట్టూ పరాయి ప్రభుత్వం ఉక్కు సంకెళ్లు బిగించిన రోజులలో ఆయన జన్మించారు. ఆ సంకెళ్లను ఛేదించడానికి జరిగిన పోరాటంలో అగ్రశ్రేణిలో నిలబడ్డారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్రంకోసం జరిగిన దీర్ఘాందోళనలో కూడా ఎప్పుడూ ఆయన అగ్రశ్రేణిలోనే ఉన్నారు. ఆయన ఆశయాలన్నీ నెరవేరాయి. దేశ స్వాతంత్ర్యాన్నీ, విశాలాంధ్ర నిర్మాణాన్నీ ఆయన కళ్ళారాచూసుకున్నారు. అవిభక్త మద్రాసురాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, ప్రత్యేకాంధ్రరాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా ఆయన స్వార్థరహితంగా ప్రజాహితానికే నిర్విరామ కృషి చేశారు.

భారతయుద్ధం పద్దెనిమిది రోజులు జరిగింది. మృత్యువుతో ప్రకాశంపంతులుగారి పోరాటంకూడా పద్దెనిమిది రోజులు జరిగింది. మే 2 వ తేదీనుంచీ ఆయన అస్వస్థులుగానే ఉన్నారు. 20 వ తేదీన సూర్యాస్తమయానంతరం, 7-35 గం॥ లకు అలసిసొలసిన ఆయనజీవితం కూడా శాశ్వత విశ్రాంతిలో అంతమైంది.

ఆంధ్రప్రదేశ రాజధానీ నగరంలో, ఆప్తమిత్రులమధ్య కడసా[illegible] కన్నుమూశారు. ఆయనతో ఒక శకం ప్రారంభమైంది. ఆశకం ఆయనతోనే అంతమైంది.

నిరంతర సంక్షుభిత మహాసాగరంలాంటిఆయన ఆత్మకు పరమాత్ముడు శాంతి ప్రసాదింపుగాక!

సంవత్సర చందా
రు. 13-0-0
విడిప్రతిక 25న.పై.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 51
సంచిక 39
29-5-57

హేవిళంబి జ్యేష్ఠం బహుళ అమా బుధవారం

విషయానుక్రమణిక

ముఖచిత్రం :

"మిస్ ఇండియా"లో నర్గీస్

పన్నులు! పన్నులు!!


వీలైనన్ని మార్గాలలో వీలైనంత ధనం సేకరించాలనే ఉద్దేశంతో ఆర్థిక మంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి కొత్త బడ్జెట్ తయారుచేశారు. దేశాభివృద్ధి ప్రణాళికకు కావలసిన ధనంకోసం ఉన్న పన్నుల రేట్లను ఎక్కువచేయడం, ఎక్కడా కనీ వినీ ఎరుగని కొత్త పన్నులను విధించడం ఆయన అవలంబించిన పద్ధతులు. దేశంలోని అన్ని తరగతుల వారికి ఈ బడ్జెట్ ప్రతిపాదనలు కశాఘాతం లాగ తగిలాయనక తప్పదు.

ఇంతకీ అవునా, కాదా?

కొత్త పన్నుల మూలంగా జీవన వ్యయం ఆట్టే చెప్పుకోదగినంతగా పెరగదని ఒకసారి, పన్నులుపడిన వస్తువుల ధరలతోపాటు మిగతా వస్తువుల ధరలుకూడా పెరగవచ్చునని మరోసారి ఆర్థికమంత్రి తనమాటకు తనేవిరుద్ధంగా చెబుతున్నారు. ఆయన ప్రతిపాదనలను సమర్థించగలిగినంత ధైర్యం ఆయనకే లేదని, కిరసనాయిలు మీద, న్యూస్ ప్రింటుమీద ఎక్కువ చేసిన పన్నులను యథాస్థితికి తగ్గించివేయడంలోనే బుజువవుతున్నది. ఆయన సంగతే అలా ఉండగా కాంగ్రెసు పార్లమెంటరీ పక్ష సమావేశంలో బడ్జెట్ పైజరిగిన తీవ్ర విమర్శ మరింత కనువిప్పుగా ఉన్నది. బడ్జెట్ ప్రతిపాదనలు సామాన్య పౌరుని ఆర్థికభారాన్ని మరింత అధికం చేసేవిగా ఉన్నాయని, ధరలను పెంచి జీవితాన్ని మరింత కష్టంచేసేవిగా ఉన్నాయని సర్వే సర్వత్రా అందరూ అభిప్రాయపడుతున్నారు.

ఆపన్నులపైనా ఈపన్నులు?

పంచదార, కాఫీ, టీ, పొగాకు, అగ్గిపుల్లలు, సిమెంటు, ఉక్కు, పెట్రోలు మొదలైనవాటిమీద ఎక్సైజు పన్నులను అధికంచేశారు. దాదాపు 90 వస్తువులమీద దిగుమతిపన్నులు అధికంచేశారు. రైల్వే టిక్కెట్ల రేటను, తంతి తపాలా రేట్లను పెంచారు. రాబడిపన్ను చెల్లించవలసివచ్చే వ్యక్తులసంఖ్య అధికంచేశారు. కంపెనీలు చెల్లించవలసిన పన్నులను ఎక్కువ చేశారు. వీటన్నిటికీ తోడు కొత్తగా సంపదపన్ను అంటూ ఒకటి, ఖర్చుపన్ను అంటూ మరొకటి తగిలించారు. వీటన్నిటి మూలంగా



"పన్నుల మంత్రి"
శ్రీ టి. టి. కృష్ణమాచారి.

ప్రస్తుత సంవత్సరానికి రూ. 78 కోట్లు అదనంగా లభ్యమైనప్పటికీ, మొత్తంమీద రూ. 275 కోట్లలోటు ఎలాగూ మిగిలిపోతూనే ఉంది. ఖజానా పత్రాలను అధికం చేయడం ద్వారా ఈలోటు భర్తీ చేస్తామని ఆర్థిక మంత్రి అన్నారు. దీని ఫలితంగా నోట్లమీద నోట్లు అచ్చుకొట్టి దేశం మీదికి వదల్లడమే జరుగుతుంది.

ఉన్నవారి మీద ప్రత్యక్షంగా పడే పన్నుల సంగతిఅలాఉంచి, సామాన్య ప్రజలమీద పరోక్షంగా పన్నులభారాన్ని అధికం చేయడంకూడా శోచనీయంగాఉంది. పన్నులవలన ఒక ఏడాది లభించే అదనపు ఆదాయంలో ఎక్కువభాగం, అంటే రూ. 60 కోట్ల 80 లక్షల దాకా ఎక్సైజు పన్నుల ద్వారా రాబట్టాలని ఆర్థిక మంత్రి ఆశిస్తున్నారు. దీనిలో చాలభాగం మధ్య తరగతి వారి మీద, దిగువ తరగతి వారి మీద పడక తప్పదు. దీనివలన అన్ని వస్తువుల ధరలు పెరిగి, జీవనవ్యయం ఎక్కువైపోతుంది. తంతి తపాలారేట్లను, రైల్వే చార్జీలను ఎక్కువ చేయడం కూడా జీవన వ్యయం పెరుగుదలకు సహాయపడుతుంది. దీంతో ఈ వర్గాల ప్రజలు జీత భత్యాలను పెంచవలసినదిగా ఆందోళనచేయడం, తద్వారా పారిశ్రామికాభివృద్ధి దెబ్బ తినడం జరక్క తప్పదు. గడచిన రెండేళ్లలో ధరల పెరుగుదల మూలంగా ద్వితీయ పంచవర్ష ప్రణాళికకోసం మొదట్లో వేసుకున్న అంచనాలన్నీ తారుమారవడం అందరికీ తెలిసినదే. ఇప్పుడు మళ్లీ

★ పన్నులు! పన్నులు!! ★

ధరలు పెరగడం అంటే ప్రణాళికను ఇంకా ఇబ్బందుల్లో పడెయ్యడమే అవుతుంది.

ఇళ్లకొరత ఎక్కువౌతుంది

బాగా ఎక్కువ రేటున పన్ను పడిన వస్తువులు ఉక్కు, సిమెంటు, పంచదార. ఉక్కుమీద టన్నుకు రూ. 4 చొప్పున ఉన్న పన్ను రూ. 40 కి పెంచారు. సిమెంటుమీద టన్నుకు రూ. 5 పన్నును రూ. 20 కి పెంచారు. ఉక్కుపన్ను ద్వారా ఏడాదికి రూ. 5 కోట్ల 70 లక్షలు, సిమెంటు పన్ను మీద రూ. 6 కోట్ల 70 లక్షలు ఆదాయం రాగలదని ఆర్థిక మంత్రి అంచనా. ఇలాగ అయిదేసి రెట్లు, పదేసి రెట్లు, పన్ను పెంచడంద్వారా ఈ రెండు వస్తువులు లేందే పని జరగని భవన నిర్మాణకార్యక్రమం బాగా దెబ్బతిని పోగలదు. అసలే మనదేశంలో, ముఖ్యంగా పట్టణాలలో ఇళ్లకొరత నానాటికి ఎక్కువౌతోంది. కొరత పెరుగుతున్నంతగా కొత్త భవనాలు పెరగడం లేదు. ఇప్పుడు సిమెంటు, ఉక్కు ధరలు పెరగడంతో నిర్మాణం మరింత తగ్గిపోగలదు.

పంచదార హండ్రెడ్ వెయిట్ మీద ఉన్న రూ. 5.62 పన్నును రూ. 11-52కు పెంచారు. దీనివలన ఒక ఏడాదిలో రూ. 18.55 కోట్ల ఆదాయం రాగలదట. పంచదార ప్రజల నిత్యావసర పదార్థాలలో ఒకటి. దీనిమీద ఇంత అధికంగా పన్ను వెయ్యడంవల్ల పంచదార ధరలు బాగా పెరిగిపోతాయి. ఇదివరలో బట్టలమీద పన్ను అధికం చేసినప్పుడు ధరలు పెరగలేదు కదా ఇప్పుడూ అలాగే ధరలు పెరగవని అనుకుంటున్నామని ఆర్థికమంత్రి అభయమిస్తున్నారు. పంచదార విషయంలో వర్తకులకు ఇప్పటికే బాగా లాభం గిట్టుతోంది కనుక ధరలు పెంచకుండానే వర్తకులు భరిపెట్టుకోగలరని ఆయన ఊహిస్తున్నారు. కాని ఇన్నికోట్ల రూపాయల పన్ను అధికంగా తగిలించినప్పుడు, ధరలు పెరగవని అనుకోవడం కేవలం ఊహాగానమే. పంచదార వాడకాన్ని అరికట్టి ఎగుమతిని ప్రోత్సహించడానికే ఈ పన్ను అధికం చేశామని ఆయన అన్నారు. కాని ఈవిధంగా ఒక నిత్యావసరవస్తువు వాడకాన్ని తగ్గించడం సాధ్యమూ కాదు, సమంజసమూ కాదు.

మధ్యతరగతి గతి

ఇక మధ్యతరగతి పౌరులకు చురుగ్గా తగిలేపన్ను రాబడిపన్ను. ఎక్కువ సంపాదించి, ఎక్కువ మిగల్చాలనే ఆశయానికి ఈ పన్ను విధింపులో మార్పులు ఎలా తోడ్పడతాయో దురూహ్యం. రాబడిపన్ను వర్తించకుండా మినహాయించే వ్యక్తుల రాబడులను రూ. 4200 నుండి రూ. 3000కు తగ్గించారు. ఏడాదికి మూడువేల రూ.ల పైబడి రాబడి ఉంటే మొదటి రెండువేలను మినహాయించి, మిగతా మొత్తంమీద రాబడి పన్ను చెల్లించుకోవాలన్నమాట. దేశంలో ఇప్పుడు 5 లక్షల మంది రాబడి పన్ను చెల్లిస్తున్నారు. ఇప్పుడు పన్ను మినహాయింపు పరిమితిని మూడు వేల రూపాయలకు తగ్గించడంతో మరో నాలుగు లక్షల మందిమీద ఈ పన్ను పడుతుంది. మొదటి 5 లక్షలమందిలో 'కలవారు' కూడా ఉండవచ్చును గాని, ఈ రెండో నాలుగు లక్షలమందిలో అంతా మధ్యతరగతివారే నన్నది నిస్సందేహం. నెలకు రూ. 250 పైబడి జీతం తెచ్చుకుంటున్న ప్రతి ఉద్యోగికీ ఈ పన్ను అంటుకుంటుంది. దీనివలన వచ్చే రాబడి కూడా రూ. 5 కోట్లకు మించి లేదు. దీనికోసం నాలుగులక్షలమందిని బాధపెట్టవలసిన అగత్యం లేదు. రాబడిపన్నువలన, అదనపు పన్ను (సూపర్ టాక్స్)వలన ప్రస్తుత సంవత్సరానికి వచ్చే ఆదాయం రూ. 25 కోట్లని అంచనా వేశారు. రాబడి పన్ను, అదనపుపన్ను రేట్లను తగ్గించడంవలన వచ్చే రూ. 7.5 కోట్ల నష్టాన్ని, కంపెనీల మీద వేసే పన్నులద్వారా ఆర్థికమంత్రి భర్తీ చేస్తున్నారు. అంటే ఈ చేత్తో ఇచ్చి ఆ చేత్తో లాగివేసేపద్ధతి అవలంబించారన్నమాట.

ఉన్నపన్నులు చాలకా?

ఈ పన్నులన్నీ ఒక ఎత్తు. కొత్తగా విధించబోయే రెండు పన్నులూ ఒక ఎత్తు. కొత్తగా సంపదమీద, ఖర్చుమీదా పన్నులు వేయబోతున్నారు. ఈ పన్నులు సంపన్నులకు మాత్రమే తగుల్తాయి. సమగ్రంగానూ, సమర్థంగానూ పన్నులు వసూలుచేయడానికి అసలు పన్నుల విధానాన్నే మార్చవలసి ఉందనీ, ఈ రెండు పన్నులూ అందుకు పనికొస్తాయని ఆర్థికమంత్రి అభిప్రాయపడ్డారు. రాబడిపన్ను చెల్లించినంతతో, పన్నులు చెల్లించగల శక్తి ఆఖరుకావడం లేదనీ అందుచేత రాబడిపన్నుకు తోడు సంపద పన్ను కూడా విధించాలనీ ఆయన ఉద్దేశం. దీనివలన ముందుముందు పన్నుల ఎగవేతకు వీలులేకుండా చేయవచ్చునట. ఈ పన్నుల ద్వారా రూ. 15 కోట్లు వసూలవుతుందట.

వ్యక్తులమీద, హిందూ అవిభక్త కుటుంబాలమీద, కంపెనీలమీద ఈ పన్ను పడుతుంది. వ్యక్తులైతే రెండులక్షలరూ. విలువగల సంపదవరకూ, అవిభక్త హిందూ కుటుంబాలైతే మూడులక్షల రూ. సంపదవరకూ పన్నుకట్టనక్కరలేదు. ఆపైన సంపద ఉంటే, మొదటి పదిలక్షలకూ నూటికి ½ చొప్పున, తరవాతి పదిలక్షలకూ నూటికి 1 వంతు చొప్పునా, ఇంకా పైబడి ఆస్తి ఉంటే దానికి నూటికి 1½ వంతులచొప్పునా పన్నుకట్టాలి. కంపెనీలు 5 లక్షల రూ. ల ఆస్తులవరకూ పన్నుకట్టనక్కరలేదు. దానికి పైబడి సంపద ఉంటే నూటికి ½ వంతు చొప్పున కట్టుకోవాలి. ఈ పన్ను వ్యవసాయ సంపదకు వర్తించదు. ప్రావిడెంటు ఫండులకూ, ఇన్సూరెన్సు పాలిసీలకు వర్తించదు. ఇంట్లో సామాన్లు, కార్లు, నగలు వగైరావాటి విలువ రూ. 25,000కు మించకుండా ఉంటే వీటికి వర్తించదు. దేవాదాయ, ధర్మాదాయాల సంపదలకు, కళాత్మక వస్తువులకు, అమ్మకానికి కాకుండా సొంతానికి ఉంచుకున్న పురాతన వస్తువులకు పుస్తకాలకు వర్తించదు.

ఈ పన్ను వసూలుచేయడానికి ప్రతి వ్యక్తి సంపదను ముందు విలువ కట్టవలసి ఉంటుంది. ఒక పరిమితిదాటి ఉన్న సంపదలో ప్రతి రూపాయిమీదా పన్నుపడుతుంది. సంపదకు ఖరీదు కట్టడం, దానిమీద పన్ను వసూలుచేయడం ప్రభుత్వం నియమించిన అధికారులే చేస్తారు. వీళ్లు ఖరీదు కట్టేటప్పుడు వ్యవసాయభూమిని మాత్రం వదిలిపెట్టి మిగతా ఆస్తులు, సామాన్లు, కార్లు, నగలు, యావత్తూ పరీక్షించి విలువకడతారు. అంటే ఆయా కుటుంబాలలోను, వ్యక్తుల వద్దా ఎలాంటి సంపద ఉన్నది, ఎంత సంపద ఉన్నదీ అంతా ప్రభుత్వానికి కరతలామలకమైపోతుంది. దీని ఫలితంగా, అధికారుల పీడ, నిరంకుశత్వం పెరుగుతాయని, దేశంలో అవినీతి, లంచగొండితనంలాంటివి పెరుగుతాయనీ, వ్యక్తి స్వాతంత్ర్యం పూర్తిగా దెబ్బతింటుందనీ శ్రీ రాజగోపాలాచారివంటి పెద్దలు అభిప్రాయపడుతున్నారు. కంపెనీల సంపదమీద వేసే పన్నుకూడా ముందు ముందు పారిశ్రామికాభివృద్ధిమీద బాగా దెబ్బతీసే ప్రమాదం ఉన్నది. దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రైవేట్ రంగానికి ముఖ్యస్థానం ఉందని చెబుతూనే, ప్రభుత్వం కంపెనీల సంపదలోంచి వాటా తీసుకుని ప్రభుత్వరంగాభివృద్ధికి వాడుకోబోవడం స్వవచోవిఘాతంగా కనిపిస్తుంది. భారీఎత్తున పరిశ్రమలు పెరగడం ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నది. సంపద పన్ను విధించడం దీని కేవిధంగానూ దోహదం కాదు.

సంపదపన్ను మొత్తం 26 వేల మంది

(47-వ పేజీ చూడండి)

వేసవియాత్రా కేంద్రం
కొడైకెనాల్



శివ జటాజూటంలోంచి దిగిన గంగానది అనిపించే బేర్ షోలా జలపాత దృశ్యం.

తిట్టే నోరూ తిరిగే కాలూ ఊరికే ఉండవంటారు. పై దేశాల్లో ఉన్నప్పుడు అప్పుడప్పుడు అటూ యిటూ తిరగడం పడుతూ ఉండేది. ఇంక స్వదేశం చేరుకున్నాక ఏఁవిటో స్తబ్దత. మనది అసలే త్రిపాదినక్షత్రం కదా యిలా ఉండిపోయేం ఏఁవి చెప్మా నాలుగు నెలల బట్టీని అనుకుంటూ ఉంటే, అంతలో పుణ్యఁవూ పురుషార్థఁవూ కలిసివొచ్చేయి. వేసవి ఆరంభం అవడఁవూ, కొడై ప్రయాణఁవూ తటస్థపడ్డాయి. గవర్న్మెంటు పనే; లేకపోతే ప్రత్యేకించి వేసంగికీ అంటూ శీతల ప్రదేశాలకి పోవడానికి ప్రభువువా, జమీందార్నా? వాళ్లేమా నేసుకుంటున్నార్ట యీ రోజుల్లోను.

కొడైకొడై అని ఆఫీసులో అప్పటికప్పుడే మూడువారాల నుంచీ ఊఁపాట పాడుతున్నా, వెళ్లవలసిన ఆఫీసర్ల జాబితా మట్టుకు మార్చి యిరవైదాకా తేలలేదు. అది కాస్తా శంఖంలోపోసిన తీర్థం అనిపించుకునేసరికి, "నాకు నాలుగునెల్ల బట్టీ జీతఁవే ఇవ్వడంలేదు, ఆడిటు వాళ్ల ధర్మఁవా అని. ప్రయాణానికి ఖర్చులూ అవీ అడ్వాన్సు అంటే యీపరిస్థితుల్లో రూఁల్సు అసలు వొప్పు" అన్నారు. ఈ లోగా ట్రావెల్ ఏజంట్సు పదిమందికి టెలిఫోను చేసినా, "ఏప్రిల్ ఒకటో తేదీ దాకా గ్రాండ్ ట్రంకులో ఫస్టుక్లాసులన్నీ భర్తీ అయిపోయేయి" అన్న కబురే. ఒకటి

క్రొవ్విడి లక్ష్మన్న

ఏప్రిల్ కి నేను కొడైకెనాల్లో ఉండి తీరాలి. ఇండోచైనా వెళ్ళిన పరిస్థితులు జ్ఞాపకం వొచ్చి నవ్వుకున్నాను.


"అప్నీ కీ రోకొమ్ జాత్తె పారెన్?" అని అడిగింది రత్న (బెంగాలీవాళ్ల యింట్లో అద్దెకున్నానులెండి) – డబ్బూలేక రెయిల్లో రిజర్వేషనూ కుదరక ఎలా వెళతాడు చెప్మా అని సందేహం వచ్చి. కాలేజీ పిల్లలికి కంగారెక్కువ.

చివరాఖరు కచేరీలో కాగితాలు రాసుకోడంతోనే సరిపోయింది. స్నేహితులు టాక్సీ తెచ్చేరు. బండీ ఎక్కబోతూ అన్నాను "కింతు, జాచ్చితా, రోత్తూ." (రత్నకి ముద్దుపేరు రోత్తూ)


పిట్టగోడమీద నుంచి వాలి చూస్తూ, నవ్వుతూ, చేతులూపుతూ కారు మలుపు తిరిగేదాకా అలాగ సాగనంపుతూనే వుంది. కూడా ఉన్న స్నేహితుకు "సుభశకునం" అన్నట్టు చిర్నవ్వుతో తల పంకించి సిగరెట్టు అందించేడు!

౨

సెంట్రలు చేరుకోవడం, ఎగ్మూర్కి మారడం, అక్కడ మళ్లీ టిక్కట్టు కొనడం, పక్క పరచడం కూడా రొటీనుగా జరిగిపోయింది. బంధుబలగం తోడుపడడం మూలాన్ని. మద్రాసుదాటి దక్షిణాదిని ఎప్పుడూ ప్రయాణం చెయ్యలేదు. ఎలా వుంటుందో చూద్దాం అనుకున్నాను, కాని రాత్రి ప్రయాణం మూలాన్ని కన్ను మూసుకునే చూడవలసి వొచ్చింది. కన్ను విప్పేసరికి తెల్లవారిపోయింది. "గోల్డెన్రాక్"ట ఏఁవిటో స్టేషను, దాటిపోయింది రెండు నిమిషాల్లో. ప్లేట్ ఫారం నిండా ఊఁ యిసకో సముద్రపు ఒడ్డునలాగ. కొంతమంది గబగబా పళ్లు తోఁవేసుకున్నారు. నాటిక గీసుకున్నట్టు ఔపించలేదు, కర్మ. ఏడున్నరకల్లా తిరుచిరాపల్లి వొచ్చింది. విభూతి పెండికట్లు సిగ్నలు రెక్కలకన్నా స్ఫుటంగా కనిపిస్తూ



కొడైకెనాల్లో ఒక పాఠశాల



కొడైకెనాల్ వద్ద ప్రశాంత సరోవరం

★ కొడైకెనాల్ ★

ఓ బ్రాహ్మడు ఇడ్లెను అమ్మేస్తున్నాడు; అరిటి ఆకుల్లో పెట్టి గరిటెడేసి సాంబారు పోసేస్తున్నాడు. అది సులువు తెలిసినవాడికే కుదరవుతుందిగానీ, నాబోటిగాడు సిద్ధపడితే అరిచేతిలో అరిటాకూ దానిమీద ఇడ్లెన్నూ అలావుండగా, ఆమధ్యని ఏదో మలుపులోంచి సాంబారంతా బుష్‌షర్టు మీదికి ధారకట్టేస్తుంది. ["స్తుంది" ఏమిటి నా బుష్‌షర్టు తలంటేసుకుంటేను!] నీటిలో పుట్టి కూడ నీరంటని తామర పువ్వులాగ, సంబారుతో సహా వెలిసిన ఇడ్లెన్ను సాంబారుని నా చేతులో మిగిలిపోతాయి, మరి గొంతుక దిగకుండాను!

3


పదకొండున్నర అయింది బండి "కొడై కెనాల్ రోడ్డు" స్టేషను చేరుకునేసరికి. గంటన్నర లేటు. పాశ్చాత్యపద్ధతిలో వున్న రిఫ్రెష్‌మెంటురూము తప్పిస్తే పాలూరు స్టేషన్‌కీ ఆట్టే తేడా ఏమీ కనిపించలేదు. ఎండ చుర్రుమంటోంది. ప్లేటుఫారంకన్నా స్టేషను పల్లంలో ఉండడం మూలాన్ని ఎక్కడా నీడ అన్నది లేదు. అంతలో రైలాగింది. షెల్టు చేత బుచ్చుకుని దిగేసరికి, మమ్మల్ని రిసీవు చేసుకోడానికి నియమితులైన కిష్కింధరానే వొచ్చేరు. "RECEPTION" పట్టీలు జబ్బల్ని చుట్టబెట్టుకుని.

"For Seminar from Delhi" అన్నాను-నిజం చెప్పొద్దూ? కొత్త స్టైలుగా నేను.

"Good morning, sir, this way, sir" అన్నాడు ఓ గ్రూపు లీడరు, చాలా నమ్రతి కనబరుస్తూ. మన వాళ్లు మనల్ని మర్యాదా చేస్తూంటే, మనం వాళ్ల మీద అథార్టీ చెలాయించడం ఏమిటా అని నాలో నేనే సిగ్గుపడ్డాను. ఇహ అరవంలోకి దిగిపోయేను. తరవాత తైనంతా క్లియర్. రిఫ్రెష్‌మెంటు రూంలో తాగిన కాఫీ, కూలీ వాడికి ఇవ్వవలసిన డబ్బులూ, కొడై రోడ్డు నుంచి "కొడై హిల్స్"కి బస్సు టిక్కట్టూ అన్నీ కూడా అణాపైసాలతో లెక్కవేసి బిల్లూ-చిల్లరా చేతులో పెట్టి ఘంటసేపటిలో జాగా చూపించేరు. ఘాటీల దిక్కుగా బస్సు కదిలింది.


పందిళ్లు వేసిన స్టాండ్లనీడల్లో రెండుచోట్ల ప్రయాణీకుల్ని ఎక్కించుకుంది. అదివరకే ఎక్కివున్నవాళ్ళు దిగేరు—కాఫీలు తాగడానికి. పక్కనే వున్నాయి కాఫీ క్లబ్బులు. చాలా చవకబారు హోటల్సు, మరి. ఏవా అంతకన్నా గతిలేకపోవడం మూలాన్ని కాబోలు హోటల్సు కిక్కిరిసి వున్నాయి. సాదా కాఫీ అణన్నరే. స్పెషలు కాఫీ మూడణాలు. స్పెషలు కాఫీకి అర్థరిస్తే పాలు కాటోయిన వాసన! అంతలో హారన్ ఊః అదేపనిగా మోగింది. ప్యాసింజర్లు గబగబా పరిగెత్తుకుంటూ వొచ్చేరు. ఆవేళే ఏప్రిలు ఒకటో తేదీ యేమో నయాపైసాల పంపిణీలో లెక్కలు కుదరక కొంతమంది తికమకలు పడుతున్నారు. ముష్టివాడికి అర్ధణా కాసిస్తే విడివిడిగా రెండు కానులు యిమ్మన్నాడు- రెండు విడి కానీలకయితే నాలుగు నయాపైసాలు వొస్తాయట. వాడి బతుకు తెరువు వాడికి తెలుసుమరి! ప్రక్క బస్సులో ఏవిటో కుండలు ఎక్కిస్తున్నారు. మూతులు కట్టేసి వున్నాయి. బెల్లపు కుండల్లాగ మాత్రం కనిపించలేదు. వాకబు చేసేను. ద్రాక్షపళ్ళు కుండల్లో పెట్టి పై ఊళ్ళకి రవాణా చేస్తారుట, అక్కడ. కారణం మరేమీ లేదు. బుట్టల్లో ప్యాక్ చేస్తే రెయిల్వేవాళ్ళు ఖాతరీకుండా విసిరేస్తారు. కుండలు గనక అయితే జాగ్రత్తగా దింపాలి. పళ్ళు నలిగిపోవు! అన్నట్టు కొడైకెనాల్ రోడ్డులో ద్రాక్షపళ్ళు కారుచవక. అక్కడే పండుతాయి.

ఇంకా ఏదో అలాగ చూస్తూ నేఉన్నాను. అంతలో బస్సు కదిలింది. ఓరమ్మట కొంత దూరం పోయి మలుపు తిరిగి ఘాట్‌రోడ్డు అందుకుంది. వెయ్యి అడుగులూ, పదిహేను వందలూ, రెండువేల అడుగులూ అని ప్రతీ అయిదు వందల అడుగులకీ ఎత్తు ప్రయాణం రాసి ఉంది రోడ్డు ప్రక్కని. నాలుగు వేల అయిదు వందలు అని రాసి ఉన్న బోర్డు దాటేక, ఓ చిన్న పల్లెటూరి దగ్గర బస్సు నిలబెట్టేరు పది నిముషాలు. రేడియేటరు నీళ్లు



కొడైకెనాల్ వద్ద షేరీ జలపాతం. దేవకన్యల జలక్రీడలకుకూడా అనువైనంత సౌందర్యంగలది గనుక ఈ పేరు వచ్చిందేమో!

తొగింది. ప్యాసింజర్లు అరిటిపళ్ళు కొనుక్కున్నారు. అవేనో స్పెషలు పళ్ళుట కొడైలో. మాటనోరు తిరగలేదు. కర్పూర కేళీలు, అమృతపాణీలకన్నా ఏంపీ పెద్ద బ్రహ్మాండం కనిపించలేదు నాకు. బొప్పాయి పళ్ళుమాత్రం బాగున్నాయి. చెట్టున పండిన పళ్ళలాగ మాంఛిరుచీ. చవకానూ, రకరకాల పళ్ళు ముమ్మరంగా ఉన్నా Fruit canning పరిశ్రమ మాత్రం లేదు కొడైలోను. మళ్ళీ బస్సు బయల్దేరింది. ఎన్ని అడుగుల ఎత్తుకిపోతున్నా ఎండా, ఉక్కా, చెమటామాత్రం అసహ్యంగా నే ఉన్నాయి. ఘాటీలు ఎక్కుతూన్నంత సేపూ, నాకు జయపురం ఘాటీలు జ్ఞాపకం వొచ్చేయి కాకపోతే ఏవిటే అంటే కొండలు యింకా భారీగా అవుపించేయి. పంక్తులు దీర్చి ఉన్నాయి అక్కడక్కడ దృశ్యాలలో. కొన్ని బోడి కొండలు. కాని చాలావరకూ మాంచి దట్టంగా అడివి పెరిగి నవే పైన్, దేవదారు, సరుగుడూ అయితే చాలా విస్తృతంగా కంటపడ్డాయి. జయపురం ఘాటీలలోలాగే యిక్కడా అడుగడుక్కీ మలుపులు సిగపిన్నువాటం (Hair-pin curues) ఇహ కొడైకెనాల్ చేరుకుంటాం అనగా ఓ మలుపులో జలపాతం కంటపడింది. సిల్వర్ కాస్‌కేడ్ అంటారుట దాన్ని. జెర్సొప్పా (మైసూరు) జలపాతంలాగ అద్భుతంగాను గంభీరంగాను లేకపోయినా చూడ ముచ్చటగా ఉంది. పడమటనుంచి సూర్యకిరణాలు పడుతున్నాయేమో, అచ్చంగా కొండమెడనుంచి వేలాడుతున్న వెండి పమిటలా ఉంది జలటాలం. చూద్దాం అనుకొన్నంత సేపు చూడపనే లేదు. అంతలో మలుపు తిరిగింది బస్సు. మనోపావు గంటకి కొడైకెనాలు రానే




కొడైకెనాల్ నక్షత్ర పరిశోధనశాల

వొచ్చేసేం. బజార్లో ఆగింది బస్సు.

సిమ్లా, డార్జిలింగు, వాట్లలాగ ఎంత బావుంటుందో Hill Station అనుకొన్నాను. అబ్బే, ఒక్క పల్లెటూరు. బజారల్లా ఛత్రేమపీధి, ఆబస్సు ఆగినచోటుదగ్గిర్నుంచీ, అలాపల్లంలోకి దిగిపోయింది, ఓ వందగజాలు. అటూ యిటూ కిల్లీకొట్లూ, చిన్న చిన్న కాఫీ క్లబ్బులూ, కొడైకెనాల్ ఛీప్‌మార్కెట్టూ, కూరగాయల మార్కెట్టూ, కోఆపరేటివ్ స్టోర్సూ అన్నీ అక్కడే. ఏ క్లబ్బులో అడుగుపెట్టి చూసినా లోపల కూచుని తినడానికి మనస్కరించలేదు. వొచ్చిన మనుష్యులలో శుభ్రత ఏకోశానా లేదు. టేబిల్సునిండా జిడ్డూ, సాంబారు చినుకులూను. అన్నింటికన్నా కంగాళీ—క్లబ్బుకి సెంటర్లో, ఎన్‌ట్రెన్సులోనో ఓ పెద్దగంగాళం దానికో కొళాయిన్నీ కిందనో డ్రమ్ము. మనవేపు ప్రతిక్లబ్బులోను ఉంటుంది చేతులు కడుక్కోడానికి అనుకున్నాను. కాని—అబ్బే. తినుబండారాలన్నీ అరిటాకుల్లో పెట్టి సెర్వుచేస్తారేమో యీతిన్నవాళ్ళు ఆ ఎంగిలాకులు ఎవడికివాడు ఎత్తుకుని యీ డ్రమ్ములో పడేస్తూ ఉంటారు. ఉదయం న్నుంచీ అది అలా పాపం పెరిగినట్టు పెరుగుతూ ఉంటుంది. ఇహ మనలాంటి వాళ్ళింకానీ ఏ ఇడ్లెన్నో కక్కుర్తిపడి చెయ్యి కడుక్కోడానికి ఆ గంగాళం దగ్గిరికి వెళ్లేసరికి—యీ చెత్తంతా కంటపడి, మూడురోజుల్నుంచి తిన్నది "ఓక్కు" మంటాం!

అలాగని పాశ్చాత్య పద్ధతిని ఆడంబరంగా ఉండే హోటల్సు లేకపోలేదు. కార్ల్టన్ హోటేలనీ, హాలీడేహోం అనీ, లాఫింగ్ వాటర్సనీ, యిలాకొన్ని ఉన్నాయి. అయితే వీట్లలో రోజుకి పన్నెండు మొదలు పదహారు రూపాయిల వరకూ రేట్లు ఉన్నా, గదుల్లో ఉన్న సోఫాసెట్లూ వగైరా కలకత్తా గ్రాండుహోటేలు గ్రేటు ఈస్టరన్ హోటేళ్ళ వాటిల్లాగ ఎంత మాత్రం లేవు.

"సెసిల్" "ఓబెరోయ్" గ్రూపుహోటేళ్లతో పోల్చడానికి అసలే వీల్లేదు. భోజనాదులలో శాకాహారం అనీ, మాంసాహారం అని ఉన్నప్పటికీ ఉదయాన్నమాత్రం యిడ్డీ, వడ సాంబారున్నూ టుఫీను. అడుగుతే రొట్టె, వెన్నా, గుడ్లూ యిస్తారనకోండి. అది వేరేసంగతి. కొండమీద ఉన్న "షణ్ముగభవనం" లాంటి బ్రాహ్మణ హోటేల్సులో బొత్తిగా థర్డుక్లాసు భోజనం. అంతేకన్న జనతా డైనింగు కార్లో మంచి భోజనం దొరుకుతుంది.



ప్రకృతిసిద్ధమైన స్తంభాకృతి శిలలు. కొడైవెళ్లిన ప్రతి వాడూ చూసి తీరాల్సిన దృశ్యాలివి.

అయితే కొడైకెనాల్ వెళ్ళేవాడు తిండికోసం వెళ్తాడా కేవలంవూను?సుఖం అనుభవించడానికి వెళ్తాడు. అలా వెళ్ళినవాడి

కొడైకెనాల్

ప్రాణానికి హాయి. కొండమీద ఊరు చిన్నదైనా ముచ్చటగా బొమ్మల కొలువులా ఉంటుంది. ఊరుమధ్యని చక్కటి సరస్సుగ నిర్మలంగా నీరూ, అందులో కొండలూ, వాటిమీద ఉన్న అడవీ, అద్దంలో లా, ప్రతిబింబిస్తూ చూసిన కొద్దీ అలా చూడాలనీ, అక్కడే ఉండిపోవాలని అనిపిస్తుంది. తెలియకుండా నే అలాఅడుగులు వేసుకుంటూ సరస్సు ఒడ్డమ్మటే వెళితూ, షికారు, ఒక ఆవృత్తం తిరిగి వొచ్చేసరికి కంటపడుతుంది ఒడ్డున ఉన్న ఓ చెట్టుపక్కన బోర్డు. “ఆ హా! అయితే మీరు రెండుమెళ్లే ఆరు ఫర్లాంగులు చుట్టు వేంచేసేరన్న మాట.” అరి దీని తస్సాగొయ్యా, దీని చుట్టుకొలత రెండు మైళ్ళ పైచిలుకు ఉండా అనిపిస్తుంది మనకి! అయం విశేషః, ఎక్కడైనా కాళ్లు పీకెడితే యింటి కెలా చేరుకోడం అని వెర్రి మొహం వెయ్యనక్కర్లేదు. ఒడ్డునే ఏదో ఓ పడవ కనిపిస్తుంది. అణా డబ్బులకి అవతల ఒడ్డుకి చేర్చేస్తాడు. ఈసరస్సుని ఆనుకునే ఓ బోటింగ్ క్లబ్బు ఉంది. పడవలు అద్దెకి తీసుకుని కావలసినంత సేపు సరస్సులో సరదాగా గడపొచ్చును.

ఊళ్లో అమెరికను స్కూలు ఒకటీ, సేక్రెడ్ హార్ట్ అని యింకో పాశ్చాత్య పద్ధతిని నడిచే స్కూలూ, అదే పంపిణీని యింకోటి మరోటి ఉన్నాయి. అన్నీ Residential Schools. అమెరికను మిషనరీ వాళ్ళ చర్చీ, స్కూలూ, వాళ్ల యూనియన్ హాలూ అవి భారీ స్కేల్లో ఉన్నాయి. వాళ్ళ ప్రాబల్యం కొస్త ఎక్కువగానే ఉన్నట్టు కనిపిస్తుంది కొన్ని కొన్నింట్లో.

కాని కొడైకెనాల్ ఆకర్షణ అంతా తత్పరిసరాల్లో ఉంది. కొడైలో మకాంచేసి తీరుబాటుగా రోజూ ఓదిక్కుగా అధమం ఓ నాలుగైదు మైళ్ళు షికారు పోతూ ఉండాలి. అప్పుడే అక్కడి సుందర దృశ్యాలు కంటబడతాయి. హృదయం పులకితం అవుతుంది. చిత్త ప్రశాంతత ఏర్పడుతుంది. కొడైకెనాల్ వెళ్ళినందుకు సార్థకత లభిస్తుంది. కొడైకెనాల్ టవును కొండల్లో ఏడువేల అడుగుల ఎత్తున ఉంది. కాని పగల్లా, అంటే ఉదయం ఎనిమిది మొదలుకునీ ఉః ఎండా ఉక్కానూ—చెన్నపట్నంలో లాగ. అయితే సాయంత్రం నాలుగున్నర కల్లా, ఎయిర్ కండిషనింగ్ ప్లాంటు స్విచ్ వేసినట్టుఒక్కసారి టెంపరేచరు పడిపోతోంది. చల్లనిగాలి వీస్తుంది. ఇంక ఊలుబనీను తొడుక్కోక పోతే ప్రాణం కష్టపడిపోతుంది. రాత్రిళ్ళయితే రగ్గులు కప్పుకోవలసిందే. కాని తెల్లవారితే మళ్ళీ చాక్కా కూడా

(45-వ పేజీ చూడండి)



బావా, మరదలు



★ మొక్కపాటి నరసింహశాస్త్రి ★

జంతు సంతానంలో మానవుని విశిష్టునిగా నిరూపించే లక్షణాలలో అతను నవ్వగల శక్తి ముఖ్యమైనది. ఇతర జంతువులు కూడా కొన్ని-ముఖ్యంగా కోతులు వగైరా-నవ్వగలవనీ, అప్పుడప్పుడు అవి నవ్వుతూండడము చూచామనీ ఈమధ్యను కొంతమంది జంతు శాస్త్రజ్ఞులు వ్రాశారు. కాని అవి ఎందుకు నవ్వుతున్నాయో ' ఒకసారి ఒక కారణంవల్ల అవి నవ్వినట్లు కనపడితే, మళ్లీ అదేకారణం కల్పిస్తే నవ్వుతాయో నవ్వవో, ఆ నవ్వు తెలిసి నవ్వడమో తెలియక నవ్వడమో, ఇత్యాది విషయాలు ఖచ్చితంగా తేల్చవలసినవి, ఇంకా చాలా ఉన్నాయి. మానవుని విషయంలో మట్టుకు అలాటి సందేహాలేవీ లేవు! 'మేన్ ఈజ్ ఏ లాఫింగ్ ఏనిమల్' అని ఏనాడో పెద్దలు సూత్రీకరించారు. మానవుడికి అనాదినుంచీ జన్మహక్కుగా సంక్రమించినవి రెండు ఉద్రేకాలు ముఖ్యమైనవి-ఏడుపూ, నవ్వూనూ. సృష్ట్యాదినుంచి నేటివరకూ మానవుడు నవ్వుయొక్క అవసరాన్ని గుర్తిస్తూనేఉన్నాడు. నవ్వుతూనూ ఉన్నాడు. అయితే ఆదిమానవుడు నవ్విన నవ్వుకూ మన నవ్వుకూ చాలా తేడా ఉండవచ్చు. అతనికి నవ్వు తెప్పించిన సందర్భాలూ మనకు నవ్వుపుట్టించే సందర్భాలూ వేరుకావచ్చు. కాని నవ్వడం మట్టుకి మానవజాతికి అవసరం అనేది ప్రధాన విషయం. ప్రతినిత్యం మనం - ఏదోరకంగా అనుభవించే కష్టాలకు విరుగుడు ఈ నవ్వ ఒక్కటే. కేవలం విరుగుడే కాదు; మండు వేసంగిలో కుతకుతా ఉడికిపోతున్న శరీరానికి సంధ్యాసమయంలో వచ్చే మలయానిలమిచ్చే సౌఖ్యములాటి సౌఖ్యమునిస్తుంది నవ్వు. అంతేకాదు. కడుపులో కల్మషాన్ని ఆముదము శోధించి వెడలకొట్టినట్లు మనసులో మాలిన్యాన్ని నవ్వు శోధించి శుభ్రపరుస్తుందన్నాడు ఒక తత్వవేత్త. ఎవరు ఏమన్నా మానవుడు నవ్వకుండా బ్రతకలేడనే విషయం అందరూ ఒప్పుకున్నదే. అయితే కేన్ని చూచి నవ్వుతున్నాడు— ఎందుకు నవ్వుతున్నాడు అనే విషయం చాలా పెద్దది. వర్తమానంలో మనకు అవసరం లేనిది.

నవ్వుకు కారణాలు మట్టుకు అనేకం ఉన్నాయని పెద్దలు అంగీకరించారు. అంత సూక్ష్మ విచారణ చేయకుండా, హాస్యం, స్థూలంగా రెండు జాతులుగా విడదీయవచ్చును. ఒకటి సాంఘికం-రెండు సాంసారికం. మన ఆచారాలూ, వేషభాషలూ, కట్టుబాట్లూ, నీతినియమాలూ వగైరాలకు సంబంధించిన హాస్యం సాంఘికమూ; ప్రతినిత్యమూ, ప్రతిఇంటా ఉండేవ్యక్తుల మధ్యను జరిగే చతురోక్తులు వగైరా సాంసారిక హాస్యం.

హాస్యం ఎల్లప్పుడూ ఒక్కమోస్తరుగా ఉండదు. దేశాన్నిబట్టీ, కాలాన్నిబట్టీ మారుతూ ఉంటుంది. మానవుని నాగరికతతోబాటు బుద్ధివికాసంతోపాటు ఈహాస్య స్వరూపం మారుతూ ఉంటుంది. ఈసత్యం సాంసారిక హాస్యానికి వర్తిస్తుంది. పూర్వ కాలంలో హాస్యం ఈనాడు మోటుగా ఉన్నట్టుంటుంది. నేటి హాస్యం ముందు తరాలవాళ్లకు అదోరకంగా ఉండొచ్చు.

సంసారంలో అన్ని విషయాలకువలెనే ఈహాస్యానికి కూడా మనకు కొన్ని కట్టుబాట్లు ఉన్నాయి: పాశ్చాత్య దేశాలలో తల్లితండ్రులు పిల్లలనూ, సోదర సోదరీమణులు తమలో ఒకర్ని ఒకరు ఒక మోతాదులో హాస్య నైపుణ్యం ప్రదర్శించి వేళాకోళాలు చేసుకోవచ్చును. మనలో ఆవేళాకోళాలు చాలాదూష్యాలు. సంసారం దుఃఖమయమని తెలిసిన మన పెద్దలు ఆదుఃఖాల నుంచి తప్పించుకోడానికి హాస్యం అవసరమని కూడా గుర్తించారు. అయితే అది హద్దుమీరకుండా, గుడ్డివాడు విసిరిన రాయిలా అందరకూ తగలకుండా కొన్ని కట్టుబాట్లు చేశారు. బంధువర్గంలో హాస్య నిలయులుగా కొందరను ఏర్పాటు చేశారు. పెద్దవారిలో పురుషునికి వియ్యంకుడు-అనగా కోడలు తండ్రి; స్త్రీకి వియ్యపురాలు అనగా కోడలుతల్లి; పడుచువారిలో పురుషుడుకి తమ్ముడు భార్య, అలాగే స్త్రీకి తమ్ముడు భార్యకాని, చెల్లెలి భర్తకాని-చిన్నవాళ్లలో ముఖ్యంగా ఆడపిల్లలకు అక్కమొగుడు మగపిల్లలకు అన్నభార్య, హాస్య నిలయులవుతారనీ వారితో తను చిత్తం వచ్చినట్లు పరాచిక మాడవచ్చుననీ మనపెద్దలు నిర్ణయించారు. సమిష్టి కుటుంబాలనే మన సాంఘిక వ్యవస్థ ఈవీలును కల్పించింది. పాశ్చాత్యులలో ఇలా అందరూ కలిసి ఉండటమనేది సాధ్యంకాక పోవటం చేత నక్కడి హాస్యానికి అవకాశం కలగలేదనుకుంటాను. హాస్యం ప్రథమ దశలో క్రియాత్మకంగాఉండి - అనగా "ప్రేక్టికల్ జోక్స్" అంటారే అవి—క్రమంగా శబ్దాత్మకంగా మారినట్టే - (వెర్బల్ జోక్స్)- సాంసారిక హాస్యంలోకూడా ఈవిభాగాలు కనుపిస్తాయి.

నేను చిన్నతనంలో విన్నపాట ఒకటి జ్ఞాపకం వస్తోంది. బావా బావా పన్నీరు- బావని పట్టుకు తన్నేరు-నులకామంచం వేశారూ-నూరూ గుద్దులు గుద్దారు-పెండ్లి అయిన కొత్తలో ఏ పండుగకో వచ్చిన అల్లుణ్ణి ఇక్కడ బావమరుదులూ, మరదళ్ళూ కలిసి ఏదో ఆటలోపెట్టి, జోడించి ఇలా లఘువుగా దేహశుద్ధి చేసేవారన్నమాట. ఇవి పూర్వకాలంలో బాల్య వివాహాలు జరిగే రోజులవి. పట్నవాసాలు పెరగని రోజులు. ఈనాటి కుర్చీలు వగైరాలేని రోజులవి. అప్పుడు బావవస్తే కూర్చోడానికి కోడు విరిగిపోయిన మడత మంచమో, నులక మంచమో వేసి అతను అమాయకంగాసిగ్గుతో భయంతో కూర్చోగానే మంచం విరిగి కింద పడితే,-"అయ్యో బావ పడ్డావా! మా మంచం విరిగితే విరిగింది కాని, నీకేం దెబ్బ తగలలేదుకదా..." అని చిన్న బావమరిది ఒక వైపునా, చిన్న మరదలొక వైపునా చేయూత ఇచ్చి లేవదీస్తూంటే తలుపు చాటున నుంచుని కొత్త పెళ్లికూతురు ఓ

బావా, మరదలు

పక్క నవ్వుతూ ఒకపక్కను భర్తను దెబ్బ తగిలిందేమో చూదామని ఒకడుగు ముందుకి వేసి సిగ్గుతో వెనక్కు పారిపోతూంటే, ఈ అవమానం తన భార్య ఎక్కడ చూచిందో అని మొగం కందగడ్డ చేసుకుని లేవబోతూ, మళ్లీ పడబోతూ ఉన్న దృశ్యం చిన్నలకూ పెద్దలకూ ఎంతో ఆనందదాయకంగా ఉండేదిట ఆ రోజుల్లో.

భోజనం దగ్గరకొస్తే వడియాలలో చింతగింజలూ, గులకరాళ్లూ పెట్టి తయారుచేసి వడ్డించి పాపం ఆప్యాయంగా అతను నోట్లో పెట్టుకుని నమలబోయేసరికి పళ్లూడినంత పని జరిగితే చప్పట్లుకొట్టి నవ్వడానికి మరదలుకు హక్కు ఏర్పాటుచేశారు.

ఏ వినాయకచవితికో బావవస్తే, అతని మంచంమీద దూలగొండె కొమ్మలు పడేసి దానిమీద పక్ఛని గుడ్డపక్క వెయ్యడం. అతను చూడక పడుకోగానే వొళ్లు దురదలెత్తి, గోక్కుంటుంటే, "అయ్యో అదేమిటి బావా! అంత గోక్కుంటున్నావు!! కాస్త ఇదిరాస్తే తగ్గుతుంది ఉండు," అని కొంచెం గోమయం రాయడం సర్వజనాంగీకారమైనదే. అలాటప్పుడు బావ ఏ చికిలింత కొమ్మో తీసుకొచ్చి మరదలు నెత్తినంటించి ఓతాయిలుగారి నెత్తిమీద గోరింకోయ్... అంటే చిన్న మరదలు తల తడిమి చూసుకుంటుంది. "అత్తగారూ, మా మరదలు పాపం మొగుడుకోసం వెతుక్కుంటోంది. మీరు త్వరగా ఏదేనా సంబంధం చూస్తారా లేకపోతే...", అంటే, "ఏమిటి బావా ఛా," అని కోపంతో ముడుచుకున్న పెదవుల సందునుంచి తొణికిసలాడే హాస్యం చూచి మాతృహృదయం ఉప్పొంగిపోతూ ఉండేది అనుకుంటాను. బావ స్నానానికి రాగానే, ఉండు బావా నేపోస్తాను నీళ్లు," అని నడివేసంగిలో సలసలకాగే నీళ్ళూ, నడి శీతాకాలంలో మంచులాంటి నీళ్ళు హఠాత్తుగా మీదపొయ్యడం కూడా. మరదలు పిల్లకు జన్మహక్కులలో ఒకటి.

ఇవన్నీ సర్వసామాన్యమైన ప్రయోగాలు. ఇంతకంటె సున్నితమైనదీ, వధూవరులకు అత్యంత ఆనందదాయకమైనదీ మరొక చిన్న తమాషా ఉన్నది. అక్కడ ఎక్కడనో ఒకమూల భర్తమీద మనసు, పుస్తకంమీద కళ్లూ పెట్టుకు కూర్చుంటే, మరదలు నెమ్మ

దిగా బావనుపిల్చి, "అక్కడేదో ఉంది బావా నాకు భయమేస్తోంది," అని బావను చెయ్యి పట్టుకుని తీసుకురావడం, బావకు అక్కడి ఏముందో ఊహకు తట్టినా, ఏమీ ఎరగనట్లు మరదలు అతను జాడల్లో వెళ్ళడం, మరదలు నవ్వులు కొడుతూ పారిపోవడం పెళ్ళికూతురు ఉలిక్కిపడి, వచ్చిన భర్తను చూచి ఖంగారుపడి లేవపోతూంటే ఫరవాలేదు కూర్చోమని మీద చెయ్యి వెయ్యడం, ఆస్పర్శకు చెప్పనలవికాని ఊహింప శక్యంగాని ఆనందం ఆమె ముఖంలో వ్యక్తమవడం, ఈ అమాయకు అలాగే నిలువునా నీరవడం ఒక రకం!

ఎండవేళ బావ నిద్ర పోతున్నప్పుడు, అక్కయ్య ఏదో పని ఉన్నట్లు ఒక మాటు ఆ గదిలోకి వెళ్ళి ఏదో వెతుకుతున్న నెపం మీద భర్త ముఖారవిందం చూస్తూ, నిలబడడం ఈ కొంటెపిల్ల కనిపెట్టి గభాలున తలుపు పైన గొళ్ళెం పెట్టడం, ఈనాటికి ఆ కిటికీ చేష్టలు ఎన్నెన్నో బావ అక్కడ ఉన్నన్నాళ్ళూ మరదలికి, కవికి క్రొత్త క్రొత్త ఊహలు తట్టిస్తూ తట్టుతూనే ఉంటాయి. నిత్యం బావకూ, ఇంట్లోవాళ్ళకూ నూతన ఆనందాన్ని కల్పిస్తూనే ఉంటుంది మరదలు.


అవి బాల్యవివాహాల రోజులని, చెప్పాను కాదూ. పెండ్లికూతురే పన్నెండేండ్ల పిల్ల అయితే, మరదలు పిల్లకు ఎనిమిది తొమ్మిదేండ్లకంటె ఎక్కువ వయసు ఉండేది కాదు. అందుచేతను ఈ బావా మరదళ్ళ హాస్యం ఎక్కువగా క్రియా రూపంలోనే పరిమితమై ఉండేది. మాటలతో వేళాకోళాలాడుకోడానికి వయసు చాలదు. అక్కడికీ మాటకారి మరదలు ఊరుకోక, ఏదో విసుగు విసురుతూనే ఉంటుంది. మామగారు ఊళ్లో పని చూసుకుని ఇంటికి వచ్చి, స్నాన సంధ్యాది అనుష్ఠానాలు అయేసరికి భర్తకి వేళ అతిక్రమించి, ప్రాణంబులున్ రావుల్ దప్పెను, మూర్ఛవచ్చె తనువున్ డస్సెన్, శ్రమం బయ్యెడి సు...అంటూ వ్యంగ్యంగా కూనురాగాలు తీసే అల్లుడిని "తే నాయనా కాళ్లు కడుక్కో..." అనే అత్తగారి అమృతవాక్కులు పూర్తి కాకుండానే "అమ్మా, బావకు ఆకలి లేదు—ఈపూట భోజనం చెయ్యడట," అని మరదలు ముందే సమాధానం చెపుతుంది. విస్తరి దగ్గర కూర్చుని భోజనం చేస్తున్నంతసేపూ అల్లుడికి ఇష్టమని చేసిన కూర, పిండివంట వగైరా వడ్డిస్తుంటే, "అయ్యయ్యో! ఇవి చేశావేమిటే అమ్మా! బావకవి సయించవ"నీ, "ఆ వడ్డనేమిటే అమ్మా అతను వద్దు మొర్రో అంటుంటేనూ," అని ఏదో వాగుతూనే ఉంటుంది. ఇంతకంటె కాస్త ముదిరిన మరదలు ఏమిచేస్తోందో చూశారా! ఒకరోజు మధ్యాహ్నం భోజనానంతరం బావ గదిలో ఏదో చదువుకుంటున్నాడు. సావిట్లో ఇంట్లోవాళ్ళు, పక్క ఇంటివాళ్ళు కొందరూ కూర్చొని కబుర్లు చెప్పుకుంటుంటే వీధిలో గాడిద అరుపు వినపడ్డది. వెంటనే మరదలు, "అబ్బబ్బ, ఏమిటర్రా మీ సోది. ఒక్కమాటు ఊరుకుందురూ, బావ ఏదో పాడుతున్నాడు విందాం..." అని అందరినీ కడుపు చెక్కలయ్యేటట్లు నవ్వించింది. బావకూ వినపడ్డది ఈమాట. ఏమంటాడు పాపం.


ఇటువంటి సందర్భంలోనే ఈ నాటి మరదలు ఈలాటి విసురు ఒకటి విసిరింది. వాళ్ళంతా చీట్లపేక — బావతో సహా — ఆడుకుంటుంటే వీధిలో కుక్క ఒకటే అరవడం మొదలెట్టింది. "అబ్బా వెధవ కుక్క చంపేస్తోంది," అన్నాడు బావ వెంటనే మరదలు, "అలా విసుక్కుంటే ఎలాగు బావ? పాపం అది హిస్ మాస్టర్స్ వాయిస్! అనగా నీమీద గౌరవంచేత నీ గొంతులా ఉండాలని సాధకం చేసుకుంటోంది," అన్నది. బావకూడా ఈ చమత్కార వచనం మెచ్చుకోక తప్పింది కాదు.

ఎంత వేళాకోళం చేసినా, ఎంత వెక్కిరించినా బావకు మరదలు మీద మక్కువ ఎక్కువగా ఉండానికొక ముఖ్యకారణం ఉన్నది. బావకు స్నానానికి నీళ్ళు తోడి ఇవ్వడానికి, తుడుచుకోడానికి తువ్వాలు వగైరా సిగ్గుపడుతున్న అక్కచేతుల్లోనుంచి లాక్కుని బావకందివ్వడానికి, భోజనానంతరం అక్క చుట్టి ఇచ్చిన తములపాకు చిలకలూ, పోకచెక్కలూ అందివ్వడానికి ఎంతో సరదాగా సహాయపడుతూ ఉంటుంది. అంతేకాదు, అక్కాబావల మధ్య రహస్యవార్తాహారిగా ఉపయోగపడుతుంది. వారి అమాయికమైన ప్రథమ ప్రణయలేఖలను భద్రంగా అందివ్వడానికి సరియైన టపాజవాను మరదలుకంటె మరెవ్వరు దొరుకుతారు నమ్మకమైనవాళ్ళు? వాళ్ళు ఎప్పుడేనా ఒకటిరెండు నిముషాలు మాట్లాడుకోడానికి సంకేతస్థలం చూపించడానికి, ఆసమయాల్లో అటుకేసి మరెవ్వరూ రాకుండా కాపలాఉండడానికి దూతికగా, రహస్య సంరక్షకురాలుగా ఈనూతన దంపతులకు జీతభత్యాలులేని వాలంటరీచేసేది మరదలు. వీటి అన్నిటికీ మెచ్చి, బావ ఒకొక్కప్పుడు భార్యమూర్తిని మనసులో నిలిపి మరదలును ఆలింగనంచేసుకుని ఒక్క ముద్దుతో తనకృతజ్ఞత వెల్లడిచేసుకునేవాడు. అప్పుడు మరదలు సంతోషం పట్టలేక, "ఛీబావా—నేను అక్కయ్య ననుకుంటున్నావా ఏమిటి?" అని విడిపించుకుపోతుంటే, బావకూడా కొంటెతనంగా, "అక్కయ్యవనుకోడం లేదులే — నువ్వే ననుకుంటున్నాను; శృంగారంలో ప్రథమ పాఠాలు నీకు నేర్పడం నీ భవిష్యత్తుకు చాలా మంచిదనితోచింది," అనే బావను ఒక్కతోపుతోసేసి, "నువ్వేం నేర్పక్కరలేదు," అని మరదలు మూతి ముడుచుకునేది. "ఓహో, అయితే నా రాబోయే తమ్ముడే నేర్పుతాడు లే," అని బావ అంటే—"ఛీ, నాకెవ్వరూ నేర్పక్కరలేదు," అని అనాలోచితంగా అన్నమాట మరదలనగానే, "అలాగా! అయితే, నీకిదివరకే తెలుసునుకాబోలు. అయితే మా తమ్ముడికే నువ్వు నేర్పుతావన్నమాట." అనే బావమాటలకు సమాధానం చెప్పలేక, లోపలనుంచి నిర్హేతుకంగా పొంగివచ్చే ఆనందాన్ని అణచుకొని, "కోతి మాటలు! కోతి" అని ఎక్కిరించే మరదలు వెయ్యేళ్ళు సుఖియై సౌభాగ్యవతియై వర్థిల్లాలి!

ఇటువంటి పరాచికాలు, కేవలం సకర్మకమునైనా ఆనాటి పిన్నలకూ, పెద్దలకూ చెప్పలేని, విలువలేని ఆనందడోలికలమీద సంసారం సాగేటట్లు చేసేవి. నూతన దంపతుల ప్రథమ సమాగమానికిది నాందిగా ఉండేది. వారి ప్రథమ పరిణయానికి, ప్రణయానికి ఒక వింత సుకుమార సురభిళమైన పూలబాట ఏర్పాటుచేసేది, ఈ మరదలు పిల్ల. కొత్త ఊరికి, కొత్త ఇంటికి, కొత్త బంధువులమధ్యకు వచ్చిన బావ హడిలి బెజారై పారిపోకుండా ఈ చిట్టిమరదలు, తన ఆటలతో, నవ్వులతో, పరాచికాలతో అంధకారంలో ఉన్న భవిష్యత్తును కొంచెం తెర తొలగించి గారడీవానిలా దూరాన్ని ప్రకాశించే రాగరేఖలను చూపించి, ఇక్కడికి మళ్లీమళ్లీ రావాలనే వాంఛ కలిగించేది బావకు. బావ భావిజీవిత ఆనందస్వరూపాన్ని గూర్చి వింతవింత కలలు కనేటట్టు చేసేది ఈ చిన్నిపిల్ల. వివాహం అంటే ఇదా? సంతోషం అంటే ఇదా? సంసారం అంటే ఇదా? అయితే యింకేంకావాలి అనుకునేటట్టు మైకంలో పడేసేది బావని. మరదలిదంతా కేవలం నిస్వార్థంగా చేస్తోందనుకుంటారేమో! కాదని నా నమ్మకం. బావ రాక, బావతో పరిచయం, బావతో పరాచికం, ఆ అమాయికపు బాలకుకూడా అనిర్వచనీయమైన ఆనందం కలిగించేది. హృదయం వికసించినట్టుండేది. ఏవేవో సుఖస్వప్నాలు వచ్చేవి. తనకూ పెండ్లి అయితేనా

(56-వ పేజీ చూడండి)


JASMINE
మీరు అందంగా కనపడతారు
జస్మిన్
రేయాన్ సిల్కులో
జస్మిన్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, బొంబాయి - 2



ఏకలవ్యుడు

ముళ్ళపూడి వెంకట రమణ

[గతసంచిక తరువాయి]

"ఓ ప్రేమకథా! నీదారి సదా అస్తవిస్తం గానే సాగిందిగదా. వెనకటికి లైలా మజ్నూ. దరిమిలానో ఆవనకో రోమియో జూలియట్. ఇప్పుడు సీతా నేనూ.. నాన్నలూ మావయ్యలూ, సంఘం దగ్గసరి గోడలూ ప్రేమికులని ఎంతో బాధ పెడుతున్నాయి గదా!" అంటూ గురునాథరావు భగ్నహృదయం విసరిన శాపనార్థాంతరన్యాసాలే అలా రాళ్ళయి నెత్తిన పడుతున్నాయని వాళ్లు పసిగట్టలేకపోయారు. ఒకరిద్దరికి తెలిసినా, 'ఆ ముక్క పైకి అంటే లాయరు సుబ్బారావుగారికి కోపం వస్తుంది బాగుండద'ని, నోరు మూసుకూరుకున్నారు.

అలా కోపంగా శాపనార్థాలు గుప్పించడం అయిపోయిన తరువాత గురునాథరావుకి దుఃఖం, ఈ లోకంలో తక్షణం తన జీవితం 'అభావం' అయిపోవాలన్న సంకల్పం మరింత ఎక్కువ అయ్యాయి. ఈ స్థితిలో ఒంటరిగా ఉండటం మంచిదికాదని తోచి, మర్నాడు ప్రొద్దుటే లేచి, తుకారాముణ్ణి వెతుక్కుంటూ బయల్దేరాడు. తుకారాం ఇప్పుడు రోడ్ల వెంట తిరగటం లేదనీ, తుకారాం న్యూస్ సర్వీస్ ఆఫీస్‌లోనే కూర్చుంటున్నాడనీ తెలిసింది.

వెళ్ళగానే కెలిపతిరావు ఎదురయ్యాడు. "హలో గుడ్ మార్నింగ్. మీరు ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నారు గదూ. రైటే. కాకూడా మార్గాంతరం తోచలేదు. కానివ్వండి. విషయాలు, మంచి హాస్యంగు పెట్టి మెడ్రాసు పంపిస్తాను. "ప్రముఖ ప్రేమికుడి ప్రపంచాంతర ప్రయాణం" అని." అన్నాడు కెలిపతిరావు.

గురునాథరావుకి చిరాకేసింది.

"నీ కెలిపతీ మండ" అని విసుక్కున్నాడు.

"మరేంటి నా పేరే కెలిపతిరావు. ఆ వేళ రాత్రి వచ్చింది నేనేనండి...అరె అలా కోపంగా చూస్తారేం? కొడతారా ఏమిటి కొంపతీసి" అంటూ అర్జెంటుగా పక్క గదిలోకెళ్లి తలుపేసుకున్నాడు కెలిపతిరావు.

* * *

గురునాథరావు విచారంగా ఇంటికెళ్లి తన డైరీతీసి సీతకథను చదువుకుంటూ కూర్చున్నాడు. క్రితంగోజు సాయంత్రంవరకూ జరిగిన సంఘటనలన్నీ చదివి ఆగాడు.

ఈ కథని ఎవరైనా సినిమా తీస్తే ఈ ఘట్టంలో హీరో చేత ఒకసారి నిట్టూర్పించి, డ్యూయెట్ మొదలెట్టించి, తొలీ చరణం కాగానే, పక్కవాటాలో ఉండే హీరోయిన్ దగ్గిరికి కెమెరాని పాన్ చేయిస్తారు. ఇక్కడో చిక్కొచ్చే మిటంటే సీతకి పాట రాదు. అయితే పాన్ చేసిన కెమెరాని కొంచెం అసంబా జరిపితే అక్కడ, మంత్రి పదవి లభించలేదని మథనపడుతున్న లాయరు సుబ్బారావుగారు దొరుకుతారు. ఆయనా మంత్రి గిరీ తప్ప మరోటి గిట్టని ఏకలవ్యుడే కాబట్టి ఈ ఘట్టంలో ఈ ఏకలవ్యద్వయం మీద డ్యూయెట్ చిత్రించవచ్చును.

సరే బరువుగా నిట్టూర్చబోయాడు గురునాథం. కాని ఆ పనిని అరక్షణంలో ఇంకెవరో చేసిపెట్టారు.

"ఆశ్చర్యపడకు నేనే నేలే" అన్నాడు తుకారాం. (డ్యూయెట్ ఛాన్సు పోయె)

"దానికీ ఓపిక లేదు." అన్నాడు గురునాథరావు. వెనక్కి తిరిగి చూడకుండానే.

"మరేం ఫరవాలేదు అదే వస్తుంది. సీతకి గణపతిరాయుడుగారి సంబంధం ఖరారైనందువల్ల, నీకా పిల్ల లభించడం కల్ల. గారంటీ ఇస్తున్నాను... నేను తుకారాం న్యూస్ సర్వీస్ మానేసి తుకారాం గారంటీ సర్వీసు పెట్టానులే." అన్నాడు తుకారాం నవ్వుతూ.

మతిపోయి ఏడుస్తున్న వాడికి, శ్రుతిమాని మరీ కొనిమ్మని యతిప్రాసాదియుతమైన వాక్యంలో సలహాలివ్వటం, చూచేవాళ్ళకు సరదాగా ఉంటుందిగాని, ఆ స్థితిలో ఉన్న గురునాథరావులకు కాదు. అందుకని అతనికి కోపం వచ్చింది. జుట్టు పీకేసుకోబోయి, అంతపనీ చేశాడు. నెప్పెట్టింది. పైగా క్రాపింగు రేగిపోయింది.

"చూశావా తొందరపాటువలన కట్టుగు నష్టములు? ఇప్పుడు మళ్ళీ పాపిడతియ్యడం

"ఆరగంట పని" అన్నాడు తుకారాం బిక్క ముహం పెట్టి నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"కాదు. ఐదునిముషాల పని." అని గురునాథరావు చివాలునలేచి చరచర సెలూను కెళ్లి తిక్క కోపంలో గుండు చేయించుకొచ్చేశాడు.

రాగానే రామనాథంగారూ, ఆయన భార్యా కూడా మండిపడ్డారు. గురునాథం గుండు చూసి. "మేం ఇద్దరం పోయామనుకున్నావా" అన్నారు.

గురునాథం దిగాలుపడిపోయాడు. ఆ కోపడం పోవడం అలాగే మంచిదారిన పడిపోయి దారుణమైన శ్రద్ధతో పుస్తకాలు చదివెయ్యడం మొదలెట్టాడు. కొద్దిరోజుల్లోనే క్లాసులో వెనక బెంచీల వాళ్ళంతా అతన్ని వేలేసి ముందరికి నెట్టేశారు. అందరు అలా తరిమికొట్టేసరికి గురునాథం చివరికి ముందు బెంచీల మంచి విద్యార్థుల్లో కలిసిపోయి వాళ్ళని మించిపోయాడు. "ప్రతి టెస్టులోను అతనే ఫస్టు" అని అందరూ ముక్కున వేలేసుకు చెప్పుకోసాగారు.

'ఓడలు బండ్లవును' అని చెప్పుకు వాపోయారు వెనక బెంచీలవాళ్లు.

లెక్చరర్లంతా కలిసి, గ్రీవాలు కలవకపోయినా కొంత అటూ ఇటూగా ముక్కంఠంతోనే "బ్రిలియంట్ స్టూడెంట్" (అనగా ప్రకాశించే విద్యార్థి) అనేశారు పుసుక్కున.

ఇంకేముంది. అక్కడితో గురునాథరావు ఊహూ ప్రకాశించిపోవడం మొదలెట్టాడు. అతని గురించి కట్టుకథలు ప్రచారంలో కొచ్చాయి.

"...వాళ్లింట్లో రాత్రిళ్ళు దీపాలు వెలిగించడం మానేశారట తెలుసా...అతను చీకట్లో పుస్తకం చదివెయ్యగలడట మామూలుగా...మరి ఆ ముఖద్యుతి అంతా అందుమీదే పడుతుంది గదా...అని చెప్పుకొన్నారు కథలు కొందరు.

తుకారాం ఒక కథ అల్లేశాడు. "ఒకరోజు రాత్రి ఓ కుర్రాడు లైటు లేకుండా సైకిలు తొక్కడం పోలీసు చూశాడు. వాణ్ణి

ఆపి అడిగేలోగా ఆ వీధి అంతా కళ్ళు మిరుమిట్లు గొలిపే కాంతితో నిండిపోయింది. పోలీసువాడు ఇది పగలు కాబోలు అనుకుని, వాలిక్కూరచుకొని వెళ్లిపోయాడు. కాని అంతలోకే మళ్లీ చీకట్లు కమ్మాయి కారణం ?

గురునాథరావు ఆ రాత్రి ఇంటికెళ్తూ ఆ వీధిలోంచి ఓ సందులోకి మళ్ళెను. ఆ కాస్సేపూ అతని కాంతితో ఆ రాత్రి పట్టపగలన్న భ్రమ కలిగించెను.....

*   *   *

ఇలా విపరీతమైన ఉపాఖ్యానాలతో గురునాథరావు ప్రఖ్యాతి విస్తరించింది. అక్కడినించి ఆడపిల్లల్ని కనుక్కున్న తలితండ్రులు తమపిల్లనంటే తమ పిల్లని చేసుకోమంటూ గురునాథం తండ్రిని బ్రతిమాలసాగారు. కట్నాలు ఎంతైనా ఇస్తామన్నారు.

కాని గురునాథరావు ఏ ఒక్క పిల్లని కన్నెత్తి చూడలేదు. పన్నెత్తి పలకరించలేదు. అక్కడితో అతనిగిరాకీ మరింత పెరిగింది. అంతా ఆశ్చర్యపడిపోయారు. ఎంత ప్రేమేనా మరీ ఇంత ప్రేమా అని విసుపోయారు గురునాథరావు "ఏకలవ్యు"డని తెలిసినవాళ్ళు.

తుకారాం ఓరోజు పాండురన్న గారంటే సర్వీసులో "పెళ్ళిళ్ళ బ్యూరో" శాఖ పెట్టానన్నాడు. అని, పదిమంది ఫోటోలు పట్టుకొచ్చేసి చూపించాడు

"అబ్బీ ! ఈ పిల్లని చూడు. ఇంజనీరు. ఆస్తి: పదెకరాలు, మేడ, కారు. ఈ బొమ్మ చూడు : గవర్నమెంటు ఖర్చను. రెండు కార్లు. పోనీ ఇది చూడు. పెద్ద బిజినెస్ మాను. ఏకబిగిని పదిమంది ఆడపిల్లలికి పెళ్ళిచేసేటంత ఆస్తి, ఇద్దరే కూతుళ్ళూ ఉన్నారు. ఇదిరెండోది."

గురునాథంవిసుక్కున్నాడు. "ఇంజనీర్లనీ డాక్టర్లనీ నే నెక్కడ చేసుకోనురా. బియ్యే కూడా కాను అయినా కాపోయినా సీతని తప్ప ఇంకోళ్ళని చేసుకోను" అన్నాడు.

తుకారాం జాలిపడ్డాడు. "ఇంజనీరూ డాక్టరూ చేస్తున్నది అమ్మాయిలు కాదు. వాళ్ళనాన్నలు. వాళ్ళ ప్రభ్వైనంచెబుతున్నా అదేముఖ్యం అనుకున్నా ఒకొక్కడూ డజనేసి అల్లుళ్ళకి జోడొందల ఉద్యోగాలిప్పించగలడు. ఇగో ఈ చివరిబిజినేస్ ఆయన్ని, అదే ఆయన కూతుర్ని చేసుకుంటే, ఇంకో లాభం ఉంది. లావుపాటి బావమరిది దొరుకుతాడు. ఎవర్నైనా తన్ని రమ్మంటే ఇట్టె చితగ్గొటి చక్కా వస్తాడు,"

"గెటౌట్" అన్నాడు గురునాథం.

"దానికేం మా భాగ్యం కాని, ఈబొమ్మలు గల పన్నెండుమంది పెద్దలికీ కూడా మా తుకారాంగారంటే సర్వీసువారు గారంటీలు రాసిచ్చేశారుగదా. తప్పక నిన్నొప్పించగలమని ఇందులో ఏ ఒక్కర్ని నువ్వు కాదన్నా సరే. మా ఆఫీసుకి పేరుపోతుంది"

"షటప్" అన్నాడు గురునాథం ఉద్రేకంతో.

అయితే నీ ఈ విషాదగాథ ఏమన్నా ఓ, సాగేట్టు," అన్నాడు తుకారాం చిన్నబుచ్చుకుని.

గురునాథరావు కోపం దిగమింగి కపం మీద చిరునవ్వు ప్రచురించాడు. "శిష్య ఇద్ది అనంతం" అంటూ.

"నాన్సెన్స్ వల్లకాదు. నీ కథకి చప్పని పులిస్టాపు పెట్టించేసి, అదికాస్తా రాసేసి, దాంతో తుకారాం స్టోరీ సిండికేటు ప్రారంభిస్తాం కాసుకో" అని చక్కాపోయాడు తుకారాం.

*   *   *

గురునాథరావు తండ్రి రామనాథం గారికి ఒళ్లు మండిపోయింది కొడుకు వరస చూసి. ఏదో ఓ సంబంధం ఖాయపరిచి తీరాల్సిందే అన్నాడు కాలు నూరుతూ.

గురునాథరావు అప్పటికి పిల్లి అయిపోయి తనగదిలో కెళ్లి, తల్లిద్వారా తండ్రికి మెలిగా తన ఊహ చెప్పించాడు.

"కల్ల" అన్నారు రామనాథం గారు గంభీరంగా కిటికీ అవతలికి చూస్తూ.

"అదే బావుందండీ! ఇదేం సినిమా అనుకున్నారు టండీ అలా ఒక్క ముక్కలో తేల్చేసి అలెట్లో మూస్తారు? నూరేళ్ళబతుకు. కుర్రవధవ భయపడుతున్నాడు! పిల్చి కనుక్కోండి సరిగ్గా" అందావిడ.

పిల్చి కనుక్కున్నాడు రామనాథంగారు. సిగ్గుపడుతూ 'ఔను అన్నాడు గురునాథం.

మరిసీతకి ఇష్టమేనా? అన్నాడు తండ్రి.

గురునాథం చాలాసేపు జవాబివ్వలేదు. ఆనక తల్లివంకచూసి, తల వంచుకుని, 'తెలీదు' అన్నాడు మెల్లిగా.

రామనాథంగారు పగలబడి నవ్వారు. "ఏమిప్రయోజకుడివిరా నాతండ్రి" అంటూ.

"నా వెర్రినాన్నా ఎలా బతుకుతావురా నోట నాలుక లేనివాడివి!" అని ఊహ ఇద్దైపోయింది వాళ్ళమ్మ.

"అదే ఆ సీతే తగును వీడికి. ఇన్నాళ్లు ఆ తిక్కముండాతండ్రిని పెంచుకోస్తోంది గదా ఇంక ఈ వెర్రిబాగుల మొగుణ్ని కూడా సాకుతుంది. ఆసుబ్బారావుగారువిమంటాడో చూడాలి మరి"

"సీత కిష్టమేలెండి ఒకటి రెండుసార్లు కదలేసి చూశాను" అందాయనభార్య

గురునాథం బుర్ర గిర్రున తిరిగిపోయింది. సిగుపడుతూ గదిలోకి పరుగెత్తి "హోయిగా హా" అనే పాట పాడబోయి, వరస కుదరక మానేశాడు.

"జడ్డి వెధవ" అన్నాడు రామనాథం గారు నవ్వుకుంటూ.

*   *   *


ఆయన బళ్ళొకెళ్ళబోతూ ఉండగా తుకారాం రివ్వున పరిగెత్తుకొచ్చాడు.

"నమస్కారం అండి. నా పేరు తుకారాం నేను గురువులు ఫ్రెండుని" అన్నాడు వినయంగా.

"గురువు లెవడోయ్" అన్నాడు రామనాథంగారు చిరాగ్గా.

"అదే మీఅబ్బాయండి. మిమీన్ గురునాథం"

"ఏమిటో మీనూ మానూను. ఏం చదు



ఏకలవ్యుడు

తుకున్నావు నువ్వు. ఒక్క వాక్యం సరిగా మాట్లాడలేక పోతున్నావు. ఏం సంగతి" అన్నాడు రామనాథంగారు.

"మీరు కొంచెం గణపతిరావుగారింటికి రావాలండి. అక్కడ మీ సుబ్బారావుగారూ గణపతిగారూ పోట్లాడుకుంటున్నారు. మిమ్మల్ని కేకేసుకు రమ్మన్నారండి...! అసలేమిటంటే—"

రామనాథంగారు సరాసరి గణపతిగారింటికి చరచర వెళ్ళాడు. తుకారాం వెనకాలే వెళ్ళాడు.

"ఊఁ ఏమిటి దెబ్బలాట." అన్నాడు రామనాథంగారు దారిలో.

"మరి వరసన్నగారొచ్చారు గదండీ మద్రాసునుంచీ—"

"ఆయనెవరు?"

"ఆయనా డోళ్ళవర్తకుడనుకుంటానండి"

"ఏమిటి? డోళ్ళా?"

"మరేండి. డోళ్ళు. పెళ్ళికి వాయిస్తారూ, అవి. ఆయన అస్తమానం డొక్క చీల్చి డోలుకడతానంటాడుగా. అలా చేస్తాట్టలెండి నిజంగానే. అలాని చెప్పాడు ఆయనే. మరిఅలా కట్టినడోళ్ళు అమ్ముకుంటాడని నా అభిప్రాయం."

"నీ అభిప్రాయా లొదిలేసి సంగతి చెప్పవోయ్" అన్నారు రామనాథంగారు.

"అదేమిటండి, నాకూ రాజకీయాలు తెలుసు. నేనూ పొలిటికల్ వాణ్ణే"

"అందుకే...సర్లే తరవాత?"

5

తరవాతే కథ అడ్డంతిరిగింది. వరసన్నగారొచ్చేవరకూ గణపతిరావుగారూ, సుబ్బారావుగారూ ఇల సాటిలేని నేస్తాల్లా మునిసిపల్ ఎలక్షనుకు సన్నాహాలు చేస్తున్నారు. ఛైర్మనుగిరీకి పోటీచేస్తున్న రెండో ఆసామి కట్టుదిట్టంగా 'ధనుర్ధారి'యై ఎన్నికల సమరరంగంలో దిగాడని తెలిసి గణపతిరావుగారు కొస్త బెదిరారు. ఎందుకేనా మంచిదని మద్రాసునుంచి వరసన్నగారిని పిలిపించారు. ఆయన అసెంబ్లీకి పోటీ చేసి ఓడిన వ్యక్తి. గెలిచిఉంటే మినిష్టరైపోయేవాడే. అందుకని ఆయన చెబితే జనం వింటారని గణపతిగారు ఆశపడి రమ్మన్నారు.

తీరా వరసన్నగారొచ్చాక ఆయనతో సుబ్బారావుగారికి జోస్తీ ఎక్కువైపోయింది.

ఆ వరసన్నగారు అవబోయిన మినిష్టరు; తనేమో అవబోయే మినిష్టరు. ఎలాగేనా ఇద్దరూ ఒక ఛాయావాళ్ళవుతారు. ఆముక్క వరస్నగారే అన్నాడు.

సుబ్బారావుగారు పొంగిపోయాడు.

ఈ 'మినిష్టర్ల' సరసాలకి గణపతిరావు రావు తట్టుకోలేకపోతున్నాడు.

బియ్యే పరీక్ష తప్పినవాడి దృష్టిలో స్కూలుఫైనలు పరీక్ష అంత లోకువగా కనబడింది వరసన్నగారికి మునిసిపల్ ఎలక్షను.

"ఇదీ ఓ ఎన్నికేనా. ఈపాటిదానికి సాయాలూ ప్రచారాలూ ఎందుకూ. నేనో చిన్న చీటీ రాస్తాను దాన్ని అచ్చుకొట్టించి పంచి పెట్టేస్తే చాలు" అన్నాడాయన.

మరే ఇంతోటి ఎలక్షనుకీ అంత కన్న ఖర్చుదండుగ అన్నాడు సుబ్బారావుగారు హుషారుగా.

గణపతిగార్కికి ఒళ్ళు మండిపోయింది. "ఏమిటండీ మీ హేళన ఒక్కలా. నిన్నటినుంచి మిడిసిపడిపోతున్నారు. చావఉంటే గెలవండి చూద్దాం. లోకువగా మాటాడినట్టు కాదు" అన్నాడు విసురుగా.

సుబ్బారావుగారు తెల్లబోయి నిర్జీవంగా నవ్వుతూ వరసన్నగారి వంక చూశాడు.

ఆయన పేపరులో దాక్కుని తెగ చదివేస్తున్నాడు.

"ఆయనవంక చూస్తారెందుకూ? ఆయనా ఓరాయి విసుర్తాడనా? విసిర్నా ఆయనకైతే చెల్లింది. చెల్లినా ఆయన అలా విసరడు. ఆయన మిత్రుడు; మీరు కాబోయిన బంధువులు. అదే తేడా" అన్నాడు గణపతిగారు.

కథ ఈ ఘట్టంలో ఉండగా చూడవచ్చిన తుకారాం, అదనుచూచి, "సుబ్బారావుగారు దేవుడంటి మనిషండి. ఆయన్ని నిష్కారణంగా మాటలనకండి" అనేసి పరుగెత్తుకు చక్కాపోయాడు రామనాథంగారిని కేకేసుకు రావడానికి.

* * *

రామనాథంగారు సావట్లో అడుగుపెట్టేసరికి "ఇలాటి వాడికి నేను చచ్చినా నా పిల్లనివ్వను" అంటున్నారు సుబ్బారావుగారు.

"మీరిస్తే చేసుకునేవా డెవడు మా పిల్లాడికి సవాలక్ష సంబంధాలొస్తున్నాయి" అంటున్నారు గణపతిరావుగారు.

వరసన్నగారు నవ్వుతూ చుట్టతీసి అగ్గిపెట్టెకోసం వెతుక్కుంటున్నారు.

తుకారాం చటుక్కున గుమ్మందాటి పూలమొక్కల దగ్గరున్న పచ్చగడ్డిపరకలు నాలుగుతెచ్చి గణపతిరావుగారికీ సుబ్బారావుగారికీ మధ్యన పడేశాడు.

అది భగ్గుమంది.

వరసన్నగారు గబుక్కునలేచి, ఆ మంటలో చుట్ట ముట్టించి పొగ పీల్చారు తృప్తిగా.

"అదేపాయె లెండి సుబ్బారావుగారూ. మా గణపతిగారబ్బాయికి పిల్లని మీ రివ్వకపోతే నే నిస్తాను. ఏమంటారు బావగారూ?" అన్నాడు వెటకారంగానవ్వుతూ.

"శుభం" అన్నారు గణపతిగారు.

"బావగారూ ఇంక మనం ఇంటికెళదాం రండి. ఇక్కడేం పని" అని సుబ్బారావుగారి భుజంమీద చెయ్యేసి ఇవతలికి తీసుకొచ్చారు—అంతవరకూ మాట్లాడకుండా నిల్చున్న రామనాథంగారు.

"సుబ్బారావుగారూ మీరు అర్జెంటుగా మీ సీతమ్మకి పెళ్ళి చేసేస్తే మీ మాజీ బావగారికి చెప్పుదెబ్బ కొట్టినట్టవుతుందండి" అన్నాడు తుకారాం.

రామనాథంగారు ప్ అన్నారు. కోపం రెచ్చగొట్టే ఆ మైకంలో ఉండగా వాగ్దానాలు పుచ్చుకోడం ఆయనకి సుతరామూ ఇష్టంలేకపోయింది.

నిశ్శబ్దంగా ఇంటికెళ్ళారు.

అక్కడ కూచుని, సుబ్బారావుగారు మంచినీళ్లుతాగి తేరుకున్నాక కర్తవ్యం ఏమిటన్నారు విచారంగా.

"కర్తవ్యం మీవంటివారికి నేనా చెప్పేది?

(27-వ పేజీ చూడండి)

రంగని అంతరంగం

"ఒరేయ్ రంగా! నిజంచెప్పరా! లచ్చి మీద నీకు మనసుందంట్రా?" రాముడు ప్రశ్నించాడు.

రంగడు మౌనం వహించాడు. నోట్లో వున్న చుట్టను ఎడంచేత్తో తీసి, కాండ్రించి ఉమ్మేశాడు. ఆ బడ్డీకున్న నిలువుటద్దంలో తనరూపాన్ని చూసుకొని మురిసిపోయాడు.

రంగడు! ఒట్టి రంగడుకాడు. ఆ వూళ్లో ఉన్న ఆబాలగోపాలమూ తనపేరు వింటేనే హడిలిపోయేట్లు చేసుకున్న ప్రఖ్యాత "రౌడీ" రంగడు! చేష్టలతోనే రౌడీ అనుకోనక్కర్లేదు. రూపాన్ని చూసి వూహించవచ్చు. దుబ్బుతల, ఎర్రగా చింతనిప్పుల్లా ఉండే అతని నేత్రద్వయము, బుగ్గమీసాలు, దృఢకాయం, ఆజానుబాహులు, గళ్ల లుంగీ, చారల బనియన్, కుడిచేతిలో భీమునిగదలా దుడ్డుకర్ర, కాళ్లకి కిర్రుచెప్పులతో ప్రకాశించే రంగణ్ణిచూసి 'రౌడీ' అని ఏ వ్యక్తి అనుకోడు?

రంగడు తన ఎడమచేతిలోఉన్న చుట్టను తిరిగి నోట్లో పెట్టుకుని, రెండు దమ్ములు గట్టిగాలాగి గాలిలోకి వదిలాడు.

"యాందిరా నువ్వంటుండావ్?" రంగడు అడిగాడు.

రాముడు సందిగ్ధంలో పడ్డాడు. నిజంగా రంగడు తనప్రశ్న వినలేదా? వినేవుండి మరల ప్రశ్నిస్తున్నాడా? వినే మళ్లా ఎందుకు అడుగుతున్నాడు? అతని భార్యను గురించి అడిగినందుకు తనమీద కోపంరాలేదు కద! ఛ!...రంగడి కంత త్వరగా కోపం రాదు. అతని భార్యనుగూర్చి అతనే అనేకసార్లు తనతో (తను ప్రాణమిత్రుడు గనక) ప్రస్తావించాడు. తనుకూడా అతని భార్య గురించి అడిగాడు. అప్పుడులేనికోపం ఇప్పుడెలావచ్చింది? చిట్టచివరకు రంగడుతనప్రశ్న వినేవుండడని నిర్ధారించుకుని రాముడన్నాడు.

"నీకు నీపిల్లంమీద పిరేముందంట్రా?"

రంగడు బిగ్గరగా నవ్వాడు.

"ఓరి రాంగా! ఈ రంగడి మనసులో నా లచ్చికేరా పెదమత్తానం" అన్నాడు మీసం దువ్వుకుంటూ.

"ఓరెల్లరా! నీ గాసులు నాకాడా! నీదంతా కపటం."

"రాంగా! వడుం ఇరగ్గొట్టేత్తాను. నాకాడిట్టాటి మాతలు మానేవంటే."

"లాపోతేందిరా! లచ్చెల్లి ఎన్నాలౌద్ది? ఇయ్యాల్టికి సరింగా ఏడున్నొక్క రోజు. పాపం...ఆపిల్లే ఎల్లగానే కాండ్రేసింది. దానికి ఎదురుజవాబేశా? చెప్పవోం దొంగ నాయాలా! ఇంకో నామీద కోపం సేత్తన్నావే యదవానీ యదవ."

రంగడు నిర్ఘాంతపోయాడు. నిజమే! తను రాంగాడిమీద కేకలేస్తాడెందుకు? లచ్చి వెళ్లి ఇవ్వాల్టికి ఎనిమిదిరోజులు. పురిటికని పుట్టింటి కెళ్ళింది. చేరినరోజునే కార్డురాయించింది. జవాబు రాయమని మరీ మరీ చెప్పింది. కాని, తనిన్ని రోజుల నుంచి జవాబే రాయలేదు. పిచ్చిలచ్చి. ఏమనుకుంటుందో ఏమో! తన స్నేహితుడే! తన స్నేహితుడే తనకు లచ్చిమీద ప్రేమ లేదనంటుంటే ఇక సొంతభార్య ఏమనుకుంటుంది? లచ్చి! తనంటే ప్రాణం ఒదుల్తుంది. తను క్షణం కనిపించకపోతే ఎంతో ఆదుర్దా పడుతుంది.

ఈ ఆలోచనలు రావడంతోటే రంగడి హృదయం ద్రవించింది. ఆక్షణంలో ఎన్నో

కె. ఆర్. యమ్. శాస్త్రి

రోజుల్నుంచి పస్తులున్న వాడిలా అయిపోయాడు. రంగడిలో కలిగిన ఈ సంచలనానికి హేతువేదో రాముడికి సులభంగా గ్రాహ్యమైంది.

"ఏందిరా, అట్టాగైపొయ్యావూ?" అని అడిగాడు రాముడు.

"రాంగా, సాలా పెద్ద పొరపాటు సేశాన్రా! ఇయ్యాలే కాండ్రాసేత్తాను. నా తప్పు క్షమించమని యేడుకుంటాను, పోటాఫీసు కెల్తన్నా!" నంటూ కదిలాడు. రాముడు అతన్ని వెనక్కి పిల్చాడు. రంగడు వెనక్కి వచ్చాడు. 'ఏమిటి?' అన్నట్లు రాముడి కళ్లలోకి చూశాడు.

"రంగోయ్! ఎట్టనో కాండ్రేత్తన్నావు గనక ఆ ఏసేది జంట కాండ్రెయ్యి. ఎందుకంటే ఆ పిల్ల యంటనే జవాబు రాత్తానికి యీలుంటది" అన్నాడు రాముడు.

"సర్లె" అంటూ దుడ్డుకర్రోసారి ఝళిపించి పోస్టాఫీసుకేసి రంగడు వడివడిగా నడవసాగాడు.

2

పోస్టాఫీసు చిన్నది. ఒక్కటే రూము. పోస్టుమాస్టరు ఒక్కడే; అసిస్టెంట్స్ ఎవ్వరు లేదు. కార్డులు సప్లయి చెయ్యడం మొదలు కొని వచ్చిన ఉత్తరాలు వూళ్ళో బట్వాడా చెయ్యడం వరకూ ఆయన పనే. అంచేత ఉదయం తొమ్మిది మొదలు పదకొండున్నర వరకూ మాత్రమే కార్డులు మొదలైనవి అమ్మడం; డబ్బాలో వేసిన వుత్తరాలు తియ్యడం జరుగుతుంది. ఖర్మం జాలక ఎవరైనా టైమ్ తెలీక పదకొండున్నర దాటి వస్తే, కార్డులకి కార్డులూ దొరకవు—డబ్బాలో వేసిన వుత్తరాలూ వెళ్ళవు. ఇదే ఆ చిన్న పల్లెటూళ్లో వున్న పోస్టాఫీసు సంగ్రహ చరిత్ర.

ఆ పోస్టాఫీసులో కొత్త పోస్టుమాస్టరు జాయినయి ఇంకా నెలరోజులు దాటలేదు. ఆయనపేరు రంగాచారి. ఒట్టి ముక్కోపి. సహనరహితుడు. రంగాచారిది గుడివాడ. ప్రొద్దున్నే కాఫీ, టిఫిన్ సేవించి ఎనిమిది గంటలకల్లా తాతలనాటి తన త్రొక్కుడు బండి (సైకిల్) పై బయలుదేర్తాడు. గుడివాడకీ ఆ గ్రామానికీ ఎక్కువదూరం లేదు. అంచేత ఓ అర్ధగంటలో అక్కడికి చేరుకుంటాడు. పన్నెండున్నర అయ్యేసరికల్లా పని ముగించుకుని, తిరిగి తన త్రొక్కుడుబండి పై వుంటాడు రంగాచారి. ఇదీ ఆయన దినచర్య. పాపం ఆయనకి ఆ వూరి విషయాలు సరిగ్గా తెలియవు. తెల్సుకోవలసిన ఆవశ్యకత కూడా లేదు.

ఆ రోజున అరగంట—(అంటే 9½ గంటలకు) లేటుగా పోస్టాఫీసు తలుపులు తెరిచాడు రంగాచారి. రోజూ ఎక్కి, దిగి ఒక్కొక్కళ్ళు వచ్చే జనం యివ్వాళ తండోపతండాలుగా వచ్చి, ఆఫీసు కిటికీవద్ద 'క్యూ'లో నిల్చున్నారు. రంగాచారి కిటికీ కవతల కుర్చీలో వేసుక్కూచుని ఎవరెవరికి ఏవేం కావాలో అడిగి తెల్సుకుని, కొత్తగా వెలువడిన 'నయాపైసాల' లెక్క ప్రకారం ఇచ్చివేస్తూ సాధ్యమయినంత వరకు, ఆజనసంఖ్యను తగ్గించాలని ప్రయత్నిస్తున్నాడు.

రౌడీ రంగడు పెద్ద-పెద్ద అంగలతో పోస్టాఫీసును సమీపించాడు. అతని అడుగుల చప్పుడు వినగానే కిటికీవద్ద వున్న వాళ్ల ముఖాలు వెలవల బోయాయి. మిలిటరీ డ్రిల్లులాగా ఎవరికి వాళ్లు పక్కకి ఒదిగి నిల్చున్నారు. రంగడు చేతిలోవున్న కర్రను గోడకానించి రివిగా కిటికీవద్దకు వెళ్ళాడు. రొండిమంచి బేడకాసు తీసి రంగాచారికిచ్చి "జంటకాడ్రోటియ్యవయ్యా!" అన్నాడు.

★ రంగని అంతరంగం ★

రంగాచారి జంటకార్డు తీసి, దానిమీద కాసీకాసుంచి రంగడి కిచ్చాడు. రంగడు కాసీ కాసువంక విచిత్రంగా చూశాడు.

"ఏందయ్యా ఇది?" గట్టిగా అన్నాడు.

"ఏందీ లేదు. బూందీ లేదు. ముందునడువ్ అవతలికి." రంగాచారి విసుగ్గా అన్నాడు.

"ఏయ్ ఆసారీ! ఏంది మా ఇస్సురుగా కూట్లాడుతుండావ్! జంటకార్డుకి అణా, ముక్కాలెట్లయింది?"

"అంతేలేగాని అవతలికి నడువ్. మహా లెక్కడగొచ్చావ్."

"ఏందయ్యోవ్ మాజోరుగా అనేతుండావ్. ఈ డెవడో నీకింకా తెలీదు. రాడీ రంగడు. పొగరు బోతోళ్ళతల్లో జేజెమ్మ. నాను సదువురానోణ్ణయినా, డబ్బుకాడి కొచ్చే సర్కి సదువు కున్నోళ్లు కూడా నాకాడ బలాదూర్. తెల్సా! అణా ముక్కాలికి వచుకొండు నయాపైసాలు. జంట కార్డు పది నయాపైసలే. ఇంకో నయాపైస నాకే రావాల్నే!" రంగడు లెక్క చెప్పాడు.

రాడీ రంగడి పేరు వినేసరికి రంగాచారి గుండెల్లో రైళ్లు పరుగెత్తినై. చేతులు వణికాయి. రంగడివంక చిత్తర చూపులు చూడ సాగాడు. వెంటనే తమాయించుకున్నాడు. అక్కడున్న జనంముందు తన పిరికితనం బైటపడితే, వాళ్ళకి లోకువగా కనిపిస్తాడే మోననే భయంతో రంగడికి నచ్చజెప్పే విధానంలో ఇలా అన్నాడు:

"ఇదుగో అబ్బాయ్! నా దేముంది? వుద్యోగం చేస్తున్న ప్రతి వ్యక్తి ప్రభుత్వం వారి ఆజ్ఞలకు సర్వదా బద్ధుడై తన కర్తవ్య నిర్వహణ చేస్తున్నాడు. అంతేగాని తన ఇష్టప్రకారం మాత్రం నడవడంలేదు. మీరు లేసకానిచ్చి జంటకార్డిమ్మని అడిగినప్పుడు మాదగ్గర ఒక 'నయాపైసా' నాణెములు నిండుకున్నప్పుడు, జంటకార్డును ఒక అణా ఒక ముక్కాని కనూలుతో అమ్మటకెట్టి అభ్యంతరంగాని వుండదని ప్రభుత్వము వారి ఆజ్ఞ."

రంగడు సింహగర్జన చేసి కొంగ్రించి వుమ్మేశాడు.

"పెబుత్వమంట పెబుత్వం. మాయంటోళ్ళకి పెట్టం సేతగాదుగాని మాకాడ్నే కనూలుసేసి ఆళ్లే జల్సాల కోడుకుంటారు." కసిగా అంటూ వెనక్కి వెళ్లి అరుగుమీద చతికిలబడి తాపీగా చుట్ట వెలిగించాడు, రంగడు.

3

సైకిలెక్కిన పోస్టుమాస్టర్ రంగాచారి కర్ణపుటాల్లో రంగడి పిలుపు భీకరంగా ప్రతిధ్వనించింది. చటుక్కున దిగాడు. ఇందాకట్నుంచి తనకోసమే కాచుకుని వున్నాడేమో అనుకుని ఆపాదమస్తకం ఆకులా గజ-గజలాడాడు. సైకిల్‌కి స్టాండు వేసి భయం భయంగా రంగణ్ని సమీపించి అర్ధ నిమీలిత నేత్రాలతో "ఏమిట"న్నట్లు అతన్ని చూశాడు ఆచారి.

"మనదే వూరు? ఎక్కడుంటండావ్" అడిగాడు రంగడు.

"గుడివాడ సత్యనారాయణపురం చివర ఫ్యాక్టరీ నీరుపోయే కాలువ లేదూ! దాని కవతల గుడిసెలు కొన్ని వున్నయ్యి! ఆ గుడిసెలు కెదురుగా ఈవలి గట్టున డాబాలో."

"దండాలుబాబూ! తమ రెవరో ఎరక్క అపశారం సేశా. కూసోండి. ఓ మాట సెప్పాల" అన్నాడు రంగడు, చిప్పున అరుగుమీంచి లేచి ఆచారికి నమస్కరిస్తూ.

రంగాచారికి వణుకు తగ్గింది. నెమ్మదిగా పోయి అరుగుమీద కూచున్నాడు.

"ఆసారిగోరూ! ఆ గుడిసెల్లో చెంగన్నని కూమా వున్నాడు తెల్సాండి?" రంగడు అడిగాడు.

"ఎవరూ! ఆమూతి వంకర చెంగన్నా?"

"అవును బాబూ!"

"ఆరి నీకడుపుసెక! వాడెక్కడో వసే మేమిట్రా! మా పొలం పని చేస్తాడ్రా వాడు వాడి అల్లుడివా నువ్వు? చంపేశావ్ పో. వారం రోజుల క్రితం పురిటికి నీ భార్య అక్కడికి వచ్చిందిగా. వచ్చిన రోజునే నీకో వుత్తరం నా చేత రాయించింది. వెధవాయ్. దానికి జాబే రాయలేదుటగా? అంత తీరిక లేకపోయిందా ఏం? పాపం... అది రోజూ నాతో చెప్పడమే, "వుత్తరం రాయమని అతనికి చెప్పండని.' నువ్వెవరో ఇప్పటి వరకూ నాకు తెలీదుగా."

"మరిసే పోయానాసారిబాబూ! ఇయ్యాల అయినా రాంగాడు గురుతు సేశాడు. కొంచెం ఈ కార్డు రాసి పెట్టరూ!" ప్రాధేయ పడ్డాడు రంగడు.

"నాకు చాలా ఆలస్యమైందిరా! ఇంకో వుత్తరాలు బట్వాడా చెయ్యాల్సిన పనోటి వుంది."

"ఓస్. ఇదెంత పని ఆసారి బాబూ! నిటికెలో సేసేత్తాను. నాను సెప్పిన యిసయాలు దీని మీద రాసెయ్యండి. వుత్తరాలు నిమసంలో ఎవరియారికి పారేసొత్తా."

"సరే... చెప్పు."

"తొందర పాటెక్కువగాని నిజంగా రంగడి హృదయం నవనీతంగాదూ!" అనుకున్నాడు పోస్టుమాస్టర్ రంగాచారి, రాయడాని కుపక్రమిస్తూ. ★



డియర్ బుడుగు,

నా పేరు సోమసుందర్ ఇక్కడ యమెస్సి చదువుతున్నా. ఇక్కడ ఇందిరనే సీతవుంది. చదువుతోందిలే. నాకు యీలలురావు నాకు డాన్సులురావు. నాకు మాటాడాలని చాల ఇదిగావుంది. తొందరపడితే ప్రవేటుచెప్పు తానేమోనని భయంగా వుంది. నన్ను రక్షించవూ.

సోమసుందర్

* * *

బుడుగుగురు కు కు

నీవు చెప్పేవన్ని నిఝంగ ఖుషాలే ఇప్పు డేమోఫండుగ వొస్తుందా! తలంటోసు కోరా పొద్దున్నే అంటూ నిద్రపోకుండా అమ్మ మనల్ని లేపేస్తుందా అప్పుడెలాగా?

యిప్పుడు నుంచి నీవు నేను ఫ్రెండిస్ గా ఉందామా? ఫ్రెండ్సిప్ అంటే జట్టుండడం అది మా నన్న య్యా చెప్పాడు లే. జవాబు రాస్తావుకదూ

నీ ఫ్రెండు

తాడిపత్రి   జె శశాంక శేఖర్

* * *

ఆంధ్రపత్రిక వీక్లీ ఇంటికి తెచ్చేసరికి "అక్కా బుడుగుని తెచ్చావా"? అని చుట్టే సేవారు తమ్ముళ్ళూ, చెల్లాయిలూ. బుడుగు తోఖూ ఎలా వస్తాడ్రా అంటే వాళ్ళు నమ్మరే! అంత యిష్టం.

నిజానికి బుడుగు అంటే పిల్లలకేకాదు, పెద్దా, చిన్నా అందరికీ ఇష్టమే.

ప్రైవేటు మేష్టర్లతో ప్రారంభమైన బుడుగు క్రమక్రమంగా అన్ని విద్యలూ నేర్చి డిటెక్టివ్ పరిశోధనల్లో కూడా తోడ్ప డ్డాడు. కొన్ని కొన్ని మాటలు చదువుతే నవ్వు ఆపుకోలేం. ఉదాహరణకి కొన్ని, "లావుపాటి పక్కింటి పిన్నిగారి మొగుడు గారు అని, మళ్ళీ 'వాడు' అనడం, పెంకి పిల్ల పుచ్చుకోవడం, ఆఫీసులో మానేజర్ని "మీకు విగులేకపోతే పక్కింటి పిన్నిగారి పవరంలేనా" అని అడగడం ఇంకో ఎన్నో యిటువంటివి. ఇంకోటుంది, ప్రవేటు చెప్పడం.

బుడుగు గొప్పవీరుడూ, మంచి వుపాయ శాలీని. ఆవేళ సినిమా స్టూడియోలో 'సీత'ని పాపం: వాడెవరో అల్లరిపెడుతూవుంటే అందరూ గుడ్లప్పగించి చూచేరుగాని, ఎవ రైనా కలుగజేసుకున్నారా? ఆఖరికి బామ్మ కూడా ఏమీ చెయ్యలేకపోయింది. మరి అందరిలాగా బుడుగు వూరు కుంటాడా 'సీత'ని రక్షించెయ్యాలి అనుకుని ఉపాయంచెప్పాడు. ఎంతమంచి ఉపాయం అది! ఇంకోచోట, ఆపిల్ల ఏడ వకపోతే అంతమంది యాక్టర్లకీ, డైరెక్టర్లకీ కూడా తెలీలేదు, ఎలా ఏడిపించడమో! అప్పుడు మరి బుడుగుకితోచిన ఉపాయం; "వాణ్ణి దభీమని కిందికితోసెయ్యండి చాలు" ఎవరికైనా తట్టిందా?

ఎవరో మహానుభావుడి గోడుగు బుడుక్కి తగిలింది. మరి పగతీర్చుకోడం ఎలా? వాడు చూడబోతే బోల్డులావు, మరి బుడుగు వాడి మోకాళ్ళవరకూ కూడా రాడు! అందుకని మంచి ఉపాయం ఆలోచించి అతి సులా యాసంగా వాడిచెతిమీద మొట్టేసి పగ తీర్చుకున్నాడు. ఆ తెలివి తేటలు అద్భుతం కాదూ! అంతటి కాంతంమాత్రం ఎవరి కుంటుంది! కాంతంగా "నన్నెత్తుకోవూ" అని అడిగి కార్యం సాధించాడు. ఆ తెలివి అందరూ ఉపయోగిస్తే ఎలాంటి చిక్కుల నైనా ఇట్టే విడదీసుకోవచ్చేమో!

ప్రతి హీరోకీ ఒకహీరోయిన్ ఉండా లిగా మరి. మన హీరోకూడా 'సీగాన పెసూనాంబ' (పేరు చాలాబావుంది) ని హీరోయిన్ గా ఎన్నుకున్నాడు. అది చూస్తూండగా ఎవరూ వాణ్ణి ముద్దు పెట్టుకో కూడదు. అదిచూస్తే ఎంతిషమో! పాపం బుడుక్కి!

బుడుక్కితోడు వాళ్ళ బాబాయిఒకడు! అసలు బుడుక్కి బాబాయి, బాబాయికి బుడుగు ఉంటేనేగాని కధ రక్తికట్టదు. నేటి కాలేజీ విద్యార్థుల లక్షణాలన్నీ 'బాబాయి' లో ఉన్నాయి. బుడుగు "చిరంజీవి"గా వర్ధిల్లాలని ఆశిస్తున్నా.

కాకినాడ,   టి. బృందావనం.

★

దివ్యదీప కళిక

ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

వివాహమహోత్సవ దివసం సమీపించిన కొద్దీ దేవసేనకు క్షణమొక యుగంగా గడిచింది. జసల్మియర్ యువరాజు విక్రమసింహుని సందర్శనం కోసం ఆమె అనుక్షణము తహతహ లాడింది. విక్రమసింహునికీ, దేవసేనకు వివాహం స్థిరపడి, ప్రధాన మహోత్సవం జరిగి అంతా ఒక పక్షం రోజులే అయింది. జాల్వారు రాజపురోహితులు 'శుభస్యశీఘ్రం' అని వెంటనే వివాహముహూర్తం కూడా నిర్ణయించారు. ఆ శుభముహూర్తానికి ఇక మూడు రోజులే వ్యవధి! అయినా దేవసేనకా మూడురోజులు, ఒక్కొక్క తిథి ఒక్కొక్క కల్పంగా ఎంతో మందకొడిగా కాళ్ళీడ్చుకుంటూ గడిచిపోతున్నట్లనిపించాయి.

దేవసేన జాల్వారు సంస్థానాధీశుని మొదటి కుమార్తె. జసల్మియర్ సంస్థానాధీశులు, జాల్వారు ప్రభువులు కొంచెం దగ్గరబంధువులు. దేవసేనకు, విక్రమసింహుడు వరసకు మేనమామ కుమారుడు. అందు చేత విక్రమసింహుడామె కేమీ కొత్తకాదు. పసితనంలో వారిద్దరు చాలాకాలం కలిసి మెలిసి ఆడుకొన్నారు. ఈడు, జోడు చూచిన రాజబంధువులు అప్పుడే వారిద్దరు అన్ని విధాల అనురూపులయిన వధూవరులని నిర్ణయించారు. దేవసేనా విక్రమసింహులు యుక్తవయస్కులు కాగానే యథావిధిగా వివాహమే నిర్ణయించారు.

జసల్మియర్, జాల్వారు రెండు మార్వారు రాజ్యానికి లోబడిన చిన్న చిన్న సామంతరాజ్యాలు. ఆ రాజ్యాధీశులిద్దరు ఆ రోజుల్లో మార్వారు, మేవారు రాజ్యాల మధ్య జరిగిన పెద్ద పెద్ద యుద్ధాలలో అనేక మారులు మార్వారు రాజ్యాధీశునికి పెట్టని కోటలుగా నిలబడ్డారు. ఇంకా అతని కనేక విధాలుగా సాయపడ్డారు.

అందుచేతనే మేవారు రాజ్యాధిపతి కుంభరాణాకు మొట్టమొదటినించీ జాల్వారు, జసల్మియరు రాజ్యాలంటే అరికాలిమంట నెత్తికెక్కేది. వారిద్దరూ వియ్యమంది బాగా బలపడుతున్నారన్న వార్త వినగానే అతడు మరింత మండిపడ్డాడు.

వివాహవార్త విన్న మరునాడే జాల్వారు రాజ్యాధిపతి సముఖానికి ఒక దూతను పంపించాడు. దేవసేనను తన కిచ్చి వివాహం చెయ్యవలసిందనీ, ఆ విధంగా తమ ఉభయ రాజ్యాల మైత్రీ బాంధవ్యాలకు మాంగళ్యదోహదం కలిగించవలసిందనీ ప్రార్థించాడు.

జాల్వారు రాజ్యాధిపతి అప్పటికప్పుడే కుమార్తె దేవసేన వివాహానికి కావలసిన సంభారాలన్నీ సమాయత్తపరుచుకొన్నాడు. కుంభరాణా సందేశం అందిన మరునాటి రాత్రే వివాహ సుముహూర్తం!

ఆ పరిస్థితులలో అతడేటు నిర్ణయించలేక ఎంతో భయపడ్డాడు. కుంభరాణా చండశాసనుడు! అతనిసందేశంతిరస్కరిస్తే ఏక్షణంలోనైనా అతడు సైన్యాలతో సహా జాల్వారు రాజ్యం మీదికి విరుచుకు పడవచ్చును! పోనీ అనుకొని కుంభరాణాకే కన్యనిస్తే ఇరుగు పొరుగు సామంతరాజ్యం జసల్మియర్ తో ఎడతెగని యావజ్జీవం వైరం ఏర్పడవచ్చును!

అదీగాక, జసల్మియర్ యువరాజూ, కుమార్తె చిన్నప్పటినించీ ఎంతో ఆప్యాయంగా కలిసి మెలిసి ఉన్నారనీ, అనుక్షణము ఒకరొకరికోసం ఎంతైనా ఉవ్విళ్ళూరుతున్నారనీ అతడెరుగును! కుమార్తెను కుంభరాణాకీయడానికంగీకరిస్తే దేవసేన వినువెంటనే ఎలాంటి అఘాయిత్యానికైనా ఒడిగట్టవచ్చును! ఆ రోజులలో క్షత్రియ మహిళలకేమాత్రం ఆత్మగౌరవహాని సూచన కనిపించినా వెంటనే అగ్నిహోత్రజ్వాలలో ఆహుతికి సిద్ధపడేవారు.

జాల్వారు రాజ్యాధిపతి కళ్ళెదురుగా అటువంటి ఆత్మాహుతులెన్నో జరిగిపోయాయి. పైగా ఒకరొకరిమీద ప్రాణాలు పెట్టుకొని క్షణక్షణము శుభముహూర్తం కోసం నిరీక్షిస్తున్న వధూవరులకొవిధంగా తీరని ఎడబాటు కలిగించడానికతనికి బొత్తిగా మనస్కరించలేదు. కొంతసేపటివరకు రాజమంత్రులలోనే కుతకుతలాడిన ఆ మథన క్రమక్రమంగా అంతఃపురంలో కూడా ఒక పెద్ద ఆందోళనజ్వాల రేకెత్తించింది.

దేవసేనకా దుర్వార్త ఒక పెద్ద పిడుగులా వినిపించింది. కలకలలాడే ఆమె ముఖం ఒక్కమారుగా వెలవెలబోయింది.

అది చూచిన ఆమె తలిదండ్రులిద్దరికీ గుండె తరుక్కుపోయింది. ఇక ఏమయినా సరే, తన కుమార్తెను విక్రమసింహునికే ఇచ్చి వివాహం చెయ్యాలని జాల్వారు ప్రభువు నిశ్చయించుకొన్నాడు. కుంభరాణా దూతతో ఆవిషయం నిష్కర్షగా చెప్పివేశాడు. తీరా వివాహ ముహూర్తం నిశ్చయించిన పిమ్మట ఆ విధంగా వివాహసందేశం పంపించడం సుక్షత్రి రాజన్యులకు తగదనీ అది అందరికీ అగౌరవహేతువగట్టిగా తూలనాడాడు. కుంభరాణా దూతముఖం ముడుచుకుని వెంటనే తిరిగి వెళ్ళిపోయాడు.

మరునాడు జాల్వారు కోటలో తిరిగి యథాప్రకారంగా వివాహ సన్నాహాలు ప్రారంభమయ్యాయి. జసల్మియరు రాజు యువరాజుతో సహా వివాహానికి తరలి వచ్చాడు. దేవసేన నూతన వధూవేషంతో కలకలలాడుతూ వివాహవేదికమీద కూర్చుంది.

రాజపురోహితులు యథావిధిగా విఘ్నేశ్వరపూజ కుపక్రమించారు. అంతలోనే జాల్వారుకోట బురుజులపై భయంకర యుద్ధభేరీధ్వనులు మారుమోగాయి! అందరు మహాప్రళయ మేదో ముంచుకు వచ్చిందని భయపడ్డారు. చివరకనుకున్నంతపనీ జరిగింది. చిత్తూరు దుర్గాధిపతి కుంభరాణా తన సైన్యాలన్నింటితోను కలిసి ఒక్కుమ్మడిగా

దండెత్తి వచ్చాడని జాల్వారు నగరంలో అంతటా ఒక పెద్ద గగ్గోలు బయలుదేరింది. రాజబంధువులంతా ఆ వివాహ సన్నాహం అంతటితో ఆపివేయించి వెనువెంటనే రణరంగంలోకురికారు. ఇంకొకటి రెండుగడియలలో సమాప్తికావలసిన దేవసేన వివాహం హఠాత్తుగా అంతటితోనే ఆగిపోయింది!

విక్రమసింహుడదంతా చూచి ఒక నిమిషంవరకు అలాగే నిర్ఘాంతపోయాడు. అంతవరకు అలవోకగా తలవంచుకొని క్రీగంటి చూపుతో అతనినోరకంట కనిపెట్టిచూస్తున్న దేవసేన కొంచెం తల పైకెత్తి చూచింది. వారిద్దరికళ్ళు కలుసుకొన్నాయి. ఉత్తరక్షణంలో విక్రమసింహుడు వివాహవేదిక దిగి నిశ్చలదృష్టితో ఒకక్షణకాలం దేవసేనవైపెంతో ఆర్ద్రదృష్టితో చూచాడు. దేవసేన లోలోపలే కుమిలికుమిలి వెక్కివెక్కి ఏడ్చింది. విక్రమసింహుడు ఒరలోని కరవాలం చేజిక్కించుకొని చరచరా నాలుగడుగులు వేశాడు. తిరిగి ఇంకొకమారెంతో ఆత్మీయంగా దేవసేనవైపు చూచాడు. ఏదో చెప్పబోయాడు గాని, ఆ మాట చెప్పకుండానే ఉత్తరక్షణంలో అక్కడినించి కదిలి వెళ్ళిపోయాడు.

దేవసేన కతని చూపుల్లో ఒకే ఒక అర్థం సుస్పష్టంగా స్ఫురించింది.

"దేవసేనా! ప్రపంచంలో మనల నిద్దరికీ ఎవరు ఎడబాటు కలిగించలేరు. మనకేమీ భయం లేదు. ఇది అక్షరాలా యథార్థం. నామాట నమ్ము!"

దేవసేన కాధోరణి చూడగానే కొంచెం ధైర్యం కలిగింది. అంతలో కొంచెం దూరంలో రణభేరి మళ్ళీ హృదయవిదారకంగా మారుమోగింది!

అది వినీ వినగానే దేవసేన కేదో భయం వేసింది. ఆ భయోద్వేగంలో ఆమె ఏవేవో విపత్పరంపర లూహించుకొని మొదలు నరికిన తరువులా అలాగే కూలబడి పోయింది.



౨

దేవసేన బాగా తెలివి వచ్చిన తరవాత నాలుగువైపులా బాగా పరిశీలించిచూచింది. ఆమె పరిసరాలన్నీ అత్యద్భుతంగా మారిపోయాయి. కొంతసేపటి కామె కది చిత్తూరులో కుంభరాణా కోట అని స్పష్టపడింది. పరిచారిక లామెకు మిగిలిన కథ కాస్తా తెలియజేశారు.

యుద్ధంలో జసల్మియర్, జాల్వారు ప్రభువు లిద్దరు పూర్తిగా ఓడిపోయారు. కుంభరాణా చేతిలో దేవసేన ఒక బందీగా పట్టుబడింది. ఇక మిగిలిన విషయాలా పరిచారిక లెవరూ స్పష్టంగా చెప్పలేక పోయారు.

అలాగలాగ రెండుమూడుమాసాలు గడిచిపోయాయి. కుంభరాణా అంతఃపురంలో ప్రవేశించి నప్పటినించీ దేవసేన మూర్తీభవించిన శోకదేవతే అయిపోయింది. మొట్టమొదట కొన్నాళ్ళవరకు ఆమె అన్నపానాలే ముట్టలేదు.

కాని క్రమక్రమంగా దేవసేనలో వచ్చిన మార్పు చూచి అంతఃపుర పరిచారికలే తమ కన్నులే నమ్మలేక పోయారు. ఇంకొక నెలరోజులు గడిచిపోయేసరికి ఆమె అందరితోను కలిసి మెలిసి తిరుగుతూ కలకలా నవ్వడం మొదలుపెట్టింది.

ఈ విచిత్ర పరిణామానికి కారణమేమో ఎవ్వరికీ తెలియలేదు. ప్రతినిత్యము భవానీ పూజచేసి అఖండ దీపారాధన చెయ్యడం ఆమెకొక అలవాటయింది. దేవసేనలో ఇవి వల కలిగిన ఆ హఠాత్పరిణామానికదే ఒక ముఖ్యకారణమై ఉండవచ్చునని పరిచారికలు కొందరు నిశ్చయించారు.

దేవసేన నిత్యము దీపదీపాల వేళ చిత్తూరు కోట బురుజుపై నిలిచి ఆకాశం చుంబించే భవానీదేవాలయానికి వెళ్ళి కొంచెం సేపు పూజాపునస్కారాలు చేసి తన ప్రాసాదానికి తిరిగి వెళ్ళిపోతూంటుంది. ఈనాడామె దేవిసన్నిధిని మోకరిల్లి ఆనందపరవశముఖంతో లేచి నిలబడింది. దేవతామూర్తి పార్శ్వంలో నిలిచిన సుందరీ శిల్పాంజలిలో వెలిగే అఖండ దీపికలో కొన్ని కర్పూర ఖండాలర్పించింది. అరమోడ్పుకన్నుగవతో ఆ దేవి కత్యంత భక్తిభావంతో నమస్కరించింది. అంతలో అంతఃపురపరిచారిక నిర్మల అక్కడికివచ్చి ఆమెకు నమస్కరించింది.

"అమ్మా! వారు వస్తున్నారు! జాగ్రత్త!

గుసగుసలాడుకొన్న సవ్వడికూడా వినబడ కూడదు.”

పరిచారిక వెంటనే వెళ్ళిపోయింది. అంతలో ఇంకొక పరిచారిక అక్కడ ప్రత్యక్షమయింది. కాని ఆమె పరిచారిక కాదనీ, పరిచారికావేషంతో విక్రమ సింహుడే అత్యంతనిగూఢంగా ఆ అంతఃపురంలో ప్రవేశించాడనీ ఆమెకు ంతకు పూర్వమే తెలిసింది. అతడు లోపలికి రాగానే దేవసేన కళ్లారా అతనివైపొకమారు చూచింది. మరుక్షణంలో భరించరానిశోకావేశంతో నేలపైకూలబడిపోయింది. విక్రమ సింహుడామెను తనఒడిలో కూర్చోబెట్టు కున్నాడు. ఆమె నేత్రాలు రెండు అప్రయత్నంగా మూసుకొన్నాయి. ముకుళించిన నేత్రాంతాలనుండి కన్నీరుమున్నీరై ప్రవహించింది. అంతటి మహానందసమయంలో ఆమె అవిధంగా దుఃఖించడానికి కారణమేమీ అతనికి బోధపడలేదు. విక్రమసేనుడు మృదువుగా ఆమె కనురెప్పలు ముద్దుపెట్టుకొన్నాడు:

“దేవసేనా! నీవెందుకిలాగ విచారిస్తున్నావు? కారణమేమిటి కొంచెం నాతో చెప్పగూడదా?”

దేవసేన మళ్లీ వలవలా వాపోయింది:

“రాణాకు, నాకు ఇంతకు పూర్వమే వివాహం అయిపోయింది. ఏమి చెయ్యను! నా నొసట రాసినరాత ఇంతే!”

దేవసేన మళ్లీ కుమిలి కుమిలి ఏడ్చింది. కాని విక్రమసేను డెక్కడా చెక్కు చెదర లేదు. పైగా పకపకా నవ్వాడు:

“నీవింతటి వెర్రిదానవని అనుకోలేదు! దైవసాక్షిగా, మన ఇద్దరి వివాహము ఇంతకు పూర్వమే జరిగిపోయింది! ఆపైన కుంభరాణా నిన్నెంత వేదోక్తంగా వివాహమాడినా అది నిజమైన వివాహం కాజాలదు! అతడు చేసినది క్షత్రియధర్మానికి కేవలం వ్యతిరేకం! దానికి తగిన ఫలితం అతడు త్వరలోనే అనుభవించితీరతాడు! నా మాట నమ్మ!”

ఆమాటలువిని ఆమెకొంచెంకుదటపడింది:

“మీరింతమంది అంతఃపుర పరిచారికల కళ్లు గప్పి ఇక్కడికెలాగరాగలిగారు?”

విస్ఫారిత నేత్రాలతో ఆమె అలాగే ఆశ్చర్యపోయింది. విక్రమసేనుడా కథ అంతా సంగ్రహంగాఆమెకు తెలియజేశాడు.

“రాణా నిన్నపహరించుకొని పోగానే నేను చేతులు ముడుచుకొని మాట్లాడకూరుకొన్నా ననుకొన్నావా? అప్పటినించీ నేనీ చిత్తూరు నగరంలో మారువేషంతో తిరుగుతూనే ఉన్నాను. క్రమంగా అంతఃపుర పరిచారిక నిర్మలతో పరిచయం కలిగించుకొన్నాను. ఆమెకెల్లో ఎంతైనా ధనం సమర్పించాను. నాకీ పరిచారికావేషం ఆమె మూలంగానే లభించింది. ఆమె అనుక్షణము నాకీ కోట అనుపానులన్నీ చెబుతూనే ఉంది! అయితే ఈవేళే నేనిక్కడికి రావడానికి కొంచెం అదును దొరికింది. ఏమి చెయ్యను! ఎంత ప్రయత్నించినా ఇంతకు పూర్వం అది సాధ్యపడలేదు!”

విక్రమసింహు డొక్క నిట్టూర్పు విడిచిపెట్టాడు. దేవసేన అతన్ని గాఢంగా కౌగలించుకుంది:

“ఇక ఎన్నాళ్లు నాకీ చెర! నన్నెప్పుడీ

చెరనుండి విడిపిస్తారు!"

"ఎన్నో నాళ్లా! మళ్లీ పున్నమనాటికి నీవు జసల్ మియారుకోటలో ఉంటావు! ఇది ముమ్మాటికీ నిజం! నీవేమీ భయపడ నక్కరలేదు! తెలిసిందా?"

దేవసేన పైనున్న పున్నమిచంద్రునివైపొక మారు చూచింది:

"అంతవరకు సప్తర్షులకేసీ, ఆఅరుంధతికేసీ మరొకసారు చూస్తూఉండండి! నేనా నక్షత్రాలకేసి చూచి సాక్షాత్తుగా మిమ్మల్ని చూచినట్లే ఆనందిస్తాను.

"అమ్మవారిసన్నిధిని నేనిలాగే అఖండదీపం వెలిగిస్తూంటాను. మీరా కొండశిఖరంమీద నిలబడితే నేను కనిపించకపోయినా ఈ చిన్నదీపమైనా కనిపించి తీరుతుంది! మీరు తిరిగి వచ్చేవరకు ఈ రెండుకోరికలు మాత్రం తప్పక చెల్లించండి!"

దేవసేనకంఠం. గద్గదభారంతో వణికింది. ఆమె మరి మాట్లాడలేక పోయింది.

అంతలో వారి కనతిదూరంలో నిలబడిన నిర్మల తొందర తొందరగా అక్కడికి వచ్చింది:

"అమ్మా! లేవండి! ఎవరో మిమ్మల్ని వెతుక్కుంటూ ఇక్కడికే వస్తున్నట్లున్నారు!"

దేవసేన అప్పటికి బాగా వేళమించి పోయినదని గ్రహించింది. తటాలున లేచి నిలబడింది:

"తొందర తొందరగా తిరిగివెళ్ళండి! నామాట మరిచిపోకండి! మీ కోసం నేనిలాగే వేయికళ్లతో కనిపెట్టుకుని చూస్తూంటాను! తిరిగి ఇక్కడికి ఎప్పుడు వస్తారు?"

అతడలాగే ఆమెకేసి చూస్తూ నిలబడ్డాడు. అంతలో ఆమె ఒక సంజ్ఞ చేసింది. విక్రమసేను దది గ్రహించాడు. దేవసేనా విక్రమసింహులిద్దరు భవానీదేవి పాదాలపై వాలిపోయారు. మరుక్షణంలోనే విక్రమసింహుడు కోటబురుజుల మాటునపడి అదృశ్యుడయ్యాడు. దేవసేన కనిపించినంతవరకు అత్యంతనిశ్చలదృష్టితో అతనివైపు చూచింది.

ఆపైన భవానిదేవి పాదాలపై కూలబడిపోయింది.

3

అటుపిమ్మట దేవసేన ప్రతి దినము భవానీ దేవత పాదసన్నిధానంలో అఖండ దీపిక వెలిగించి సప్తర్షి మండలవైపే ఏకాగ్రదృష్టితో చూచింది.

ఆ క్షణంలో ఆమె విక్రమసింహుని కళ్లారా చూచినట్లే ఆనందించింది. అప్పటి నించి ఆ నిరీక్షణమే ఆమెకొక నిత్యోత్సవమయింది!

ఆ విధంగా ఒక పది పదిహేను రోజులు గడిచిపోయాయి. అంతవరకు ఆమెకు నిర్మల ద్వారా విక్రమసేనుని క్షేమవార్తలు, అతని ప్రయత్నాలు అన్నీ తెలుస్తూనే ఉన్నాయి.

ఒక నాడెంత సేపటికీ నిర్మల ఆమె దగ్గరికి రాలేదు.

దేవసేన మరి వేచిఉండలేక ఇంకొక పరిచారికను పిలిచి నిర్మల సంగతి గుచ్చి గుచ్చి అడిగింది. నిర్మలకు దేవిడీమన్నా జరిగిపోయిందనీ ఆమె మరి అంతఃపురంలో అడుగు పెట్టడానికే వీలులేదనీ ఆ పరిచారిక సమాధానం చెప్పింది. దేవసేన ఆమె నెన్నో విధాల గుచ్చి గుచ్చి అడిగింది. కాని ఆమె నిర్మలను గురించి అంతకంటె వేరే విశేషాలేవీ తనకు తెలియవనీ అంతవరకే తెలిసిందనీ సమాధానం చెప్పింది.

మిగిలిన అంతఃపుర పరిచారికలెవరో ఒక కొత్త పరిచారిక హఠాత్తుగా అంతఃపురంలో అడుగుపెట్టిన విషయం కొంచెం చూచాయగా అనుమానించి ఉంటారనీ నిర్మలకు దేవిడీమన్నా జరగడానికదే కారణమై ఉండవచ్చుననీ ఇక ఆ విషయంలో గట్టిగా కట్టుదిట్టాలు జరిగి ఉండవచ్చుననీ దేవసేన గ్రహించివేసింది.

అయినా ఆమె తన ఆశ విడిచిపెట్టలేదు! అలాగే ఆ కోట బురుజుపై నిలిచి ఆకాశమే అందుకొనే ఆ భవానీ దేవాలయంలో నిత్యము కర్పూర ఖండాలతో అఖండదీపిక వెలిగించింది. అలాగే ప్రతిదినము సప్తర్షి మండలంవైపు రెప్పవాల్చకుండా చూచింది.

మరి కొన్ని నెలలు గడిచిపోయాయి. కాని విక్రమసింహునిజాడే తెలియలేదు.

అయినా దేవసేన తనఆశ విడిచిపెట్టలేదు. అలాగలాగ ఇంకామరికొన్ని నెలలు, సంవత్సరాలుకూడా గడిచిపోయాయి. విక్రమసింహుడు మరి తిరిగిరానేలేదు. అయినా దేవసేన తన ఆశవిడిచిపెట్టలేదు!

క్రమక్రమంగా కొన్ని వందల ఏళ్లు గడిచిపోయాయి. ఆలనాటి రాజస్థాన వీరులు, వీరమహిళలు చారణులు గొంతెత్తి పాడే యశోగీతికలలో లీనమైపోయారు!

కాని ఆనాడు దేవసేన భవానీదేవి పాద సన్నిధిని వెలిగించిన దీపకళిక ఈనాటికీ రాజస్థాన వీర గీతికలలో నిలిచి ఒక దివ్య తారకలా తళతళా మెరుస్తూనే ఉంది! ★



25,000 మైళ్లు అంటే భూమి చుట్టూ ఒక సారి తిరిగి వచ్చే దాని కంటె ఎక్కువ దూరము! దూర ప్రయాణము సాగించే యీ సమయములో అతనికి ఎంతో శక్తి అవసరము. ఈ శక్తిని పొదుపు చేకూర్చే వనస్పతితో వండిన ఆహారము అతనికి యిచ్చును

25,000 మైళ్ల దూర ప్రయాణమునకు ప్రారంభము!

ఎదుగుతున్న పిల్లలకు అవసరమైన శక్తిని సమకూర్చుటలో వనస్పతి సహకరించును

రోజుకి ఒక మైలు చొప్పున నడుస్తూంటే, మీ పిల్లవాడు జీవిత కాలములో 25,000 మైళ్లకు పైగా వెళ్లవచ్చును. ఈ ప్రయాణము సునాయాసముగా కొనసాగించుటకు వానికి అతి ముఖ్యముగా కావలసిన శక్తిని కలిగియున్నాడని చూచే బాధ్యత మీదే.

వాని నిత్య ఆహారము నుండి శక్తి

వానికి కావలసిన యీ శక్తి వాని నిత్య ఆహారము నుండి, ముఖ్యముగా పుష్కలముగ శక్తినిచ్చు జిడ్డు పదార్థముల నుండి లభిస్తోంది. జిడ్డు పదార్థములు శక్తి నిచ్చుటయే కాక ఆహారములోని విటమిను 'ఎ' మరియు 'డి' ల గుణములను దేహమునకు లభించేలా చేయును మరియు రోగములు రాకుండా అడ్డుటలో సహాయపడును. జిడ్డు పదార్థములు లభించుటకు పెద్ద కుటుంబముగల తల్లులు పోషకమైన, పొదుపైన వనస్పతితో వంట చేస్తారు.

మీకు మీరే నిర్ధారణ చేసుకోండి

మీ వంటకములన్నిటిని వనస్పతిలో వండుట నేడే ప్రారంభించి, అది మీ కుటుంబమునకు ఎంత లాభసాటిగా ఉందో మీకు మీరే నిర్ధారణ చేసుకోండి. ఈ శుద్ధమైన శాక నూనెల నుండి తయారైన పదార్థములో వండిన వంట కుటుంబములో అందరూ రుచిగా ఉందని సంతుష్టి పడుట మీరు చూస్తారు. అంతే కాకుండా, మీ వంటకములను దీనిలో వండితే మీ కుటుంబ ఆహారము పూర్వము ఎప్పటి కంటె ఎక్కువ పోషకమైనదిగా మరియు పొదుపుగా అగును! వనస్పతి ప్రతి ఔన్సు 700 ఇంటర్‌నేషనల్ యూనిట్ల విటమిను 'ఎ' తో పుష్టికరముగా చేయబడినదని కూడ జ్ఞాపకము ఉంచుకోండి!

వనస్పతి

గృహిణులకు వరప్రసాదము!



VMA. 4592

వనస్పతి మ్యాన్యుఫేక్చరర్సు అసోసియేషన్ ఆఫ్ ఇండియా వారిచే ప్రచురింపబడినది

నా ప్రేయసి

అందీ-అందని ప్రేమలోకపు టంచుల్ని పట్టుకుని ఊహించడానికి ప్రయత్నించి, ఏనిర్ణయానికీ రాలేక, నారీ హృదయపు టగాధంలో, వెలుతురు కోసం చీకటిలో తడుముకుంటూ అర్థంకాని అయోమయావస్థలోపడ్డ నాచరిత్ర మీరు వింటారని ఆశిస్తాను.

నేను ఎక్కువ పరిచయంతో మెలిగే స్త్రీలు ముచ్చటగా ముగ్గురు. మాఅమ్మ, మా అక్క; ఇక మూడవవ్యక్తి, నేను అర్థం చేసుకోడానికిసతమత మవుతున్న "నా ప్రేయసి." అందువల్ల, స్త్రీలతో చనువుగా మెలిగి, వాళ్ళ హృదయపు లోతుల్ని, ప్రేమ, వాత్సల్యం మమకారం, అభిమానం వగైరా కొలతబద్దలతో కొలవగలిగే సామర్థ్యం నాకు కలగలేదు.

నాకథ టూకీగా చెప్పి అసలు విషయానికి వస్తాను. మాఅమ్మకి నేను ఒక్కణ్ణే గారాల బిడ్డని. నాకో అత్తయ్య వుండేది. ఆవిడకి ఒక కూతురు వుంది. చిన్నప్పట్నించికూడా నేను, మాఅత్తయ్య కూతురు కలిసిమెలిసి తిరిగేవాళ్లం. ఇద్దరం కలిసి ఆడుకునే వాళ్లం. ఇద్దరం కలిసి ఒక్కొక్కప్పుడు దుర్గగుడికి వెళ్ళి రాత్రి అయ్యాక వొచ్చేవాళ్లం. ఇది బాల్యం సంగతి. తరవాత నేనావూరు విడిచిపెట్టి వచ్చేయడం, ఆతరువాత మాయిద్దరిమధ్య 4, 5 సంవత్సరాల "ఎడబాటు" లాంటిది ఉండటం జరిగాయి.

నేను "ప్రేమ" అనే పదాన్ని అర్థం చేసుకోడానికి, ప్రేమకి సంబంధించిన పుస్తకాలెన్నో చదివాను. నేను తీవ్రాలోచనలు జరిపి "ప్రేమ" అనేపదానికొక నిర్వచనాన్ని ఏర్పరచుకున్నాను. సూక్ష్మంగా చెప్పాలంటే ఆ నిర్వచనమే నేను నారీ హృదయపు టగాధంలో ఉండే "ప్రేమ"ని కొలవడానికి ఉపయోగించిన కొలతబద్దన్నమాట.

నేను ప్రేమించడం ప్రారంభించడం ఇదె మొదటిసారవడంవల్ల, నేను, యిన్ని సంవత్సరాలు కష్టపడి—సినిమాలుచూసి రకరకాలయిన ప్రేమగాథలు చదివి—సంపాదించిన విజ్ఞానంలో కనీసం సహస్రాంశమన్నా "నిజం" ఉండదా, అనుకున్నాను. ఈమధ్య నాకు కలిగిన ఒక అనుభవంవల్ల ఆ సహస్రాంశం కూడా సందేహాస్పదంగానే కనబడింది.

మా అత్తా వాళ్లి ఊరెళ్లాను. ఇంటికెళ్లి "నా ప్రేయసి" కోసం చూశాను. నేను లోపలికి వెళ్ళగానే మా అత్త వచ్చి కుశల ప్రశ్నలు వేసింది. అంతా బాగానే ఉందనుకున్నాను. కాని నాకు నా ప్రేయసి ఎంతకీ ఎదట పడకపోయేసరికి, చాలా బాధకలిగింది. ఇక ఉండబట్టలేక అత్తయ్యని అడిగేశాను. అన్నట్టు ఇక్కడ నా ప్రేయసి పేరు చెప్పడం మర్చిపోయాను. "ప్రేయసి" పేరు రాధ అన్నమాట—

"అత్తయ్యా! రాధేది" అన్నాను.

అత్తయ్య చిరునవ్వు నవ్వుతూ"అది నిన్ను చూసి ఎక్కడో దాక్కునుంటుంది? అని "ఇదేం పిల్లలో" అంటూ,

"రాధా! బావొచ్చాడు కదా! ఎక్కడో దాక్కుంటావేమే? ఇలారా" అంది.

రాధ ప్రక్కగదిలోంచి వచ్చి, సిగ్గుపడుతున్నట్టు తలవంచి

"శ్రీ అనూరాధ"

"ఎప్పుడు రావడం?" అంది.

"ఇప్పుడే. మెయిల్లో వచ్చాను"అన్నాను నేను సంభాషణ ఎల్లా పొడిగించాలా అని చూస్తూ.

ఇంతలో అత్తయ్య

"అవునుకాని, మీ అమ్మ ఒంట్లో ఎల్లా ఉంటోందిప్పుడు" అని మధ్యలో అడిగింది.

"ఇపుడు కులాసాగానే ఉంది" అని, ఆమె యింకెక్కడ ప్రశ్నలతో చంపుతుందో అని రాధకేసి తిరిగి,

"ఏమిటి చదువుతున్నావ్?" అన్నా ఆమె చదివే పుస్తకమేమిటో తెలుసుకుందామని.

"దేవదాసు, శరత్ బాబుది" అంది చాలా బావుంటుందన్నట్టు.

ఇంతట్లో అత్తయ్య తప్పచేసిందా న్నాగ.

"లేనాయనా! లేచి స్నానంచెయ్యి తరవాత తీరుబడిగా కావలసినంత మాట్లాడుకోవచ్చు" అని, రాధతో.

"బావకి నీళ్ళుతోడవే" అని వంటయింట్లోకి వెళ్ళిపోయింది.

ఇప్పుడు ఏకాంతంగా ఉంది కదా అని నేను నాపరీక్ష ప్రారంభించాను.

"నువ్వు బాగా మారిపోయావు రాధా!" అన్నాను. ఆశ్చర్యంగాచూసి రాధ అంది,

"ఏంబావా! అంత మారిపోయానా"

ఇంక తర్వాత ఏంమాట్లాడాలో నాకు తోచలేదు.

"రాధా! నిన్ను చూడాలని నాకెంతకాలం నించోవుంది. నీవిశాల నేత్రాల్లో నా ప్రతిబింబం చూసుకోవాలని, నిన్ను నాహృదయరాణిగా చేసుకోవాలని......"...వగైరా అంతా అందామనుకుని నోరువిప్పి.

"నువ్వు బాగా మారిపోయేవురాధా!" అనేశాను. నాకే అర్థంకాలేదు నేనల్లా ఎందుకనలేకపోయానో. భోజనం, అన్నీ అయిపోయాక, నాకొకగది చూపించి పడుకోమన్నారు. పడుకున్నానన్నమాటే గాని, నిద్రగాలేదు. రాధ కనబడితే "ప్రేమ" సంభాషణ ఎల్లా జరపాలా అని ఆలోచించాను.

మూడుగంటలకి, రాధ కాఫీ, ఫలహారం పట్టుకొచ్చి. "బావా! బావా!" అంది.

ఏకో ప్రేమ సామ్రాజ్యానికి అధిపతిలా, కళ్ళుపెట్టి రాధకేసి చూశాను.

"నిన్ను నేను ప్రేమిస్తున్నాను రాధా! కళ్లలో దాగిన నీ అందాన్ని దోచుకోవాలని వుంది" అని అందామనుకుని,

నోరు విప్పబోయేటప్పటికి—

"లే బావా! కాఫీ టిఫిను తీసుకో" అంది రాధ తల వంచుకుని.

కాఫీ తీసుకుంటూ, అతికష్టంమీద, "ఎన్నో సంవత్సరాలకి మళ్ళా ఈవాళే... ఇలా రావడానికి వీలుపడింది" అన్నా.

"ఈనాటికైనా మేము గుర్తుకొచ్చాం" అంది రాధ చిరునవ్వు నవ్వుతూ.

చిన్నప్పటి రాధేనా అనిపించింది నాకు. "బావా! మనిద్దరం పెళ్ళి చేసుకుందా"మని చిన్నప్పుడు, "ఒట్టు" వేసిన రాధేనా అనిపించింది నాకు. "ఏమిటి! ఇలా మారిపోయింది" అనుకున్నా మనస్సులో.

సాయంత్రం వెళ్లిపోయేటప్పుడు, రాధ ఒంటరిగా ఉండడంచూసి, "నేను ఈరాత్రి వెళ్లిపోతున్నాను రాధా!" అన్నాను నెమ్మదిగా.

రాధ తల వంచుకుని నిలబడింది.

"నేను వెళ్లిపోతున్నాను రాధా!" అన్నా తెగించి గట్టిగా.

రాధ తల పైకెత్తి—"అంత తొందరేం, రేపు వెళ్లకూడదా!" అంది.

"లేదు, అవసరమైన పనులున్నాయ్" అన్నా.

"సరే...వెళ్లు...ఎప్పుడేనా..." అంది చిరునవ్వుతో.

"అలాగే" అని నేను జట్కాలో కూలబడి, ఆశతో కిటికీ కేసి చూశాను.

కిటికీ ఊచలు పట్టుకుని నిలబడింది రాధ. రెండు కన్నీటి ముక్కలు నెమ్మదిగా ఆమె చెంపలమీదకి జేరాయి.

సంగుమలుపు తిరిగేంతవరకు ఆ కిటికీ ఊచలకేసి చూస్తూ, సంగుమలుపు తిరగ్గానే అర్థంకాని బాధతో తల వంచుకున్నాను.★

ఇల్లు అద్దెకు ఇవ్వబడును

'సత్యం, ఈవారంపత్రికలో కథలు వుండేట్టులేదు—మంచికథలు గాలేదు. నీవు ఒక కథానిక వ్రాసి యివ్వు' అని అడిగాడు 'శారద' సంపాదకుడు ఆరోజు సాయంత్రం క్లబ్బుకు వెళ్ళేప్పుడు దారిలో కలిసి. సరే, అలాగేలే అని అన్నాను.

ఆరోజు అప్పుడే మంగళవారం అయిపోయింది. పత్రికలో అచ్చుకావటానికి కనీసం శుక్రవారం సాయంత్రానికైనా కథ అతనిచేతుల్లోవుండాలి. అంటే మధ్యలో వున్నది మూడురోజుల వ్యవధి మాత్రమే. ఈలోగా ఒకసారివ్రాసి, తప్పొప్పులు సరిచూచి తిరగవ్రాసి యివ్వాలి. సాధ్యమవుతుందా అన్నప్రశ్న ఉదయించిందిగాని, ఏరోజొకటి నాలుకాగితాలు గిలికి యివ్వలేకపోతామా అన్నధీమా.

పదిరోజులు శెలవులు వచ్చినయ్యి కాబట్టి కాలేజికి వెళ్ళవలసిన అవసరంలేదు. అయినా ప్రతిసాయంత్రం క్లబ్బుకువెళ్ళి కాలక్షేపం చెయ్యడం అలవాటు. ఆరోజు క్లబ్బుకువెళ్ళి కొంచెం ఆలస్యంగా యిల్లు చేరుకున్నాను. పదిగంటలకు రెండుమెతుకులు నోట్లోవేసుకుని గదిలోబల్లముందుకూర్చున్నా కాగితం, కలం ముందువేసుకుని కథవ్రాద్దామని.

కథావస్తువు ఏమిటా, ఏమివ్రాద్దామా అని తలపంకించి ఆలోచిస్తూ కూర్చున్నాను. ఏవేవో సన్నివేశాలు ఒకటివెంట మరొకటి బుర్రలో మెరిసినయ్యి. కాని ఒక్కటీ నచ్చలేదు. అప్పటికి పదకొండుగంటలు దాటింది. ఇంతలో చటుక్కున ఒక మంచిసన్నివేశం తళుక్కున మెరిసింది. వ్రాయడానికి పూనుకున్నా.

'గృహప్రవేశానికి రమ్మని అన్నయ్య జాబువ్రాస్తే శేషు. భార్యను తీసుకొని బెజవాడ బయలుదేరాడు. సికింద్రాబాదు స్టేషనులో...' ఉపక్రమించి వ్రాస్తున్నాను. "అదేమిటండీ, అర్ధరాత్రప్పుడు నిద్రచెడగొట్టుకొని వ్రాస్తూ కూర్చోకపోతే, ఉదయం వ్రాసుకోరాదూ, శలవులేగా" అంటూ మా ఆవిడ గదిలోప్రవేశిస్తూ అన్నది, అప్పుడే యిల్లుసర్దుకు వచ్చి.

కథానిక వ్రాసి యివ్వడానికి రెండురోజులే వ్యవధివుందని అన్నప్పుడల్లా ఆలోచనలు రావని, వచ్చినప్పుడే అర్ధరాత్రయినా సరే వ్రాసుకోవాలిసిందేననీ ఒక చిన్న ఉపన్యాసం యిచ్చాను.

సంతోషించినట్లేవుంది, పడుకోండి, రేపు వ్రాసుకోవచ్చుఅంటూ, స్విచ్ నొక్కి దీపం తీసేసి పడుకుంది. ఏమిటే అఘాయిత్యం అని విసుక్కుంటూ లేచివెళ్ళి మళ్ళీ లైటువేసుకుని వ్రాయడానికి ఉపక్రమించాను.

ఆలోచనలకు అంతరాయం కలిగిందేమో, మరల వెంటనే వ్రాత కొనసాగించలేకపోయాను. పైగా నిద్రముంచుకొచ్చింది. సరే రేపు వ్రాసుకోవచ్చునని దీపం తీసివేసి పడుకున్నాను.

ఉదయం స్నానాదికాలు ముగించి ఏడుగంటలకల్లా గదిలో బల్లముందు కూర్చున్నా కథానికను పూర్తిచేద్దామని.

'సత్యం వున్నాడా' అంటూ లోపలికి వచ్చాడు నాయుడు. దూరదేశంలో ఉద్యోగం చేస్తున్నాడేమో ఈ మధ్య మేము కలుసుకొని సంవత్సరం పైగా

గోవాడ సత్యారావు

అయింది. ఇద్దరికీ ఉత్తరాలు వ్రాయడమంటే వళ్లు బద్ధకం. వాడికబురు తెలిసికూడా మూడునాలు నెలలయింది. మేమిద్దరం కలిసి చదువుకున్నాం పదేళ్లు. ఆ రోజుల్లో ఒకటిగా తిరిగేవాళ్లం. ఆ క్రితంరోజే వచ్చాడుట ఊరినుంచి. చూద్దామని వచ్చాడు ప్రొద్దున్నే.

వాడి మాట వినగానే కాగితం కలం అక్కడే వేసి ఒక్క గంతులో గదిలోనుంచి బయటకు వచ్చాను. నాయుడు వచ్చాడనటంతోటే వంటింట్లో పనులు ఆపి మా ఆవిడ కూడ వచ్చింది. పిచ్చాపాటీ కొంతసేపు మాట్లాడుకున్నాం. మధ్యాహ్నం 11 గంటలకు భోజనాలు చేశాం. మూడు గంటలకు ఊరికి వెళ్లాలని, మళ్ళీ ఆదివారం వస్తానని చెప్పి నాయుడు వెళ్లిపోయాడు.

వాడిని పంపించి గదిలోకి వచ్చి కథానికను పూర్తిచేయడానికి ఉపక్రమించాను. పనిమనిషి ఏదో పొరపాటు చేసిందేమో, దానిమీద మా ఆవిడ నోరుచేసుకుని అరుస్తున్నది. పంజాయిషీ యిచ్చినకొద్దీ రెచ్చిపోయి యిష్టం వచ్చినట్లు తిడుతున్నది. కథ పూర్తిచేసి యివ్వాలన్న ఆగుర్దా ఎక్కువైనకొద్దీ మా ఆవిడ అరుపులు భరించరానంత చిరాకు రెట్టించింది.

'అబ్బబ్బ, నన్ను వ్రాసుకోనీకుండా ఏమిటే ఒకటే గోల, అవతలికి పోరాదూ' అన్నాను విసుక్కుంటూ.

'అవునులెండి మీకు ఇది గోలగా వుంటుంది. అదిచేసిన తప్పు మీకు కనిపించదు'—అప్పుడే కోపం వచ్చింది— "ఇంత ఎందుకూ, నేను యిక్కడ వుంటే మీరు వ్రాసుకోలేక పోతున్నారుగా, నేను మా వాళ్ళయింటికి పోతున్నాను, మీరు కథ వ్రాసుకోండి, రాత్రికి తిరిగి వస్తానులెండి" అంది. యాదాలాపంగా సరే వెళ్ళు అన్నాను. మా ఆవిడ అసలే ముక్కోపి. మహాపట్టుదల మనిషి. వెంటనే పనిమనిషిని పంపి ఒక టాక్సీ పిలిపించుకొని దోమలగూడాలోవున్న వాళ్ళ అక్కగారింటికి వెళ్లింది.

విసుగ్గా వుంది. మా ఆవిడకు కోపంవచ్చి వెళ్ళింది. ఏమిటో బుర్ర పనిచెయ్యలేదు. ఒక్క కునుకుతీసి తర్వాత వ్రాసుకుందామని నిద్రపోయాను. నాలుగు గంటలకు లేచి ముఖం కడుక్కొని కాఫీకొరకు బజారు వెళ్లి వచ్చాను.

తలుపుతీసి లోపలప్రవేశించుతుండగానే ఒకాయన వెనకనుంచి పిలిచాడు.

"సత్యనారాయణగారు మీరేనాండి,"

"అవును, మీరెవరు?"

"సెక్రటేరియటులో ఉద్యోగం చేస్తున్నానులెండి."

"లోపలికి రండి".

"మాస్టారూ ఈ రోజుల్లో ఇలు దొరకటమంటే చాల కష్టంగా వుందండి. ఆంధ్రప్రదేశ్ ఏర్పడి కొన్ని వేలమంది ఇక్కడికి వచ్చారేమో మరి యిబ్బందిగా వుందండి."

"అవునండి" అన్నాను మర్యాదకోసం.

"అందుకనె బోర్డు చూడగానే మిగతా పనులు మానుకుని వెంటనే వచ్చేశాను. ఏ భాగముండీ, ఎన్నిగదులు, చూడవచ్చునా," నాకేం బోధపడలేదు.

"నాకేం తెలియదండీ, అయినా యిక్కడేం భాగాలు ఖాళీగా లేవు" అన్నాను.

"అదేమిటండీ భాగం ఖాళీగా వుందని బోర్డువేసి యిప్పుడు లేదంటారు, ఇంతలోనే మిగిలిపోయిందా ఏమండీ."

"ఏం బోర్డండి, నాకేం తెలియదే," ఆశ్చర్యపడుతూ అడిగాను.

"సెక్రటేరియటు గేటుకు తగిలించివుం

ర్డు. ఇక్కడ యిల్లు ఖాళీగావుందని, వివ లు మిమ్మల్లను కనుక్కోవచ్చుని." అని యన చెప్పేసరికి నాకు మతిపోయినంత ని అయింది.

ఎవరో నా విరోధులు ఈపని చేసివుంటా రని, నిజంగా ఏమీ అద్దెకిచ్చే భాగాలు లేవని నచ్చజెప్పి ఆయనను పంపించేటప్పటికి నా తల ప్రాణం తోకకు వచ్చింది.

ఎవరు చేసివుంటారా అని ఆలోచిస్తూ వుండిపోయాను. తర్వాత మరల కథను వ్రాద్దామని మొదలుపెట్టాను.

ఇంతలో ఎవరో తలుపుకొట్టారు.

"సత్యనారాయణగారు మీరేనా" తలుపు తియ్యగానే ప్రశ్నించారు. వీరుకూడా యింటికోసమే వచ్చారట.

"అసెంబ్లీముందు వుంటే యీ అట్టను పట్టుకు వచ్చాను. లేకపోతే ఇంకా చాల మంది పోటీకి రాగలరు. ఇళ్ళు దొరకటం కష్టంగా వుంది కనుక, క్షమించాలి."

"ఈ బోర్డు వేసినవా రెవరోగాని మీకూ శ్రమ కలిగించారు. నాకూ శ్రమ కలిగించారు. ఈ బోర్డు విషయం నాకు తెలియదు, నేను వేయలేదు, ఇక్కడ యిళ్ళు ఖాళీగా లేవు" అని చెప్పేసరికి ఆయన నిర్ఘాంతపోయారు. ఆశపడి వచ్చినందుకు మోసం జరిగిందేమిటా అనుకుంటూ వెళ్ళిపోయారు.

ఇక యింట్లో వుంటే లాభం లేదనుకుని బట్టలు వేసుకుని క్లబ్బుకు వెళ్ళాను.

మామూలుగా యింటికి తిరిగి వచ్చే వేళకి మా ఆవిడ తిరిగి వచ్చింది.

భోజనం చేస్తున్నప్పుడు అడిగింది మా ఆవిడ, కథ పూర్తయిందా అని. వ్రాయడానికి వీలుపడలేదని సాయంత్రం ఇంటి దగ్గర జరిగిన విచిత్రం ఆవిడతో చెప్పాను. ఇంతటి అఘాయిత్యానికి ఎవరు పూనుకొని వుంటారా అని అన్నాను.

ఫక్కునవవ్వి, తనే చేసినట్లు చెప్పింది మా ఆవిడ విజయగర్వంతో. "నేను యింట్లో లేకపోతే మీరు కథ పూర్తిచేసుకుంటా నన్నారుగా ఎలాచేసుకుంటారో చూద్దామని, మా రాముడు కిచ్చి పంపెంచి ఈఅట్టలు కట్టించాను." అంది.

"ఇప్పటికి ఓడిపోయినట్లేలే" ఓటమిని అంగీకరించాను "అనువుగాని వేళ అధికులమన రాదు." కనుక భోజనాలయినయ్యి, కథ ప్రసక్తి లేకుండానే నిద్రపోయాను.

మరునాడు ఉదయమే కాఫీ సేవించి, బజారులో పనివున్నదని, బహుశః భోజనానికి రాకపోవచ్చునని చెప్పివెళ్ళాను. తాజ్‌మహాలు హోటలులో గట్టిగా ఫలహారం చేసి సరాసరి పబ్లిక్ గార్డెన్సుకి వెళ్ళాను. ఒకమూల కూర్చొని కథ వ్రాయడం ప్రారంభించాను.

"శీను, అతనిభార్య సికింద్రాబాదు స్టేషనులో..." అది అక్కడే ఆపివేశాను.

సాయంత్రానికి ఇంకో కొత్తకథ వ్రాసి తీసుకెళ్ళి సంపాదకునికి అందించాను.

ఇంట్లో మరల కథ ప్రసక్తి రాలేదు.

ఆదివారం ఉదయం పత్రికల కుర్రవాడు 'శారద'ను తెచ్చియిచ్చాడు. నేను గదిలో గడ్డం చేసుకుంటున్నాను. మా ఆవిడా పత్రికను తీసుకుని పేజీలు తిరగవేస్తూ నా పేరన కథచూచి ఆశ్చర్యపోయింది. పూర్తిగా కథ చదివి, పట్టరానంత కోపంతో గదిలోకి వచ్చింది ఒకచేత్తో పత్రిక పుచ్చుకొని.

"ఇదంతా వ్రాయమని ఎవరు చెప్పారు" గర్జించింది.

"ఏం కథ బాగాలేదా? బాగాలేదని సంపాదకునికి ఒకజాబు వ్రాయి. జన్మలో కథ వ్రాయమని నన్ను అడగడు. నీకూ శ్రమ తప్పుతుంది. నాకూ శ్రమ తప్పుతుంది. ఊళ్లో వాళ్లు అనవసరంగా యిక్కడికి రాకుండా తప్పుతుంది." అన్నాను కొంటెగా.

"ఎన్నిఏళ్లువచ్చినా కుర్రతనపు చిలిపి చేష్టలుమాత్రం పోవు. మీకే పంతం చెల్లించుకున్నారులేండి." ★

(16-వ పేజీ తరువాయి)

తాపీగా ఆలోచించండి" అన్నాడు రామనాథంగారు లాలనగా.

సుబ్బారావుగారు ప్రసన్నుడయ్యాడు. "అహా అసలు చెబుగురూ" అన్నాడు.

రామనాథంగారు చిన్న పొడిదగ్గు దగ్గి ఉపక్రమించారు.

"మంత్రి కాబోయేముందు మంచిపని చెయ్యాలన్నారు. మా అబ్బాయి మీ పిల్లని చేసుకుంటానని పట్టుబట్టి ఇంకెన్ని సంబంధాలొచ్చినా తిరగ్గొడుతున్నాడు. మీ సీతమ్మకీ ఇష్టమేట. ఇక మా మాటఅంటారా చెప్పేదేముంది. మీవంటివారితో వియ్యం... మరి మీరుశాంతను చెయ్యడమే తరువాయి" అన్నారు తాపీగా.

సుబ్బారావుగారు చుట్టూ పరకాయించి చూశారు. గదిగుమ్మానికి చేరబడి రామనాథంగారి భార్య నిల్చుంది.

"అవు నన్నగారూ ఊఁ అనండి" అందామె.

సీత వెనకాల నించుంది తనవేపే చూస్తూ. కొంచెం అవతలగా తుకారాం నిలబడి ఆతృతగా చూస్తున్నాడు.

సుబ్బారావుగారు గంభీరంగా మొహం పెట్టి ఆలోచించారు. చుట్టూ పరకాయించారు.

"అప్లికెంట్ ఏడీ?" అన్నారు.

"అబ్బాయ్ ఇలారా" అని రామనాథంగారు కేకేశారు.

గురునాథం వచ్చాడు మెల్లిగా.

"ఏవోయ్ మాపిల్లని చేసుకోవాలనుకుంటున్నావా?" అన్నారు సుబ్బారావుగారు.

"మరేండి" అన్నాడు గురునాథం మెల్లిగా.

"ఏమే సీతా నచ్చాడా?"

సీత నవ్వింది; ప్రేమించినవాడిని పెళ్లాడబోయే పిల్లలా.

"శుభం. శాంతుసైపోయింది పెళ్ళి ముహూర్తం పెట్టించండి బావగారూ" అన్నారు సుబ్బారావుగారు.

అందరి మొహాలూ వికసించాయి ఆనందంతో.

హీరో గురునాథరావు ముఖారవిందం మాత్రం కొంత తటపటాయిస్తోంది.

"ఏమిట్రా" అన్నారు రామనాథంగారు.

"గు...గుందు...కొ...కొంచెం ఆగి ము...ముహూర్తం" అన్నాడు గురునాథం గుటకలు మింగుతూ.

"హారినీ...గుండు గురించి కూడా బెంగే?...వెశ్వప్రొపింగు ఇస్తే పెరుగుతుంది భయపడకు. మీ నాన్నజీతం అనుకున్నావేమిటి, ఒకంతటా పెరక్కపోడానికి?" అన్నారు సుబ్బారావుగారు ఫెళ ఫెళ నవ్వుతూ.

"__లేపోతే నీ మావగారి అదృష్టం అనుకున్నావా" అని రామనాథంగారు అందుకోబోయారుగాని, కోలేదు; తమాయించుకున్నారు.

* * *

పెళ్లి మర్నాడురాత్రి గురునాథరావు సీతకి తనడైరీ వినిపించి తనుపడ్డ వేదనని వివరించాడు.

"సీతా నీకోసం ఎన్నిసంబంధాలొదిలేశానో చూశావా; మీ నాన్నగారు మంత్రిపదవికోసం ఉద్యోగాలూ ప్రాక్టీసూ వదిలేసినట్టు. ఎటొచ్చి నేను సాధించాను. ఆయన ఇంకా లేదు. సాధిస్తారనుకో."

"ఈముక్క నాదగ్గిరంటే అన్నారుగాని మానాన్నదగ్గి రన్నారంటే జాగర్త. ఆయన సుభ్భరంగా ప్రాక్టీసు చేద్దామని నిశ్చయించుకొన్నారు" అంది సీత నవ్వుతూ.

* * *

"పది" అంది గదిలో గడియారం.

"నమస్తే" అంది సుబ్బారావుగారింటి గడియారం ప్రతిధ్వని... ★

అసంప్రేక్ష్యకారిత్వము... పంచతంత్రము ...అయిదవ భాగము



...సేయరచన...
నండూరి. రామమోహనరావు
బొమ్మలు.. బాపు



ఏకాంకిక:

పురాణ ప్రభావం

ఎ. వి. మోహన్



[ఇంటి వసారాలో వొకవేపు దీపం వుండదు. మసక మసకగా వుంటుంది. పెద్ద తక్తా బల్లగాని లేక మామూలు బెంచి గాని వుండి దానిమీద ఒక కొసను నిండుగా వున్న చేతిసంచి, గొడుగు కనిపించుతూ వుంటవి. మధ్య మధ్య వీధి వేపు పరకాయించి చూస్తూ యింటి యజమాని అటూ ఇటూ పచారు చేస్తూవుండగా వారి కుటుంబ మిత్రుడు దారే పోతూ యింటి వేపు చూసి]

మిత్రుడు : బావా ! నువ్వేనా ?

యజమాని : నేను కాకపోతే 'బావా' అని యెవర్ని పలకరిస్తున్నావు?

మిత్రుడు : సంధ్యవేళ దీపం గీపం లేకుండా వసారాలో తారుతుంటేను అవునా కాదా అని అనుమానించాలే.

యజమాని : తారుతున్నానంటావు! అవును, నా యింటిముందే నేను తారుతున్నానని నీబోటివాళ్ల చేత అనిపించుకోవాల్సిన కర్మ పట్టింది నాకివ్వాళ మరి. ఇట్లా యెంతసేపు నిరీక్షిస్తూ పడిగాపులు పడుండాలో తెలియటం లేదు.

మిత్రుడు : సంచీ, వ్యవహారం, అంతా చూస్తే యిప్పుడే రావటంలా కనిపిస్తుంది. అవునౌను ! యీ మధ్య వూళ్లో లేవుకదూ ! (వసారా యెదురుగా వున్న వీధి దీపం వెలుగుతుంది. దాని వేపు తిరిగి చెంపలు వాయించుకుని నమస్కారం చేసి కళ్ళ నద్దుకున్నట్టు చేతులు తిప్పుతాడు. వీధి దీపం వెలుగులో రంగస్థలంమీదివారు చక్కగా కనిపిస్తూ వుంటారు.) అక్కగారు, పిల్ల కోవెలకు పురాణం వినటానికి వెళ్లారేమో ? వేళ కావచ్చింది. వచ్చేస్తూ వుంటారులే యీపాటికి. అందుకా యీ చిరచిర అంతాను ?

యజమాని : చిరచిర కాకపోతే యేమిటి నాకు తెలియక అడుగుతాను ! తిరిగి తిరిగి కొంపకు చేరితే కాళ్ళు ముఖం కడుక్కొని కాసిని మంచినీళ్ళు తాగే యోగమున్నా లేకపోతే ! పురాణాలుట పురాణాలు ! పదిమంది ఆడపీనుగుల్ని చేరబట్టటానికి కాకపోతే యెందుకీ పురాణాలు? ఆ చెప్పేవాడి కఘోరించిందా, యీవినే వాళ్ళకేడిచిందా భక్తి?

మిత్రుడు:—నువ్వు వాళ్ళను యెప్పుడూ యే సినిమాకూ తీసుకెళ్ళవు సరికదా, పోనీ నన్నా పోనీవాయె. ఊళ్ళో లేవు కదా ఎటూ అని, పురాణం వినటం కూడనిపనేమీ కాదుగదా అని, వెళ్ళుంటారులే. మంచి నీళ్లు కావాలిస్తే, ఆపక్క మీతమ్ముడి ఇల్లు యీపక్క పెత్తండ్రి యిల్లూకద, వెళ్ళి తాగి రాకాదూ? పోనీ నన్ను తెచ్చిపెట్టమంటావా?

యజమాని:— నేను పోయి తాగిరానూ అక్కడ్లేదు, నువ్వు లేనూ అక్కడ్లేదు వారికీ మాకూ గల సమోగ్యత ఈవూళ్లో తెలియందెవరికి? నువ్వేం యెరగనట్టు మాట్లాడుతావు?......సరేగాని, మా తమ్ముడి కూతుర్ని చూట్టానికి హైదరాబాదు నుంచి యెవరో పెళ్ళికొడుకు దిగుతాడని విన్నాను. చూసెళ్లాడేమో?

మిత్రుడు:—అసలు సంగతి నీదాకా రాలేదన్నమాట! హైద్రాబాదు అబ్బాయి యిప్పటికో పది పదకొండేళ్లనుంచి వండుకు తింటూ ఉద్యోగం చేసుకుంటున్నాట. అతగాడికి అదే అలవాటై పోయిందిట. అందుచేత పెళ్లి చేసుకుందామనే మాటే తలపెట్టటం లేదు అని అతడి మేనమామగారు మీ తమ్ముడికి ఉత్తరం రాశాడు.

యజమాని:—అంటే, పెళ్లాం వండిపెట్టటానికే అని అతగాడి వుద్దేశం అన్న మాట. ఈకాలపు కుర్రాళ్ల తెలువులుయిట్టావున్నై!

మిత్రుడు:—అదేమిటి బావా! వాళ్లేం తెలివితక్కువ వాళ్లనుకున్నావా? కట్నం చాలక అదో వంక పెట్టి నట్టుంది.

యజమాని:—ఆ అబ్బాయి చెయ్యి కాల్చుకోకుండా వుండాలంటే మరో అయిదు వందలో వెయ్యో దర్శించుకోవాలన్నమాట. పోనీ పెళ్లిచేసుకుంటే మాత్రం యేం? పెళ్లానికి కూడా తనే వుడకేసి పెడుతూ ఉండరాదూ, అంతగా ఆ అలవాటు మానుకోటం చేతకాకపోతే!

మిత్రుడు:—బాగా చెప్పావు! అయినా గుంటూరుజిల్లా గొడ్డుబోయిందీ, పెళ్లికొడుకులకి, హైద్రాబాదుదాకా పరిగెత్తటం యేమిటి?

యజమాని : రాజధాన్ని, యీ బస్తీ లేవి పనికిరానట్టు, అక్కడపెట్టలా ? అట్టాగే పెళ్ళికొడుకులూ అక్కడివాళ్ళుగాని పనికి రావటం లేదేమో !

మిత్రుడు : అలాగేవుంది చూడగా ! సరే గాని, యింతకూ పిల్లదానికి యెక్కడన్నా ఖాయంచేసుకొచ్చావా ? బావా !

యజమాని : అబ్బే ! లేదోయ్ ! ఆ తాకట్టుబాకీ యేమన్నా వసూలై తగలడుతుందేమో అని యేటవతలికి వెళ్లాను. 'మా నాన్న కోతేటిపాలం మహానాలుకు వెళ్ళాడు, రేపో యెల్లుండో వస్తాడు' అని వాళ్ళబ్బాయి అంటే చుట్టుపక్కల చిల్లరా

మల్లగా చూసుకుంటూ కూర్చున్నాను. మూడురోజులు చూసినా ఆయన రాలేదు. ఏమోతుమో తేల్చుకుందామని నేనే ఆవూరు వెళ్ళాను. వారం నాడే ఆయన అక్కడనుంచి దయచేశాడని తెలిసింది. సరే ఓ నోటీసు అంటిద్దాం లే వీడిచుట్టూ యెవరు తిరుగుతాడని యాకాయకి తిరుగుముఖం పట్టాను. ఆ కొళ్ళేటివాళ్ళకు వార్రెళ్ళా, కొల్లా? తిండి తిప్పలు లేకుండా కొంపకు చేరితే యెగురుగుండా తాళం పెట్టిన యిల్లు కనిపించిందేగాని యిల్లాలు లేకపోయె. దీన్ని యేమనాలో, యేం చెయ్యాలో అర్థం కావటం లేదు. పురాణానికే వెళ్ళిందో, పుట్టింటికే లేచిపోయిందో! దానికదు పురేకా! ఆ పురాణానికేమీ దరీ అంతూ వుండదా యేమిటి? పొద్దుతిరక్కముందే వంటలుచేసి పెట్టుకుపోతారా, వచ్చి పొయ్యిరాజేస్తారా అని! యేది! యెక్కడా వస్తున్న జాడే లేదు.

మిత్రుడు: 'ఆ కలిదప్పుల కడల నేలా' అన్నాడు మహాకవి. వస్తారులేవయ్యా! వెళ్ళిన వాళ్ళు రావద్దూ? అందులో ఆ బ్రాహ్మడు 'చవులూరగనోరుబుటు' చదువుతున్నాడు పద్యాలు, యిందాక వస్తూ విన్నాను.

యజమాని: ఏమిటే తాగుమారు! నాటకాల పాండిత్యం గామల్లు యిదంతా?

మిత్రుడు: నా పాండిత్యం మాటకేం గాని, ఆమధ్య పిల్లను యెవరో చూసి వెళ్లారని విన్నా. అన్నివిధాలా మంచిసంబంధమేటగా? లగ్గాలు పెట్టుకుందామని వెళ్లావేమో అనుకున్నా.

యజమాని: ఆఁ! అదా! కాస్తలో తప్పింది.

మిత్రుడు: అంటే?

యజమాని: మేము భొందను పడటం.

మిత్రుడు: సరికిసరి అప్పుందా?

యజమాని: సారి! వున్నవాటిని గురించి కాదోయ్ వచ్చినబాధ.

మిత్రుడు: అయితే అసలు ఆస్తే లేదంటావా? అంతా బూటకమే?

యజమాని: ఆస్తి పాస్తులమాట అట్లా వుంచు. ఆ అబ్బాయికి అసలు తలకాయే లేదు.

మిత్రుడు: మొగుడు మేనకుడైతే పెత్తనం పెళ్ళాం చేస్తుంది, యింకేం! అయినా యీ రోజుల్లో తెలివి యెవడికొక్కడికి కావాలి? కావాలిసింది ఆస్తి. అది పుష్కలం గావుంది. కుర్రాడు చూపరి. పిల్లకంటె వొక ఛాయ పసిమేట కూడా! తథాస్తూ అనుకుంటే పోయేదేమో?

యజమాని: కథంతా వింటే ఆ మాట అనవు.

మిత్రుడు: చెప్పరాదూ! వింటాను.

యజమాని: ఏం చెప్పను! చామర్దా కూడా.

మిత్రుడు: ఇందాకా వచ్చి చెప్పక పోవటం యేమిటి? కాబురూ, యింతలో యేంపోయింది?

యజమాని: అయితే విను. నువ్వు చెప్పినట్టు అన్నీ బాగానే వున్నాయి. కావలసినంత ఆస్తివుంది. ఒక్కడే పిల్లవాడు. మంచి రూపసి. తండ్రి ఇంకా సంపాదిస్తున్నాడు కూడా. యెన్ని వుంటే యేం లాభం, అసలు తలకాయే లేకపోతే?

మిత్రుడు: ఆ లేకపోవటమేమిటో త్వరగా చెప్పి నేర్చూ, కాస్త వింటాను.

యజమాని: కాసేం! పూర్తిగానే విను. నేను పిల్లవాడిని చూట్టానికి వెళ్ళినప్పుడు ఆ అబ్బాయి కాలేజీకి బయల్దేరుతున్నాడు. కుర్రాడి తండ్రి నన్ను కూర్చోమని యేవో పుస్తకాల సంగతి, గుడ్డల గురించి, పచారికొట్లో సరుకులు కల్తీంచటం విషయం మాట్లాడాడు. అతనూ సమాధానాలు చెప్పాడు. ఓనత్తి నందిలేదు. బాగానే వుంది. మురుసుకున్నాను సంబంధం కుదిరితే అవునని.

మిత్రుడు: అయితే తలకాయలేని వాడు కాలేజీ చదువు యెలా చదువుతున్నాడూ అని! అసలు చదువుతున్న మాట నిజమేనా?

యజమాని: పరీక్షలు ప్యాసౌతుంటే కాలేజీలోనూ చదవొచ్చు వున్నోనాగాలా వెలగపెట్టొచ్చు.

మిత్రుడు: పిల్లనివ్వటానికి పనికిరానంత ఉవ్యక్తులు అవి మాత్రం ప్యాసు కావటం యెలా?

యజమాని: యెలాగేమిటి? నూర్లలు పైనలుదాకా పంతుళ్ళను పట్టుకుని, అక్కడ నుంచి పరీక్షల్లో తెలుపు నలుపు చేసేది, పచ్చకాయితాలు వున్నుకు బయల్దేరేది. పరీక్షలు వాటంతట అవే ప్యాసవుతయ్యి.

మిత్రుడు: నీదంతా విడ్డూరం! బియ్యేలు యమ్మేలు కావటం అంతసులువైతే అంతా కావచ్చే?

యజమాని: విడ్డూరం యేముంది? శ్రీమంతులకు అంతా సులువే. లక్ష్మి ప్రసన్నం వుంటే సరస్వతి వచ్చినట్టు చెప్పినమాట వింటుంది. అడగటం ఆలస్యంగా యెన్ని డిగ్రీలన్నా తగలేస్తుంది. డిగ్రీలు ప్యాసై పబ్లిక్ సర్వీసు కమీషను పరీక్షకు వెళ్ళి వారక్కడ చెప్పే సమాధానాలు అప్పుడప్పుడు ప్యాపర్లలో పడుతూ వుంటాయి నువ్వెప్పుడూ చూడలా? చూస్తే, వారేమిటో, వారి చదువులేమిటో, డిగ్రీలు ప్యాసుకావటం యేమిటో అర్థం అవుతుంది.

మిత్రుడు: అవునౌను! ...ఊఁ! తరవాత యేమయింది? ఆ సంబంధం కుదిరితే బాగుండునని మురుసుకున్నావు. ఊఁ!

యజమాని: సరే! కుర్రాడి తండ్రీ నేనూ కట్నం, లాంఛనాలు, ఆడిగాగలయా వస్తు విషయాలూ మాట్లాడుకున్నాం. మనకు అందుబాటులోనే వున్నారులే, యెక్కడో చెట్టెక్క కూర్చో లేదని కూడా సంతోషించా. ఒక్కతే పిల్ల. మళ్ళీ మళ్ళీ మనం చేసే కార్యక్రమాలేమున్నాయి కనక? అయిదురోజులు పెళ్ళి చేస్తానన్నాను. "ఇప్పుడు అయిదురోజులు యెవరుచేస్తున్నారండీ? అయినా నాకు అన్నాళ్ళు కూర్చోటానికి తీరుబాటెక్కడ? కుర్రాడికి పరీక్షలు దగ్గిరపడుతున్నవి. ఒక్కరోజుతో ముగించెయ్యండి. కట్నంమాత్రం యింకో రెండు వేలు కలపండి" అని మొండికేశాడు. సరే, ఆ రెండు అయిదులకూ తలవూపాను—మహా తగిలితే పెళ్ళె పదిహేనురోజులపండగ వెళ్ళేప్పటికి యింకో అయిదు తగులుతుంది యింతేగదా అని.

మిత్రుడు: దీనైన సంబంధం కుదరాలి గాని నీకదోలెక్కా?

యజమాని: అవునౌలే! అయితేనేం! చివరకు గాని లోపలి లొటారం బైటపడలేదు.

మిత్రుడు: ఊఁ! ఊఁ! వస్తున్నావు.

యజమాని: నేను తల వూపానో లేదో, తక్షణం తాంబూలాలు పుచ్చుకుందామన్నాను. పిల్లను చూడడుగాని పిల్లవాణ్ణి తీసుకు మా యింటికిరండి, అమ్మాయి, వాళ్ళ అమ్మకూడా కుర్రవాణ్ణి చూస్తారు, అప్పుడు తాంబూలాలు పుచ్చుకోటం యేమిటి, లగ్గాలూ పెట్టుకుందామన్నాను.

మిత్రుడు: అప్పుడే నీకేదో వాసనేసిందన్నమాట? అవలిస్తే పేగులు లెక్కపెడతావు, మొత్తానికి!

యజమాని: అదే! మనం త్వరపడాలిసిందిపోయి ఆయనగారే అంత తొందరపడుతున్నాడేమిటా అనిపించింది. "అబ్బే! పిల్లదాన్ని చూడక్కరేద"న్నాడు. నా అనుమానం మాగాకేసింది. ఈరోచ్చిన పిల్లలకు పెళ్ళిచేసేప్పుడు అసలు వాళ్ళిద్దరూ చూసుకోటం యెందుకైనా మంచిది. మనం అక్కరలేదనుకుంటాం, పెద్దవాళ్ళం, కాని వాళ్ళలా అనుకోరండీ వచ్చిన చిక్కు, మీరు అబ్బాయిని తీసుకు వీలయినంత త్వరలో రండి' అన్నాను. ఏమనుకున్నాడో వెంటనే పంచాంగం తిరగేసి "ఎల్లుండి సాయంత్రం బాగుంది. అయిదుగంటల బండిలో వస్తాము" అన్నాడు.

మిత్రుడు: ఇంతకూ పిల్లవాణ్ణి తీసుకొచ్చాడా? ఒక్కడే దిగాడా?

యజమాని: పడాల్సిన జాగర్తంతా పడతాడుగాని అంత తెలివితక్కువచేస్తాడా? పుత్రసహితంగానే దిగాడు. కాని ఆబండి రెండుగంటలు లేటుకావడంతో సరిగ్గా

★ పురాణ ప్రభావం ★

ర్గానికిముందు చేరారు. అవధాన్లుగారు ఇక ఆ పూటకు మంచిదికాదు, మర్నాడు శేషుగ్గా వుందన్నారు. దాంతో ఆరాత్రి యిక్కడ వుండిపోవాలిసొచ్చింది. తండ్రీ కొడుకులకు మాపెత్తల్లిగారియింట్లో వంట చేయించాను.

మిత్రుడు: కతికితే అతకదనా?

యజమాని: కతక్కపోతే అతికేడిచింది కనకనా? అదో వెర్రినమ్మకంగాని.

మిత్రుడు: ఊఁ! సరే! తెల్లారింది.

యజమాని: అప్పుడే యేం తెల్లారటం! ఆ! పిల్లవాడి తెలివి తెల్లారింది! భోజనంచేసి అక్కడే పడుకుంటామన్నారు. అక్కడ చోటు కుశలం, పైగా మంచాలు అవీ యిక్కడనుంచి చేరెయ్యాలి. భోజనాలై వచ్చేప్పటికి పక్కలు యిక్కడ సిద్ధంగా వుంటవన్నాను. తండ్రీ కొడుకులు నిద్ర తూలిపోతున్నట్టు కనిపించారు. భోజనానంతరం మాటలు పెట్టుకోకుండా 'నేనూ, ఆయనా, కొడుకూ వరసగా మూడుమంచాల మీదా పడుకున్నాం. వెన్నెల పిండార బోసినట్టుంది. చంద్రుడు వసారాలోకి కనిపిస్తున్నాడు. పరాయిచోటు కావడంచేతనేమో కుర్రవాడికి నిద్ర పట్టినట్టులేదు. ఓ కొంతసేపటికి నాన్నా నాన్నా అని పిలవటం మొదలు పెట్టాడు. నిద్రపోతున్నానో మేలుకున్నానో అని గొంతుల్లు ముందు నావేపు పరకాయించిమాసి, ఏమిట్రా! యెందుకు పిలుస్తున్నావు? నిద్రపట్టించుకో" అన్నాడు కొంచెం గద్దింపుగా తండ్రి. "అదికాదు నాన్నా! మరి, యీ వూళ్ళో చంద్రుడూ మనవూళ్ళో చంద్రుడూ ఒక్కడేనా?" అని ఆ పుత్రరత్నం తన శంకను వెళ్ళబెట్టాడు. ఘోర పిడుగా! అనుకుని తెల్లవార్లూ నిద్ర పట్టకపోయినా నిద్రిస్తున్నట్టే పడుకున్నాను.

మిత్రుడు: పిడుగేమిటి! పిడుగున్నర! బియ్యే చదువుతున్నాడూ! బాగుంది!

యజమాని: ఆహా! దాందేమిటి! కృష్ణమీనన్ను గురించి నీకు తెలిసింది వ్రాయుము అంటే నల్లసముద్రంల్లో దొరికే అదోజాతిచాప అనీ నల్లగావుంటుందనిరాసిన ఆసామికంటె యితడేం తక్కువతిన్నాడా?

మిత్రుడు: తక్కువ! రెండాకులెక్కువే చదివాడు.

యజమాని: ఇప్పటి చదువులే అంత ఆశ్చర్యపడాలిసిందేమీ లేదు. చూడు! అదుగో! ఆపైన, వీధి దీపం వెలుతుగ్గో, మాయింటిదెనల్లే వుంది వస్తోంది, మందగమనంతో, నాకు చూపానదు.

మిత్రుడు: అబ్బే కాదుబావా! ఆకలి తొందర్లో అందరూ నీకు అక్కగారులానే కనిపిస్తున్నట్టున్నారు. ఆవిడ అలాయెందుకు నడుస్తుంది?

యజమాని: ఎంత చూపానకపోతే మాత్రం! మా ఆవిడ నడక నేను గుర్తించలేనాయేం? ఆ! ఆవిడగారే! దయచేస్తున్నారు. పురాణశ్రవణంవల్ల సంప్రాప్తించిన పుణ్యం అంతబరువుగా వుందేమో! అడుగు ముందుకు పడటంలేదు.

మిత్రుడు: ఆఁ! అక్కగారే! ఒక్కతే వస్తుంటేను కాదేమో అనుకున్నా. నువ్వు వొచ్చినట్టుతెలిసి పురాణం పూర్తికాకపోయినా వచ్చేస్తోందనుకుంటా.

యజమాని: పురాణంకాదు! పురాణ జ్వరం! ఇదిరోజూ సాయంత్రం యిట్లా యెన్నాళ్ళు వేధించాలో!

మిత్రుడు: ఊఁ! నీదంతా మరీ చాతురు. లేచిందగ్గర్నుంచి వంటా పెట్టూ తో మునగానాం తేలానాం. యేనోయెప్పుడన్నా యిట్లాకాస్త పురాణానికన్నా వెళ్ళకపోతే వాళ్ళకు విశ్రాంతియేది?

[యజమానిభార్య ప్రవేశించుతుంది. విలువైనగుస్తులు, ఆభరణాలు ధరించివుంటుంది. పూర్తిగా కాకపోయినా మొత్తంమీద ఆధునికమైన వేషం.]

యజమాని: ఎక్కడదన్నావే యింతసేపు? పొద్దుపోకిందా? ఇల్లూ వాకిలి యిప్పటికిగాని గుర్తురాలేదు! పాతేసినా పాపంలేదే!

భార్య: మిమ్మల్ని చూడగానే యేదో శుభవార్త చెబుతారనుకున్నాను. చావులూ, పాతిపెట్టాలతో ప్రారంభించారు. అంత కోపం యెందుకండీ!

మిత్రుడు: (బ్రహ్మవేత్త, వేదవ్యాసుడి అంతవాడికే రెండుపూటలు తిండిలేకపోతే ఒళ్ళుపై తెలియలేదు. బావకి కోపంరావటం పొరపాటా జనా!

యజమాని: పిల్లదియేది? పురాణం పూర్తయిందా?

భార్య: పురాణం పూర్తికాగానే యిద్దరం బయలుదేరాం. సీతమ్మగారి సావిత్రితో మాట్లాడుతూ అది వెనకపడ్డది. వస్తూవుండాలి.

యజమాని: పూర్తికాకుండా నువ్వెందుకొస్తావు! సీత! సావిత్రి! అంతా పతివ్రతలు మొలుచుకొచ్చారు! అఘోరించినట్టే వుంది. వంట తొందరగా యేదు. రెండు మెతుకులు నంజి పడుండాలని వుంది. తాళంచెవు లిట్లా తగలెయ్యి.

(భార్య తాళంచెవులు యిస్తుంది. యజమాని యింటతాళం తియ్యటానికి పోబోతుండగా)

మిత్రుడు: నీకోపం సరేగాని, వూళ్ళో అందరిమీదా విరుచుకుంటున్నావేమిటి? కాస్త నిమ్మళం యెవరన్నా వింటే...

యజమాని: వింటే! పోట్లాటకొస్తారంటావు? రానీ! వాళ్ళబతుకులే బయట పడతెయ్యి.

భార్య: పొద్దుట్నుంచీ భోజనం చెయ్యలేదా యేమిటండీ? తమ్ముడూ! నీభోజనం అయిందా? వంట యెంతసేపు, నిమిషం! మీస్నానం అయ్యేటప్పటికి నావంటా అవుతుంది.

[యజమాని తాళంతీసి యింట్లోకి వెడతాడు. భార్య బల్లమీద సంచీ, గొడుగూ తను తీసుకుంటూ వుండగా]

మిత్రుడు: మావాళ్లు పురిటికెళ్ళినప్పటి నుంచి మనది ఏకబాండ ప్రయోగం. వెళ్ళి తినటమే.

భార్య: [లోపలికి వెడుతూ] ఇప్పుడు పోయి ఆ వద్దభోజనం యేం చేస్తావుగాని, మీబావా నువ్వు కలిసి కూర్చుందురుగాని, రా! వెళ్లకు!

[అంతా లోపలికి వెడతారు. తెర దిగి వెంటనే లేస్తుంది. ఇంటి లోపలిభాగం. ఒక టేబులు మూడు కుర్చీలు ఉంటవి. టేబులు దగ్గరలో వున్న కుర్చీమీద మిత్రుడుఒక్కడే కూర్చుని వుంటాడు, టేబులు మీది పుస్తకం తీసి,]

[మిగతా వచ్చేవారం]

కథ; వ్యథ

శ్రీ తీగవరపు రామకృష్ణారావు

"హల్లో!"

"హల్లో! ఎవరూ మాట్లాడుతూంట?

"నేనేనండి భానుమూర్తిగారూ, శశిని"

"హల్లో శశీ! ఊరకరారు మహాత్ములన్నట్లు మీరు యీ రోజు నాతో మాట్లాడటం చాల వింతగావుంది. అందులోనూ ఆఫీసు టైమ్‌లో ప్రక్కింటివారి అమ్మాయి ఫోనులో నాతో మాట్లాడటం మరీ వింతగా వుంది. ఏమిటి విశేషాలు?

"మీకూ యిప్పుడు కాఫీటయిమేగా! యిప్పుడు ఒకవిషయం చెప్పాలి. ఆ విషయం నెమ్మదిమీద చెప్తాను."

"చెబుదురుగాని లెండి శశిగారూ! ఏం విశేషాలు? మా ఆవిడ ఏంచేస్తోంది?"

"మీ ఆవిడగురించే చిన్నమాట చెబుదామని ఫోనుతీశాను. మీ కమల చాల మంచిదండీ, ఏమంటారు?"

"ఆ! మంచిదే, అప్పుడప్పుడు కొద్దిగా వచ్చే తలతిక్క మినహాయిస్తే."

"మంచిమాటన్నారు. మీ ఆవిడనుగురించి నాకు అదే అనిపిస్తూవుంటుంది. ఆవిడ వట్టి అనుమానం మనిషి. మీ రేమీ అనుకోకుండా వుంటే చెబుతాను. మీ ఆవిడ కింకా సొసైటీలో ఎల్లా మసలుకోవాలో తెలియదు."

"నేనేం అనుకుంటాను శశీ! వున్నమాట న్నావు. చూశావ్! కాలం మారిపోతోంది. మన నెహ్రూగారన్నట్లు దిన దినం మారుతూన్న కాలంతో నాగరికతతో మనం కూడ ముందడుగు వేయకపోతే వెనకపడిపోతాం. అప్పుడు మనల్ని వెనక్కి తిరిగి ఎవ్వరూ చూడరు. మా కమలకూ నవనాగరికతకూ చుక్కెదురు. ఆవిడకు యీ పాశ్చాత్య నాగరికతంటే అస్సలు గిట్టదు. వెర్రిమాలోకం! నీలాగ సొసైటీలో సోషల్ గా మసలుకోవటం కమలకు తెలియదు."

"కథకులయినందుకు ఫోనులో కూడ దంచేస్తున్నారు. భేష్! కానీ మీ కమలను ఒకందుకు మెచ్చుకోవాలి. అల్లికపనులూ, కుట్టుపనులూ ఎంత బాగా చేస్తుందో! వంటలోమాత్రం ఏం తీసిపోతుంది? నల భీమ పాకం!! ఈ విషయంలోమాత్రం మీరు నిజంగా అదృష్టవంతులు."

"ఏమిటి శశీ! మా ఆవిడనుగురించి మొదలుపెట్టావ్? చంపక యింకా ఏమన్నా విశేషాలు చెప్పవుంటే."

"బావుంది, బావుంది. నేనసలు ఫోను తీసిందే మీ ఆవిడను గురించి ఒక ముఖ్యవిషయం చెప్పటానికి. మరింక యితరవిశేషాలు చెప్పమంటారే, భలే వారు!

"ఆ ముఖ్యవిషయ మేదో ముందే చెప్పక యీ బంగాళాఖాతమంత ఉపోద్ఘాతంతో మాకు 'నో పెయిన్' ఖర్చు కలిగించటం నీకు భావ్యమా శశీ?"

"అయితే చెప్తాను. చెప్పబోయేది నాందీ ప్రస్తావన. మీరీ రోజు ఆఫీసుకు వెళ్ళిన తర్వాత ఊసుపోక మీయింటికి వెళ్లాను."

"ఏవన్నా మాగజైనులు తీసుకు పోదామనో లేక మా ఆవిడతో కాలక్షేపానికో వెళ్లివుంటావు అంతేనా?

"నిజమే ననుకోండి. కానీ నేవెళ్లేసరికి మీయిల్లు తాళం వేసివుంది."

"ఏమి టేమిటి? కమల ఏమయింది?"

"నేను మొదట ఆశ్చర్యపోయాను. గుమ్మందగ్గరకువెళ్ళి చూతునుగదా తాళం చెవి కిందబడివుంది. బజారు పనిమీద వెళ్ళి వుంటుందేమో అనుకున్నాను. ఇంత అజాగ్రత్తగా తాళంచెవి పడవేసి పోయిందేమా అనుకొని, మేగజైను లేమయినా తీసుకొందామని (ప్రక్కింటివాళ్లం, మనకీ మనకీ మర్యాదే మేమిట నే వుద్దేశ్యంతో) తాళంతీసి లోపలకు వెళ్లాను"

"ఏమయింది తర్వాత?"

"ఏముంది, లోపలకు వెళ్లి చూసేసరికి నాగుండె ఆగిపోయింది!"

"త్వరగా చెప్పరూ. ఎందుకాగిపోయిందో! యిదేమన్నా డిటెక్టివ్ కథా, యింత సస్పెన్సు......?"

"అంత తొందరయితే ఎలాగ? అతి ఆనందకర విషయాలు, అతి దుఃఖకర విషయాలు హఠాత్తుగా చెప్పకూడదంటారు. ఇంట్లోకి వెళ్ళేసరికి ఏగదిలో చూసినా బట్టలు చిందరవందరగా విసిరి పారేసి వున్నాయి. డ్రాయర్లు, కుర్చీలు తలక్రిందులుగా పడిపోయి వున్నాయి. ఏం చెప్పను? గదులన్నీ భీభత్సంగా వున్నాయి."

"ఆ! ఆ!!"

"ఈరోజు భానుమూర్తి గారింట్లో ప్రణయ కలహమో, లేక ప్రళయ కలహమో అనుకుంటూ మీ డ్రాయింగ్ రూములోకి వెళ్లాను. అక్కడ మీ డ్రాయరుమీద ఒక ఉత్తరం వున్నది"

"ఏమిటీ! లెటరే?"

"ఆ! ఆ లెటరు యిప్పుడు నాదగ్గరే వున్నది. తుచ తప్పకుండ వున్నదున్నట్లు చదువుతాను వినండి. 'ప్రియమైన భర్తగార్కి...' వింటున్నారా భానుమూర్తి గారూ?"

"ఆ! ఆ! చదువు"

"వినండి! 'పతియే ప్రత్యక్ష దైవమంటే పూర్తిగా కాకపోయినా కొద్దిగానన్నా నమ్మేవాళ్లలో నేనొకతెను. స్త్రీ ఎంత కఠినమైన శిక్షనైనా భరించగలుగుగాని తన భర్త మరొకవనితను ప్రేమించుతున్నాడంటే ఏమాత్రం సహించదు. చాల రోజుల నుంచి చూస్తున్నాను మీ ప్రవర్తన. నాతో చనవుగా ఎప్పుడు మాట్లాడారు? కమలా సినీమాకు పోదాం రా అని నోరార ఎప్పుడైన పిలిచారా? నగలు లేకపోయినా బాధపడను. చీర లేకపోయినా చింతించను. కానీ మీరు మనసు విప్పి నాతో మాట్లాడకపోతే ఎలా సహిస్తాను? మీ ప్రవర్తన యింతగా మారటానికి కారణం యీ రోజు పొద్దున్న తెలిసిపోయింది. ఇంతకాలం మీరాడుతున్న నాటకం బయలుపడిపోయింది. మీ ప్రియమైన, హృదయ రాణియైన 'చంచలకు' మీరు వ్రాసిన ప్రేమలేఖ బయటపడింది...సరేగానీ యీ 'చంచల' ఎవరండోయ్? అగ్నిసాక్షిగా పెళ్లాడిన భార్య వుండగా..."

"హరిహరీ! కొంప మునిగింది శశీ! కొంప మునిగింది. ప్రేయసి లేదు గీయసి లేదు. చంచల నా కథలలో ఒక పాత్ర. ఈ మధ్య ఉత్తరాల కథలు పడ్డాయి పత్రికలలో చూశావ్? ఆ మోడల్‌లో ఒక చిన్న కథానిక వ్రాద్దామని 'యీ రోజు' వుదయం మొదలుపెట్టాను: వచ్చిన యిబ్బంది ఏమిటంటే, మరొకటెందుకని నా పేరే హీరోకు తగిలించాను. దాంతో వచ్చిపడింది చిక్కు. వట్టి అనుమానం మనిషని ముందే చెప్పాగదూ! కథలో వుత్తరం చూసి నిజమైన ప్రేమలేఖగా భ్రమించింది కమల. నీకు తెలియదూ శశీ! నా మనస్తత్వం? కొంపదీసి ఆ వుత్తరం చదివి ఏ అఘాయిత్యమన్నా చేసుకోలేదుగదా? మిగిలింది చదువు..."

"చదువుతున్నా వినండి...'ఆ చంచలకూ

(48-వ పేజీ చూడండి)



పుష్పమువలె...
రెక్సోనాతో మీ చర్మ
సౌందర్యము వికసించును
రెక్సోనా సబ్బులో, కేడిల్...చర్మమును పోషించునటువంటియు మీ సహజ సౌందర్యమును బయల్పరచుటకు సహకరించునటువంటియు ఒక ప్రత్యేక నూనెల మిశ్రమము గలదు!
Rexona
BLENDED WITH CADYL
ఇది ఒక్కటే కేడిల్‌తోగూడిన సబ్బు
రెక్సోనా ప్రొప్రయిటరీ లిమిటెడ్ తరపున భారతదేశంలో తయారుచేయబడినది
RP. 148-X52 TL

వనితా లోకం

ఆడబిడ్డలు

వసని నిర్మలప్రభావతి

"మా పెద్ద ఆడుబిడ్డ, మూడో ఆడు బిడ్డ మా అత్తగారితో ఫర్వాలేదు గానీ, మా రెండో ఆడబిడ్డ ధాటికి చస్తున్నాననుకో"

పై వాక్యాలు, ఈ మధ్య నే పెళ్ళయి కొత్తగా కాపురానికెళ్లిన నా డియరెస్ట్ ఫ్రెండ్ రాసిన జాబులోవి.

మన దేశంలో పెళ్లయింతర్వాత అత్తగారింట్లకెళ్లే పెళ్ళికూతుళ్ళందరికీ వాళ్ళ తల్లిదండ్రులు చెప్పే నీతుల్లో

"అత్త ఏమన్నాను ఎదురాడబోకు
మామ ఏమన్నాను మారాడబోకు"

అని చెప్తారు. కాని ఈమధ్య ఈ ఆడబిడ్డల ధాటి ఓ పెద్ద సమస్య అయిపోయింది. అయితే అత్తగార్లు మాత్రం సామాన్యులా? ఆడబిడ్డ లుండటం తప్పా? అంటారేమో! అత్తా కోడళ్ళ సమస్య మనం తెంచినా తెగేది గాదు, ముడిపెట్టినా ముడిపడేది కాదు. అలాటప్పుడు అలాటి సమస్యల్ని పొత్తిగా వదిలెయ్యటం మంచిది. ఇక పోతే ఆడబిడ్డలు (ముఖ్యంగా పెళ్ళి కానివారు) ఉండక ఎక్కడికి పోతారు? ఉండాలి. కాని వాళ్ళ హద్దుల్లో వాళ్ళుండాలి.

కోడలొచ్చింతర్వాత ఎంత మంచి అత్తగారికైనా కాస్తో కూస్తో ఆ కోడలి మీద అధికారం వస్తుంది. అల్లాగే ఆడబిడ్డలకి కూడా.

వదినెమీద (లేక) మరదలిమీద అధికారం చలాయించాలనే దృక్పథం సాధ్యమయినంత వరకు మార్చుకోవాలి. అలా అధికారం చలాయించే ముందు తామూ ఓ యింటి కోడళ్ళ మనీ, కనీసం కాబోతామనే సంగతి బాగా మనస్సులోకి రానిచ్చుకోవాలి. కొందరికి అన్న పెళ్ళప్పట్నుంచే రాబొయ్యే వదినమీద అధికారం చెలాయించాలని వుంటుంది. అలాటి వాళ్ళు ఏదో ఓ సాకుతో పెళ్ళిలో అలక సాగించటం, విడిదింటి నుంచి పెళ్ళికూతురికి ఆచీరకట్టాలి, ఫలాని సొమ్ములు పెట్టాలి అని వుత్తర్వులు జారీ చెయ్యటం కూడా వుంది. ఇది ఏదో తమాషాగా కల్పించి రాస్తున్నాననుకోకండి. వాకళ్ళతో నేను చూచాను అలాటి వారిని. కాస్త ఆత్మాభిమానం కల వదినలైతే వెంటనే పంతానికైనా విరుద్ధంగా నడుస్తారు. కాస్త భయపడే నైజం వాళ్ళయితే వాళ్ళ గతి అధోగతే!

మన అన్నయ్యను పెళ్ళి చేసుకు శాశ్వతంగా అతని కష్టసుఖాల్లో భాగం పంచుకుంటూ తన వారినందరినీ విడిచి పెట్టే మన ఇంటి కొచ్చిన వదినపట్ల మనం ఎలా ప్రవర్తించాలి? సాధ్యమయినంతవరకు ఆమెను మన ఇంట్లో మనిషిలా, కలిసి మెలసి పోతూ ఏదైనా కాస్త అభిప్రాయ భేదాలున్నా సర్దుకుపొయ్యేలా వుండాలి. అంతే గాని ఏదో మనింట్లో చాకిరి చెయ్యటానికి, మన దెప్పులు పడ్డానికి ఒచ్చిందనుకోడం ఎంత బుద్ధి తక్కువ చెప్పండి. అసలిలాటి సంఘటనలు ఒకటి రెండు విన్న వాళ్ళందరికీ ముఖ్యంగా (వదినె, మరదళ్లకు) ఒకరి మీద ఒకరికి అర్థం కాని ద్వేషం వుంటుంది. వాళ్లు మాట్లాడుకునే ప్రతి మాటా బాణంలా వుంటుంది కాని మాటలావుండదు.

వదినె అన్న తర్వాత ఆ ఇంట్లోని బాగోగులూ, బాధ్యతలూ చాలావరకు ఆమెమీదే వుంటాయిగదా! అలాటప్పుడు చిన్న పిల్లలుగా వుండే, మరదుల్ని గానీ, ఆడబడ్డల్ని గాని ఎప్పుడైనా కాస్త కసిరినా ఫర్వాలేదు. అంత మాత్రానికే ఆవిడ వాళ్ళను అష్టకష్టాలు పెట్టిందనే ప్రచారం చెయ్యొచ్చా? ఇందులో పెద్దవాళ్ళ బాధ్యత (ముఖ్యంగా అత్తమామలకు) పూర్తిగావుంది. సాధ్యమైనంతవరకు చిన్న పిల్లలు చెప్పిందాన్లో నిజానిజాలు విచారించి సహృదయంతో ఆలోచిస్తే ఏ చిక్కూ వుండదు. కొందరు పిల్లలకు వదినె అనంగానే ఎందుకనో ఏవో లేనిపోని చాడీలు చెప్పాలనిపిస్తుంది. దానిక్కారణం వారు పెరిగే వాతావరణం ప్రభావం చాలా వుంటుంది. పూరికే నే అర్థంలేని రిపోర్టులు పెద్దవాళ్ళకు చేరేస్తుంటారు. నాకో సంగతి జ్ఞాపకం వస్తోంది. మా పిన్ని కూతురో అమ్మాయి, నా ఈడుదే అత్తారింటికెళ్ళింది. ఆవిడకు ఇద్దరాడబిడ్డలు చిన్న పిల్లలు (10, 12) పెళ్ళివాళ్లున్నారు. ఓసారెప్పుడో ఆవిడ అత్తగారు మామగారూ వాళ్లూ ఇంకో వూరు వెళ్లాల్సి, ఆ పిల్లలిద్దర్నీ ఈ విడకు అప్పచెప్పి మరీ వెళ్లారుట. మా పిన్ని కూతురు అసలే భయస్థురాలు. పొరబాటునైనా, ఏదైనా పని పిల్లలకి చెప్తే ఏమనుకుంటారోనని, ఏ పనీ చెప్పకుండా ఎంతో జాగ్రత్తగా చూచుకుందిట వాళ్ళిద్దర్నీ... తీరా వారం రోజులకు అత్త, మామలు వచ్చింతర్వాత ఆ పిల్లలిద్దరూ, కూడబలుక్కుని, "వదినె మాకు పెట్టకుండా ఏ మేమిట్లో తిన్నద"ని చెప్పారుట. ఆ పెద్దవాళ్ళిద్దరూ మాంచి పూర్వకాలం మనుషులు కావటంవల్ల ఆ మాటలు ఘట్టిగా ముడేసుకున్నారట. అయినా పైకి పెద్దగా ఏవీ తిట్టకుండా, చిన్న చిన్నగా మాటలంటూ ప్రతి విషయంలో ఈ విడమీద చెకింగ్ మొదలెట్టారట. ఎలా వుంది? అదే కాస్త తెలివిగలవాళ్ళయితే ఆ దొంగబుద్ధి తామున్నప్పుడు మాత్రం ఎక్కడికి పోతుందని ఆలోచించుకుని, పిల్లల్ని మందలించుకోరూ! అలాటి పిల్లల్ని చూచి ద్వేషించుకునేకన్నా ఆ పరిస్థితులూ, వాతావరణం, పెద్దవాళ్ళ, పెంపకం అలా చేస్తున్నాయని గ్రహించుకు మాట్లాడకుండా వూరుకుంటే, అంతకన్నా మంచిపని ఇంకోటి లేదు.

బట్టలదగ్గర్నుంచీ

ఆడబిడ్డల్లో కేవలం చదువురానివారూ అనాగరికులూ అలా చేస్తారని లేదు, చదువుకుని, బాగా జ్ఞానం తెలిసిన వాళ్లకే వుంటాగు తలకాయ. అలాటివాళ్లు వాళ్ళ వదినెలు ఎలాటి బట్టలు కట్టుకోవాలో కూడా నిర్ణయం చేస్తుంటారు. కాస్త నోరున్న వదినె అయితే వాళ్ళకు భయపడదు కాని, ఆ మాట ధాటిలేని

మలారపు ఉండలు

ఉలవలు 4 శేర్లు, బియ్యము 1 శేరు, పంచదార 5 సవాశేర్లు దీనికి కావాలి.

బియ్యం శుభ్రంగా బాగుచేసి కడిగి బుట్టలో వడేసి వుంచుకోవాలి. కళాయిపాత్రలో నీళ్ళుపోసి పొయ్యిమీద పెట్టి కళ పెళ బాగా కాగినతర్వాత వడేసిన బియ్యం ఎసట్లోపోసి నాలుమూలలా కలియబెట్టి వెంటనే దించి మూత వేసి 1 రోజంతావుంచి, రెండోంపేలు బాగా ఎండనిచ్చి మెత్తగా విసరాలి. ఉలవలు దోరగా వేయించి పప్పుగావిసిరి, దంచి చెరిగి పొట్టు తీసివేసి పప్పును మెత్తగా విసరాలి. బియ్యపుపిండి, వులవపిండి రెండు కలిపి బూంది దూయాలి. పంచదార నలకలులేకుండా చూసుకొని లడ్లపాకం రానిచ్చి, బూందిపోసి కలిపి చల్లారేక వుండలు చుట్టుకోవాలి, ఇవి పెద్దవుండలుచుట్టి, ఆడపిల్లలు అత్తవారి ఇళ్ళకు వెళ్ళేటప్పుడుగాని, పసుపు, కుంకుమ ఇచ్చేటప్పుడుగాని పంచిపెట్టితే బాగుంటుంది, కొత్తమాదిరి లడ్లు.

మైసూరు లడ్లు

ఇవి పిల్లలకు ముద్దకుడుముల వేడుకలో చలిమిడి బదులు పంచిపెట్టుతారు.

ఒకవీశె పంచదార, నాలుగు కొబ్బరికాయలు, ఒకసోల నెయ్యి, అరసోల శెనగపిండి కావాలి.

పంచదారతీగ పాకం రానిచ్చి అంతకుముందే కోరివుంచుకొన్న కొబ్బరికోరు వేసి కలపాలి. పాకం నీళ్లుగామారి తిరిగి యధారీతిగా రాగానే కరిగించిన నేతిలో శెనగపిండివేసి వుండలులేకుండా కలిపి, దాన్ని పాకంగిన్నెలో వేసి చక్కగా నాలుగుమూలలా కలుపుతు ఉడకనివ్వాలి. సమపాళంగా ఉడికినాక దించి వెడల్పాటి పళ్ళెంలోపోసి చల్లారనిచ్చి కావలసిన సైజులో ఉండలుచుట్టి తడిచెయ్యి తగులకుండా దాచుకుంటే, నిలవఉంటాయి. చూడటానికి, తినటానికికూడా చాలా బాగుంటాయి.

వడ్లమన్నాటి సామ్రాజ్యలక్ష్మి,
(విజయవాడ.)

ఆడబిడ్డలు

వాళ్ళకే అవస్థ. ఆ బట్టలూ, నగలూ, తమకిష్టం లేక కట్టుకోరనుకుందాం, అప్పట్నుంచీ మూతి ముడుపులూ, సాధింపులూ ప్రారంభమౌతాయ్. తమకు వచ్చినవే అవతలవాళ్లకు వచ్చాలనే న్యాహాలు అతి తెలివివాళ్లకు తప్ప సామాన్యంగా మామూలువాళ్ళకు పుట్టవు.

కాలు, నోరు నిలవని వారుంటారు. కొందరు వీళ్లకు పనిలేకపోయినా ఎక్కడికో ఓ చోటికి వెళ్లాలనీ, పొద్దస్తమానూ తిరగాలనీ—ఏదో ఒకటి వాగుతుండాలనీ వుంటుంది. వాళ్లింటికొచ్చిన వదినెకు అలాటి "మాంఛి" అలవాట్లు లేకపోతే ఇక వాళ్లకు అంతకంటే దుఃఖం వేరే వుండదు. తమతోపాటు తిరక్కపోతే సాధిస్తారు. అలవాటు లేకపోయినా అందరితో వూరంతా తిరగాలని ఆ వచ్చినవాళ్లకేమైనా నిబంధనలు వున్నాయా? అలా అనుకుని ఆ చెడతిరగడం, చెడతిటడం, అవతలివాళ్లను చూసైనా మార్చుకుంటే ఎంత బావుంటుంది!

పెళ్లయి, అత్తగారిళ్ళకు వెళ్ళిన ఆడబిడ్డల్లో అంత తంటాలేదు. ఎటొచ్చీ వారు ఎప్పుడో వస్తారు, నాలుగురోజులుంటారు వెళ్తుంటారు కాని వచ్చే చిక్కంతా పెళ్ళికానివాళ్ళతోనే అలా అని వాళ్లెక్కడికి పోవాలంటారేమో... మనస్సులూ, పద్ధతులూ మార్చుకోవాలిగాని మనుషు లెక్కడికిపోతే మాత్రం ఏం చెప్పండి!

ఆఖరుసారిగా నేకోరేదేమిటంటే ఆడబిడ్డలుగా వుండే ప్రతి ఒక్కరూ పైచెప్పిన దుర్గుణా లేవైనావుంటే, భుజాలు తడుముకునే కన్న సాధ్యమైనంతవరకు మార్చుకుంటే బావుంటుంది. అవతలివాళ్లకూ బాధవుండదు. ఒక వేళ వీళ్లు మంచివాళ్లయి, అవతలివాళ్లే కాస్త కటిపెటి రకంగా వుంటారనుకోండి—అలా అయినా కొన్నాళ్లకి మన అలవాట్ల ప్రభావం వాళ్లమీద చాలావరకు పడ్తుంది. ఇంతకూ ఇద్దరూ సన్నిహితులేగదా! ఈ వ్యాసం ఓపికతో చదివైనా అలాటివాళ్లు ఆడబిడ్డలు—వదినెలు, మనస్సులు మార్చుకుంటే ఎంతో బావుంటుంది. లేనివాళ్లి సంగతంటారా..."...

మంచాలు వాని పరిశుభ్రత

మన ఇండలో ప్రతి కొయ్య సామానుకు నల్లులు పట్టుతూ వుంటాయి. అందులో మంచాలకి చాలా ఎక్కువగా ఉంటాయి. కారణం మన శరీరంలోని రక్తం పీల్చడానికి మంచాల్లో వుంటేనే వీలు ఎక్కువ. రాత్రులందు నిద్రాభంగం అవుతుంది. రక్తం క్షీణించుతుంది. ఫలితం ఆరోగ్యం చెడటం.

నల్లులు వేసవి నాలుగు నెలలు మాత్రం ఉండవు. మిగతా ఎనిమిది మాసాలు చాలా ఎక్కువగా ఉంటాయి. వీటిని పోగొట్టుటకు అనేక ప్రయత్నాలు చేస్తూ వుంటారు. సలసలకాగే వేడినీరుపోయటం, డి. డి. టి. పౌడరు చల్లడం, నవారు వుతకడం, చీటికి మాటికి మంచాలు ఎండలో వెయ్యడం జరుగుతూవుంటుంది. ఈ ప్రయత్నాలన్నీ తాత్కాలికమైనవియే.

నల్లులు కనీసం రెండుమూడు సంవత్సరాలు కనపడకుండా వుండాలంటే కొయ్య సామానులకు వార్నీషు వెయ్యాలి. అపుడు మన సామాను ఇంట్లోంచి వీధిలోకి, వీధిలో నుండి ఇంట్లోకి వేసి విరగగొట్టవలసిన అవసరం ఉండదు. మిగతా వస్తువుల సంగతి ఎట్లావున్నా నవారు మంచాలకి, నవారు విప్పేసి, మంచానికున్న పగుళ్ళు, జాయింటులతోసహా మంచమంతా కలిసేటట్లు బ్రష్‌తోకాని, గుడ్డపీలికలతోకాని వార్నీషు వేయవచ్చు. ఈ కాలం రాస్తే 4 లేక 5 గంటలలో అది ఆరిపోతుంది. ఒకరూపాయి ఖరీదుగల వార్నీషు నాలుగు మంచాలకి సరిపోతుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ శ్రమ లేకుండా మంచాలు బాగుపడుతాయి. చూచుటకు అందంగాకూడా ఉంటాయి. నల్లులు మంచాలనుంచి గోడలకు కూడా ఎక్కుతూవుంటాయి.

ఈమధ్య ఒక ఇంట్లో చూచాను, మంచం ఎండలోవేసి నల్లులు చంపడం చేతకాక, చీపురుతో దులపటం. అంటే అంత ఎక్కువగా ఉన్నాయన్నమాట. నవారు సందుల్లో నుండి, కోళ్ళసందుల్లోనుండి నల్లులు పైకి రావటం, దులపటం, తిరిగి అవి అన్నీ

(48-వ పేజీ చూడండి)

పరులు చెప్పిననైన, నిజేచ్ఛనైన ఏమిచ్చిననైన, కానలకు నేగిననైన..." అనే పద్యం చెప్పుకుందాం మనస్సులో... ★

పొంగిన మనసు

అత్తవారింట్లో అడుగుపెట్టగానే కృష్ణమూర్తిలో గర్వం ప్రవేశించింది. అంతకుముందు చేసుకొన్న తీర్మానాలు-లల్లీ పారిపోతూంటే జడ పట్టుకు లాగడం, ప్రకాశిగాడు ఇదివరకు లాగనే 'నులక మంచం వేశారూ' అనే సరికి బిస్కట్ల ప్లాట్లాం చేతిలో పెట్టడం-అవన్నీ అసలు జరపడానికి నామోషీ అనిపించింది. ప్రకాశిగాడే వచ్చి 'ఏమైనా ఇవ్వవూ' అనాలి. లల్లీ తనెంతసేపూ పలకరించక పోవడం చూసి వయ్యారం మొలికిస్తూ 'ఈ కాఫీ తీసుకోండి' అనాలి. అప్పుడు......

పైని బంతి ఆడుతున్న ప్రకాశం బావని చూశాడు. పలకరించడం కంటె ముఖ్యంగా అక్కయ్యతో 'నీ మొగుడొచ్చాడులే' అని ఉడికిస్తూ చెప్పడం అవసరంగా తోచి లోపలికి తుర్రుమన్నాడు.

అత్తగారు "వచ్చావా నాయనా" అని పలకరిస్తూనే-"ఒరే ప్రకాశం బావ కాళ్ళు కడుక్కోవాలి, నీళ్లు తెమ్మని అక్కయ్యతో చెప్పు"అని కేక వేసింది. ప్రకాశమే చెంబుతో నీళ్ళు తెచ్చాడు. అత్తగారు నవ్వుతూ "నువ్వు తెచ్చావేంరా" అన్నది.

"మరి అక్కయ్యేమో జడవేసుకుంటున్నానని చెప్పమంది" అన్నాడు. ఫక్కున నవ్వేశాడు కృష్ణమూర్తి. అత్తగారు కాఫీ తెస్తానంటూ నిష్క్రమించింది. కృష్ణమూర్తి బావమరిదిని దగ్గరకు లాక్కొని

"ఏంరా నిజంగా మీ అక్కయ్యేం చేస్తోందో చెప్పవూ" అన్నాడు.

"నేను చెప్పను" అన్నాడు ప్రకాశం "ఏమీ" ప్రశ్నించాడు బావ.

"చెవి నులిమేస్తానన్నది" అన్నాడు కదులున్న తెరవైపు చూస్తూ.

కృష్ణమూర్తి సంచిలోంచి పాకెట్ తీశాడు. ప్రకాశం చెయ్యిచాపాడు.

"మరి చెప్తానంటే" అన్నాడుబావ.

"కాఫీ కలుపుతోంది. నీకు పట్టావడానికి."-పాకెట్ అంకించుకొని మిత్రుల మధ్య 'గొప్ప' కోసం పరుగెత్తాడు ప్రకాశం.

కృష్ణమూర్తి నిలువుటద్దంముందునిల్చున్నాడు. ద్వారంలో తెరతొలగించుకొని శ్రీమతి ప్రవేశిస్తోందని అద్దంలో అర్థం చేసుకున్నాడు. అద్దం దగ్గరకొచ్చి తన వెనక నిలబడేవరకూ వెనక్కి తిరగదల్చుకోలేదు. లల్లీ కాఫీ కప్పు టేబిల్ మీద వుంచింది. నిలబడి ఇటు చూసింది. కృష్ణమూర్తి ఇటు తిరక్కముందే మెల్లగా వెనక్కు నడిచింది. గిరుక్కున కృష్ణమూర్తి వెనక్కు వచ్చాడు. లల్లీజడ అందీ అందడంలో జారిపోయింది. పారిపోతూ "నన్ను పట్టుకోలేకపోయావ్" అన్నట్టు తిరిగి చూసింది.

"ఇలాగా" అన్నాడు హీరో. "ఉహూ! ఇప్పుడు కాదు" అంతే! కృష్ణమూర్తికి కాఫీ సహించలేదు.

బంతి చేతిలో పట్టుకొని వచ్చిన ప్రకాశిగాడితో కబుర్లు చెప్పడానికి

కన్నసామి

దిగాడు. ప్రకాశం చెవిలో ఏదో చెప్పిలోపలికి పంపించాడు. అయిదు నిమిషాల్లోతిరిగి వచ్చాడు ప్రకాశం. "ఏమిటన్నది" అన్నాడు బావ. "నిన్ను మాట్లాడకుండా ఊరుకోమన్నది. ఇప్పుడు రాదుట. మరి..."ఏదో చెవిలో చెప్పాడు. కృష్ణమూర్తి ఉస్సురన్నాడు. అత్తగారు స్నానానికి లెమ్మన్నది. పెరట్లోకి స్నానానికి వెళ్తూండగా అక్కడ తడిక పక్కచలనం కనిపించింది. "ఇక్కడ సబ్బూ తువ్వాలూ ఉన్నాయి. పట్టికెళ్లి ఇవ్వరాతమ్ముడూ" అర్ధాంగి అమృత వాక్కులు వినిపించాయి. అటూయిటూ చూసి కృష్ణమూర్తి-"సబ్బు తెచ్చిస్తే అరిగిపోదు లేవోయ్. ఇలాతెమ్మను" అన్నాడు. తడిక పక్కనుంచీ కిలకిలానవ్వు వినిపించింది. "సబ్బు ఇస్తే అరిగిపోదూ. కరుకోడం మానేస్తారా" అంటూ లల్లీ మరింత పకపకా నవ్వింది.

ప్రకాశం సబ్బుతెచ్చాడు. కృష్ణమూర్తి బాల్చీలో సబ్బునీళ్లు తడకవైపు విసిరి "పెంకీ ఎక్కడికి పోతావులే" అన్నాడు.

"ఆ ఆ! ఆనీళ్లు మడిపై బడతాయి నాయనా" అత్తగారటు వస్తూ అన్నది.

"హరి హరీ!" అంటూ బాదడు నీళ్ళు తలపైని బోర్లించుకున్నాడు హీరో.

ఎన్నిసార్లు కబురుపంపినా 'ఇప్పుడు కాదు' అనడం, భోజనాల సమయంలో నెయ్యి వెయ్యడానికైనా లల్లీరాక పోవడం, కృష్ణమూర్తికి చాలకోపం తెచ్చింది. భోజనాలయాక సమష్టిగానే పక్కలాకులు అందాయి. అర్ధాంగీకారంగానే అర్ధాంగిమీద కోపంచేత గబగబ నమిలి మింగేశాడు.

తనకై 'మామూలు'గా ప్రత్యేకించిన పడకగదిలో అందెలసవ్వడి అవుతున్నది. లాంతరు వెలుగుతూంది. గాజుల గలగల, చీర గరగర కొంచెంగా వినిపిస్తున్నాయి. అత్తగారూ, మామగారూ ఇంగితజ్ఞత లేకుండా తనతో మాట్లాడేస్తున్నారు. ఏదో పనిమీద అత్తగారవతలికి వెళ్లింది కాని మామగారు మాత్రం-"పూర్వకాలంలో ఉండే గొప్పదనం గురించి, ఈ కాలంలో జరిగే ఘాతుకాలగురించీ మాట్లాడేస్తున్నారు. అత్తగారు ఏమీ మాట్లాడకుండా మళ్లావచ్చి కూర్చుంది. కృష్ణమూర్తి "హయ్యో" అనుకొని పెద్ద ఆవులింతని ప్రకటించాడు.

నిమిషాలు మెల్లగా నడుస్తున్నాయి. "నాయనా! నీకు నిద్రవస్తే అదుగో ఆ పక్కమీద పడుకో" అన్నది అత్తగారు. కృష్ణమూర్తికి అర్థం కాలేదు.

"ఇదిగో ఇప్పుడేవస్తాను. లలితకి పక్కబట్టలు పడేయ్యాలి" అంటూ అత్తగారవతలికి వెళ్ళింది. కృష్ణమూర్తి గిరగిర వీధిలోకి ఇంట్లోకి చిరాగ్గా నడిచేశాడు. వీధిగదిలో చిన్నశబ్దం విని ఆగి దగ్గరకు వెళ్లాడు. కన్నీరాపుకోలేనిస్థితిలో లలితయేడుస్తూంది. తెల్లని వాయిల్ చీరమీద నల్లని కాటుక కళ్లనీరు పడుతోంది. లలిత జడలో తన కిష్టమైన మల్లెపూవులు అన్నీ తలలు వంచుకున్నాయి. కృష్ణమూర్తి నిట్టూర్చాడు. రెండునిమిషాలు ఆలోచించుకొని నవ్వుకున్నాడు. ★

పాప సంసారం

పసిపిల్లల ఆటలు, వాళ్లుచేసే చేష్టలు, మాటలు ఎంతో ముద్దుగా ఉంటాయి. వాళ్ళకోరికలు విచిత్రముగా ఉంటాయి. తాము పెద్దవాళ్లై పిల్లలమీద అధికారం వహించాలని ప్రయత్నిస్తుంటారు. తామే అమ్మ, నాన్న అయిపోయినట్లుగా భావించి పిల్లల్ని సంరక్షిస్తున్నట్లు బొమ్మలతో ఆడుకుంటారు. వాళ్ళుచేసే ప్రతిపనీ పెద్దలను అనుకరించి చేస్తారు.

ఒకరోజు నేను పత్రిక చదువుతూ హాల్లో కూర్చున్నాను. "కమలా! అన్నము చల్లారి పోతోంది. వేగంతిను. పప్పు కలుపుకో నెయ్యి వేస్తాను. అన్నము క్రింద వెయ్యకు. తప్పుగదూ?"

హాల్లో ఎవరికి నాప్మ అన్నముపెడ్తోంది? అని ఆశ్చర్యముతో అవైపు చూచాను. మా అక్కయ్య కూతురు నాలుగేళ్లపాప, ఆడుకుంటోంది. ఇందుకేనా! ప్రొద్దుటి నుంచి అమ్మని చీరకట్టమని పోరుపెట్టింది! మేమే చీరకట్టకోలేక అవస్థపడుతుంటే, పెట్టెడున్నావో లేదో, అప్పుడే నీకు చీర లేమిటే' అని అక్కయ్య గసిరికొట్టింది. అది ఏడుపు లంకించుకుంది. నేను గబగబా ఒకపాతచీర తెచ్చి, మధ్యకి మడిచికట్టగానే సంబరముతో ఎగిరి గంతేసింది.

ఒకమూలకి రెండు చెక్కలుపెట్టి ఒకగది లాగా చేసింది. పొయ్యి, పొయ్యిలోకి పుల్లలు, గిన్నెలు సమస్తము ఎప్పుడు సిద్ధ పరచిందో గమనించలేక పోయాను. 'కమల' అంటే పాపకూతురులా వుంది. కమలకి వడ్డించి తను భోంచేస్తోంది. ఇంతలో ఉయ్యాల్లో పాపాయి లేచింది కాబోలు,

'కమలా! నీవు విమలదగ్గరకెళ్లి ఆడించు నేను కంచాలు కడిగివస్తాను.'

"విమలని అలా కొట్టేస్తున్నావేమే? ముద్దుపిల్ల. నా చిన్ని పాపాయి, ఏడవ కమ్మ ఏడవకు, ఏడిస్తే బూచివాడు తీసుకెళ్తాడు. నీకు బొమ్మలు, బిస్కత్తులు కొనిస్తాగా. ఏయ్! కమలా!! ఇదిగో పుస్తకాలు, పలక తీసుకుని బడికివెళ్లు. నీకు పైసకావాలా? ఏడిస్తేకాని ఇవ్వను వెళ్లు"

'నీకు ఆకలేస్తోందా పాపాయి. ఇంకా పాలుతాగమ్మ మనింటికి చుట్టాలు వస్తారు. మనము సినిమా చూస్తాము. బొమ్మలు కొంటాము ఏం!'

'ఏమండి! బాగున్నారా? రండి, ఈ చాపమీద కూర్చోండి.'

'నాకు యిద్దరుపిల్లలు, కమల, విమల కమల నాలుగవ కలాసు చదువుతోంది. బడికి వెళ్లింది... ఇది మా అవ్వ నెలకి అయిదురూపాయి లిస్తాము' అని వచ్చిన బంధువులతో చెప్తోంది తిప్పుకుంటూ.

ఆ అవ్వకి ఒక మాసిన చీర, పెద్ద కొప్పు వేసి అచ్చం పనిమనిషిలాగ చేసింది. మా పాపకి ఇంత తెలివి, ఇన్ని ఆలోచనలు, వాటిని ఆచరణలో పెట్టగల శక్తి ఉందని నేనెప్పుడూ ఊహించలేదు.

కుర్చీ చేతికి ఒక గుడ్డను ఉయ్యాల్లాకట్టి దానిలో చిన్న బొమ్మను పరుండబెట్టి ఊపుతూ, వచ్చిన చుట్టాలతో మాట్లాడుతూంటే ఈ సంసార లక్షణములు ఎట్లా అబ్బాయాయని నేను ఆశ్చర్యపోయాను. నేను పుస్తకము చదువుతున్నట్లే నటిస్తూ దాన్ని పరిశీలించటము అది గమనించ లేదు. అదీ గాక, పాప సంసారం గొడవలోపడి హాల్లో ఒక మనిషి ఉన్నదన్న సంగతి మర్చి పోయింది. లేకపోతే దాని చి సంసారం చూడలేక పోదునేమో?

సినిమా చూడ్డానికి వెళ్తున్న అమ్మతో, తనూ సినిమాకి వస్తానని మారాం చేస్తుంది "కాబోలు కమలని సముదాయిస్తోంది" అమ్మ.

"ఛా! నేను సినిమాకి వెళ్లటం లేదు. నాకు జ్వరము వచ్చిందని డాక్టరు దగ్గర కెళుతున్నాను. నీవు డాక్టరు దగ్గరికి వస్తే సూది గుచ్చుతారు తెలుసా? మంచి దానివి గదూ? ఇందా ఈ కాణీ తీసుకు పప్పులు కొనుక్కో. మాకమల చాలా మంచిది...


పాప బుజ్జగించే ధోరణి చూచి నవ్వాపు కోలేక పోయాను. ఎవరో చంప చరచినట్లయ్యింది. పెద్దలుచేసే మోసము, పసిపిల్లలు పసిగట్టి, బుద్ధి చెప్పే ధోరణిలో నటిస్తూ ఉంటే నా మనస్సు చివుక్కుమంది.

నేను, అక్కయ్య సినిమాకి వెళ్తూ, డాక్టరు దగ్గరకి అని వంకపెట్టి దాన్ని ఇంట్లో వదిలేసి వెళ్లేవాళ్లము. డాక్టరు పేరుచెప్తే మాపాపకి భలే భయం. ఒకసారి పాపకి జ్వరంవచ్చి, బాగా తల్లడిల్లిపోతుంటే డాక్టరు దగ్గరికి తీసుకెళ్లి ఇంజక్షన్ చేయించాము. ఆవంక చెప్తే చచ్చినా రానంది. దాని చిన్ని బుర్ర మేము చేసే మోసం గ్రహించి ఎదురుగా నటించి చూపుతూవుంటే ఎగతాళి చేసినట్లు బాధపడ్డాను. ఒక్కసారి పాపని తనివితీరా కౌగలించుకుని క్షమాపణ వేడాలనుకున్నాను. బాలలు బ్రహ్మ స్వరూపులు గదూ?

కాని నేను నవ్వినపుడు నేనక్కడున్నానని గమనించి ప్రక్కగదిలోకి పారి పోయింది.

★

కనకపల్లి రాధ.



గృహవైద్యం

పిల్లలున్న ఇండ్లలో తరుచు పిల్లలు ఇలా వెళ్ళి, అలావెళ్లి దెబ్బతగుల్చుకొని ఏడుస్తూంటారు. తల్లి వంటఇంట్లో వంటహడా విడిలోవున్నప్పుడు కూడా కూడా తిరిగి చేతులుకాళ్లు నిప్పుతోను పొంగేనీళ్లతోను కాగేపాలతోను కాల్చుకుంటారు. ఇంకా కూరలు తరుక్కు పని తొందరలో కత్తిపీట మరిచేమా వాళ్ళుకూడా మనవలె నే తరగడానికి పిద్దపడి చేతులు కోసుకుంటారు. కాలు వచ్చిన పసిపిల్లలను వేయికళ్లతో కాచుకోడం మన తల్లులవిధి. ఒక్కొక్కప్పుడు మన మెంత జాగ్రత్తలోవున్నా ఇలాటివి సంభవిస్తూ వుంటాయి. ఎలక్ట్రిసిటీలేని ఇళ్లలో దీపంబుడ్లు హరికేన్‌లాంతర్లతోను పిల్లలు చేతులు సులువుగా కాల్చుకుంటారు. అలా కాలినప్పుడు తేనె నెయ్యి తక్షణం రంగరించిరాశే స్తే పొక్కుకట్టదు. పిల్లలు చేతి మంటబాధ భరించలేక నీళ్లల్లో పెట్టాలని ఏడుస్తారు. ఎంతమాత్రం నెయ్యి తడిచేయనియ్యరాదు. తేనె నెయ్యికలిపిరాస్తే మంట కూడా కొంతసేపటికి తగ్గగలదు. సున్నం మీద తేటనీరుతీసి కొబ్బరిచమురు కలిపి నవనీతం తయారుచేసి రాసినా మంచిదే.

దెబ్బలకు

పిల్లవాడు జారిపడినపుడు కాలుగాని చెయ్యిగాని మడతపడితే నిటారుగాచేసి బాగారుద్దిమర్దనాలా చేయాలి. కముకు దెబ్బతే, ఎఱ్ఱమన్నూ, చింతపండూఉడికించి పట్టువేస్తే తక్షణం నొప్పితీసేస్తుంది. సున్నం బెల్లంకలిపికూడా పట్టువెయ్యవచ్చు. ఆటలాడేపిల్లలు (అనగా ఫుట్‌బాల్ హాకీ మొదలైనవి)ఆటలాడినప్పుడు కాళ్ళుదెబ్బలు తగిలితే ఎఱ్ఱమన్నును మించిన మందులేదు. ఈదినం ఆటఆడి దెబ్బతగుల్చుకొన్న పిల్లవానికి రాత్రి ఎఱ్ఱమన్ను పట్టువేస్తే ఉదయానికి నొప్పితీస్తుంది. తిరిగి సాయంత్రం చక్కగా ఆడుకుంటాడు. ఇంకా నొప్పి తియ్యకపోతే, ములగఆకు, నీరుల్లిపాయ బాగాచితగ్గొట్టి కొంచెం వాముకలిపి నూనిలో వెయించి కాచాలి. అలా బాగా కాచి అముద్దతోటే కట్టు కట్టెయ్యాలి.

గాయం తగిలిన తక్షణం, రక్తం కారకుండా తడిగుడ్డచుట్టాలి. కొద్ది అరపూస మెత్తగానూరి కొబ్బరినూనెలో కలిపి గాయందగ్గర వేయాలి. లేకుంటే కొద్ది కొబ్బరినూనె రాశీ ఈపొడి దానిమీద అద్దినాసరే. ఇంక, తాడిచెట్లు దగ్గరలో కలవారు (చిన్న తాడిచెట్టు మొవ్వను ఆవరించుకొని ఒక నూగులాంటి పదార్ధం వుంటుంది. దాని నేతాటిపువ్వారం అంటారు) గాయం తగలగనే ఈ తాటిపువ్వారంవేస్తే గాయం మానీదాకొవ్వూపడు. లోపలలోపల పుండు మానిపోతుంది. కవిరి, కొబ్బరి నూనిపెటినా గాయం త్వరగామానుతుంది. ఏదైనా కొద్దిగా కాలినప్పుడు చిన్నచిన్న గాయాలకేకాని, వళ్లంతా కాలినా పెద్దదెబ్బలైనా మన సాధ్యంకాదు, తక్షణం డాక్టరుని పిలవాలి.

నోటిపూతకు

నోటిపూత వస్తే అన్నం తినడంకూడా కష్టమే. మాఘలకాయ తెచ్చి బాగా అరగ

డి. భాస్కరమ్మ

దీసి నోరంతా రాయాలి. నీరంతా వోడిపోతుంది. ఉసిరి పచ్చడి, పూతస్థలంలో రాసి చాలుకే బైటకు పెట్టినాకూడా నీరంతా వోడిపోతుంది. (నూరని వుసిరిపచ్చడే నోటికి రాయాలి. నూరినపచ్చడి అన్నం కలుపుకు తిన్నా నోటిపూత తగ్గను) కొబ్బరిముక్క నోటితో నమిలినాసరే, లేకుంటే, కొబ్బరిముక్క మెత్తగానూరి, అరకప్పు నీళ్లుకలిపి పొయ్యిమీద కాచి చల్లారేక చక్కెరవేసుకు త్రాగినా నోటిపూత తగ్గగలదు.

కొందరు స్త్రీలకు బయటచేరినప్పుడు విపరీతమైన కడుపునెప్పివస్తూంటుంది. అలా వచ్చినవారికి ముద్దహారతి కర్పూరం కొంచెం తీసుకుని, (అనగా కుంకుడుగింజంత తీసుకొని) బెల్లంపొడిచేసి మధ్య ఆకర్పూరం పెట్టి చుట్టూ బెల్లంతో మాత్రలాచేసి మింగాలి. చప్పిడి పథ్యం చెయ్యాలి!

మరికొందరికి రెండు మూడు నెలల గర్భిణిగా ఉన్నప్పుడు విపరీతమైన వాంతులు వెసుతుంటయి. ఇలాంటివారు ఏవీ ఆహారం తీసుకోరు. వాతములేకున్న, ఉదయాన్నే ఒక నారింజకాయరసం తీసుకు త్రాగవలెను. ఒక టేబుల్‌స్పూన పేలాలు పొడిచేసి, చిన్న సిందూరం పలుకుకలిపి, కొద్ది పంచదారతోగాని, తేనితోగాని కలిపిపుచ్చుకుంటే, వాంతులు తగ్గగలవు. ఇలాంటి చిల్లర వైద్యాలు ఇంక ఎన్నెన్నో మన పెద్దలు చేసేవారు. మనం వాళ్లదగ్గర నేర్చుకోలేకపోయాం. ఈనాడు మనం పునర్విమర్శ చేసుకొనేసరికి కొన్ని జ్ఞాపకానికొచ్చాయి. కొన్నిరాలేదు. మా మామ్మగారు అనేవారు "మాపాటలు, మావైద్యాలు మాతో ఆఖరని" వాళ్ళుపోతేగాని వారి విలువ మనకు తెలియలేదు.

* * *

తలనొప్పికి

చలువవల్లవస్తే: రెండు చెంచాలు మిరియాలు మెత్తగా నూరి ఉడికించి కపాలమునకు పట్టు వేయాలి. ఒక వైపునే వస్తే ఆ వైపు పట్టువేస్తే చాలు.

వేడివల్లవస్తే: కర్పూరాలు, మెత్తగా నూరి కపాలానికి పట్టు వేయాలి. (కర్పూరాలు ఉడికించరాదు).

తేలుకాటు, జెర్రికాటు

ముషిణిచెక్క అరగదీసి (మంచి నీళ్లతో) కుట్టినచోట, బాధగావున్న భాగానికి పట్టు వేయాలి. ఇంకా బాధ ఎక్కువగాఉన్నచో ఆ ముషిణి గంధం కొద్దిగా నీళ్ళలో వేసి త్రాగించిన విషం విరిగిపోవును.

సేకరణ:

సంగాని భానుమతి.

తాళ్ళరేవు.



ఆస్పత్రిలో అవస్థలు :

కారణాల తోరణం

ఆస్పత్రిలో అవస్థలు' అనే శీర్షిక క్రింద 8-5-'57 సచిత్ర వార 'ఆంధ్ర పత్రిక'లో ముగ్గురు సోదరీమణులు వ్రాసినవి చదివి వారికి నా సానుభూతి తెలియ పర్చుచూ, అవస్థలకు అడ్డు, మేర అనే లేదా లేనందున, ఆసుపత్రులలో పరిస్థితులగురించి నేను తెలుసుకొన్న విషయాలు వ్రాస్తున్నాను.

పలుకుబడి, డబ్బునిజోడించికొని, లేదా విడివిడిగా గాని ఉపయోగించుకొనే శక్తి సామర్థ్యములుగల రోగులకు నేటి ప్రభుత్వ ఆస్పత్రులలో ఏమాత్రం అవస్థలుపడ నవసరం లేదంటే ఆశ్చర్యపడ నవసరం లేదు.

ఎటొచ్చి అవస్థలుపడేది, ఆస్తిమతులు లేని పన్నకారుజనం. బీదలూను. ప్రభుత్వం ఆస్పత్రులను బీదవారికొరకే నెలకొల్పినా మని అంటుంది. కాని నేతిబీరకాయలో నెయ్యి ఎంత ఉందో ఇందులో సత్యం అంత ఉన్నదనిపిస్తుంది.

ఒకే ఒక ఉదాహరణ : ఒక అతి బీదరోగి ఆపరేషన్ చేయించుకుని, ఆరోజురాత్రి తెలివితో లేని పరిస్థితిలోనుండి అదృష్టవశాత్తు కోలుకొని ఉన్నాడు. ఆరోగికి ముక్కు ద్వారా గొంతులోనికిపెట్టిన రబ్బరుగొట్టం ద్వారా పాలుకాని కాఫీకాని పట్టించవలసి ఉన్నది. ఆరోగి ఒక రోజు సాయంత్రం సరిగా 4 గంటకు, "ఆకలివేస్తోంది కాఫీకాని పాలుకాని పట్టించవలసినదని ఒక స్త్రీ నర్సును పదేపదే కోరాడు. ఒక గంటవరకు" ఆగు, ఆగు అనే సమాధానం యిచ్చినది ఆవిడ. ఇదిచూచి ఆకలిబాధకు చిన్న, పెద్ద తేడా లేదని చెప్పి ఏదో ఆహారం పట్టవలసినదని నేను కోరినాను. "మాకు తెలుసును ఎప్పుడు ఆహారంపట్టవలెనో" అనేసమాధానం యిచ్చిందామె. "మీకు తెలుసున్నందుకు చాలా సంతోషం. కాని ఒకగంటపైబడి ఆరోగి ఆకలి అని అనుచున్నాడు. మీతో చెబుతున్నాను. మీరు ఆహారం యివ్వలేదు అందు మీద కలుగజేసుకొని చెప్పినందుకు క్షమించవలసినద"ని ఆవిడతో చెప్పినాను. తరువాత ఆ 'సిస్టర్' అతనికి ఆహారం గొట్టంద్వారా ఇచ్చిందిః అది వేరేసంగతి. ఇది జరిగిన విషయం.

ఈమధ్య నాసోదరునిఆస్పత్రిలోజేర్పించి అతని సహాయం కొరకు అచ్చట ఉన్నాను. సామాన్లు 'లాకర్' (రోగి మంచం దగ్గర ఉండే చిన్న బీరువా) పెట్టడానికని అది తెరవగా దానిలోనుండి బయటకు వచ్చినవి "బొద్దింకలు! లాకరు అంతా తుప్పు పట్టి ఉన్నది. నేను దాన్ని శుభ్రంచేసి, సామాను పెట్టేను. మిగతా వార్డులు కూడా అలాగే కనబడ్డాయి. రెండు రోజుల అనంతరం నా మిత్రుడైన అక్కడి డాక్టరును కలుసుకొని నేను చూచినవి, విన్నవి చెప్పి నాకు తోచిన ప్రశ్నలు అడిగాను.

వేసినప్రశ్నలు:ఆసుపత్రిలో శుభ్రతలేదు. నర్సింగ్ సరిగ్గా లేదు. డబ్బు ఉంటేనే కాని కాస్త కూడా జరగటం లేదు. ఒక కేసుకి పరీక్ష పూర్తి అవవలెనంటే అధమం వారం రోజులు అవుతోంది కారణాలు ఏమిటి అంటే.—

ఆయన జవాబు: రోగులు ఎక్కువ అయి నారు, ఒక్కొక్క డాక్టరు అధమం ఒక్క రోజున దాదాపు 10 మంది రోగులకు పరీక్ష చేయాలి. అట్లాంటప్పుడు నీవు కోరినవిధంగా ప్రత్యేకం విడివిడిగా శ్రద్ధ తీసుకోవడం ఒక్క డాక్టర్కి సులభమా? మహాతీసుకొంటే 10, 15 రోగులమీద ప్రత్యేక శ్రద్ధ తీసుకొనగలడు. అంతవరకు అవసరం అయితే తప్పక తీసుకొంటాడు. (2) పైగా ఆ డాకరు ఇక్కడి రోగులను పరీక్షించి తదుపరి క్లాసులకు వెళ్ళి విద్యార్థులకు పాఠాలు చెప్పాలి (3) ఈకాలంలో పరీక్షలకు ఉత్తీర్ణులయ్యే విద్యార్థులు తక్కువగా కనబడుచున్నారు. 'రికమెండేషన్ వల్ల' ప్రతిభ ఏమాత్రం లేకుండా విద్యా సంస్థలలో జేరి దండయాత్రలు కొట్టి ఏదో డిగ్రీ సంపాదించిన వాడు ఏమి చేయగలడో ఆలోచించు.

(4) 'హౌస్ సర్జన్‌లు రోగులను, చూచుటకు సరిపోయేటంతమంది ఉండటం లేదు. పెద్ద ఆస్పత్రులలో ఒక్కొక్క 'హౌస్ సర్జన్' అధమం 50 పైబడి యింజక్షన్లు (సరాసరిని 70, 80 యింజక్షన్సు) వరసగా యివ్వాలి. రెండు పూటలా. ఇవి కాక ఇంకా చాలా పనులుంటాయి. రోగులడిగిన ప్రశ్నలకు ఏమి సమాధానం యిస్తాడు?

5 అసిస్టెంట్ సర్జన్స్ ఉన్నారు. వారు మాత్రం ఎంతమంది రోగులుకని సమాధానం యిస్తారు. రోగులు అంతకంతకు ఎక్కువైతే వైద్యులూ పెరగాలిగదా.

6 తగినంత సిబ్బంది, రోగులకు సరిబడిన డాక్టర్లు ఉండినప్పుడు మేము స్వయంగా చూడలేదనే నెపంవేస్తే అప్పుడు మామీద నింద వేయవచ్చును.

7 లేదా పెద్ద ఆస్పత్రులలో రద్దీ తగ్గవలెనంటే, డిగ్రీలు పుచ్చుకొన్న డాక్టర్లు ఇద్దరేసి, కలిసి గ్రామ ప్రాంతాలలో 'నర్సింగ్ హోమ్స్' తెరిచి ధనసంపాదనే ముఖ్య లక్ష్యంగా గాక కొంత మానవసేవ కర్తవ్యంగా పెట్టుకొని పనిచేయాలి. అని ఆ డాక్టరు గారు చెప్పినారు.

ఒక 'మేల్ నర్స్' తో మాట్లాడుతూ "బహుశా కొంత కాలం పాటు మీరు ఇట్లాగే ఉంటే కొన్నాళ్ళకి నర్సింగ్ మర్చిపోతారు" అని నవ్వుతూ అంటే అతనూ నవ్వి" ప్రభుత్వం నాన్ గజటెడ్ ఉద్యోగస్థులకు ఇప్పుడు రు 6 లు పెంచినది. ప్రొబేషన్ నర్సు నెలజీతం రు 63 లు ఆ ప్రొబేషన్ కాలం మూడున్నర సంవత్సరాలు ఏడాదికి రు 5 ఇంక్రిమెంటు ఇస్తారు. ఈ ప్రొబేషన్ కాలంలోనున్న నర్సులకుకూడా ఆ ఆరు రూపాయలూ ఎందుకు ఇవ్వరు? ప్రభుత్వం, రోగులకు సేవచేయు వారిమీద అంత చిన్నచూపు ఎందుకు చూడాలి? పైగా స్త్రీ నర్సులలో ప్రొబేషన్ కాలం అనంతరం నూటికి మూడు లేక నాల్గవ వంతులమందిని సర్వీసులోనికి తీసుకొంటారు. ఆ అవకాశం వారితోబాటు మగనర్సులకు ఎందుకు పూర్తిగా యివ్వరు? మాకు చేతనయినంత నర్సింగ్ చేస్తాము దానికి వెనకాడముకాని ప్రభుత్వం మాత్రం గుర్తించదు మాకష్టం" అన్నాడు ఆ మేల్ నర్సు.

వార్డులలో తోటీలకు వార్డు బోయ్‌లకు ఎప్పుడూ తగవులే. ఈ సంగతి అడిగితే ఎవరి పొట్ట బాధ వారిది అన్నాడు ఒకతోటీ.

సుమారు 15 సం॥ లు సర్వీసుగల ఒక తోటీని, ఏమిటి ఆస్పత్రి మారిపోయింది. శుభ్రత విషయాల్లో ఇంత అశ్రద్ధ ఏమిటి అంటె మేము పదిమందికి పది అందిస్తూ, గది వరండా తుడుస్తూనే ఉంటాము.

కాని, ఈలోపల మావంటివారు రోగు
లను చూడడానికివచ్చి చుట్ట, బీడీ, సిగరెట్టు
పీకలూ, ఆ మంచందగ్గరే పడవేస్తారు. పళ్ళ
తొక్కలు అక్కడే వేస్తారు. అవితీయాలి.
వార్డులు తుడవాలి. పాకీదొడ్లు శుభ్రం
చేయాలి. ఏదో కాలక్షేపం చేస్తున్నాము.
మామీద విరుచుకుపడితే ఏమి లాభమండి
అందర్నీ అదుపాజ్ఞలో పెట్టేనాథుడు
కావాలి"అని సమాధానం యిచ్చి, అబ్బాయి
గారూ! తప్పనిసరి అయి ఆపరేషన్ చేసే
వారు లేకపోతేనే పెద్ద ఆస్పత్రులకు
వెళ్ళండి" అన్నాడు.

ఇవి ఇట్లా ఉండగా ఆస్పత్రిలో జేరిన బీదరోగుల తాలూకువారు ఆస్పత్రిలోపలకు వెళ్లుటకు పాస్ ఉండాలని తెలిసిఉండినా, అది యిచ్చేవారిని అడుగుటకు ధైర్యంచాలక, వారిని అడగక గేటుకాపలాదారుని కాళ్ళా వేళ్ళాబడి బ్రతిమాలి బామాలి, అణా బేడా ఇచ్చి లోపలకి వెళ్ళుతారు. ఈ దృశ్యం నిత్యం ఉదయం మొదలు రాత్రి పొద్దుపోయే వరకు చూడవచ్చును. అందువల్ల పాస్ ఇచ్చే అధికారం గలవారు బీద రోగులను ఆసుపత్రిలో జేర్పించుకొన్న వెంటనే "నీ తాలూకు ఎవరైనా నీతో ఉంటే చెప్పు 'పాస్' ఇస్తాము. ఎవరు అడ్డుపెట్టరు గేటు వద్ద" అని అడిగి, 'పాస్' ఇచ్చుట ఒక కర్తవ్యంగా పెట్టుకొనవలసి ఉంది. కార్లలో ఎంతమంది వెళ్ళినా ఏకాలంలో వెళ్లినా వారివద్ద పాస్ ఉన్నా లేకపోయినా ఆకారు ఆపుచేసి పాస్ చూపండి అని అడిగే ధైర్యం కాపలాదారునకు ఉండదు.

ప్రభుత్వ ఆస్పత్రిలో బీదరోగులు పడే అవస్థలు వ్రాస్తే ఒక పెద్దగ్రంథం అవుతుంది. అందుచే ఒకఆస్పత్రిలో ఉద్యోగులను పనివారినీ పలకరించి మంచీచెడ్డా స్నేహ పూర్వకంగా అడిగి, తెలుసుకొని, ఇక్కడ వ్రాసినాను. మనబాధలు మన అవస్థలు మనకే తప్పవు. వారిబాధలు వారి కోరికలు వారికీ తప్పవు, దీనికి మూలకారణం ప్రభుత్వ యంత్రాంగాన్ని నడిపే పైవారికి తప్పక తెలిసిఉంటుంది.

డొంక కదిపితే తీగంతా కదులుతుంది. ఆస్పత్రే కాదు ప్రభుత్వశాఖలన్నింటిలో మరి బీదవారికి ఖర్మంగాలి ఏదైనా పని ఉన్నదంటే ఆ పని ఎప్పుడు అవునో ఏమి చేయాలో ఏకాలంలో ఎందుకు అవదో వీరికి బోధపడక నానాఅవస్థలు పడుచున్నారంటే ఆశ్చర్యం చెందనవసరం లేదు.

ఒక సోదరుడు.

* * *

పోయిన సంవత్సరము మావారికి జ్వరము వచ్చింది. మేము అదే పోతుందని ఏవో తెలిసిన వైద్యాలు చేస్తు 10 రోజులు ఇంటిదగ్గరే ఉంచినాము. మనిషి దినదినము నీరసించి పోవుటవల్ల ఆసుపత్రికి తీసుకొని వెళ్ళినాము. ఆసుపత్రిలో ప్రవేశించిన వెంటనే సెంటర్లో ఉండే నర్సు మమ్ములను బెంచి మీద కూర్చో బెట్టి సంగతులన్ని అడిగి కనుక్కున్నది. పిదప డాక్టరుకు రిపోర్టు చేసింది. నర్సు వ్రాసి పంపిన లక్షణాలను బట్టి డాక్టరు ఏదో మందుపోయమని తాను ఒక గంటలో వస్తానని కాగితము మీద వ్రాసి పంపినారు. ఆనర్సు, రోగికి మందు పోసిన తరువాత ఏగది కావలెనని ప్రశ్నించగా ప్రైవేటు గది అన్నాము. ఆ గదిలో పరుపు వేసి పడక తయారు చేసి మమ్ములను అచ్చటకి చేర్చింది. నవారి చూస్తే చాల వదులు, పరుపు చూస్తే గుంటలు మెట్టలు. ఆ పడక మీద కాసేపు కూడా పడుకోలేక పోయినారు. వారిని కుర్చీలో కూర్చుండ బెట్టి వార్డు నర్సు దగ్గరకు వెళ్ళినాను. ఆమె రాత్రి నర్సుల దగ్గర రిపోర్టు తీసుకుంటున్నది. సరే! కొంతసేపుఆగి రిపోర్టుఅయిన తరువాత నేనుపరిస్థితి తెలుపగా వెంటనే వచ్చి అక్కర తీర్చినారు. పరుపు మంచిది కాదని మంచిది వేయమని మేము తొందర పెట్టలేదు. పాపం వాళ్ళు ఎంతమందికని మంచి పరుపులు ఏర్పాటు చేయగలరని పరుపు మాకు అక్కర లేదని తీయించినాము. ఒక గంట సేపటికి డాక్టరు వచ్చి రోగిని పరీక్షించి టైఫాయిడ్ అని నిశ్చయించి గొట్టాల మందు తెమ్మని చీటి వ్రాసి ఇవ్వగా మేము షాపునుండి తెప్పించినాము. ఇంకా కొన్ని మందులు వారే ఇచ్చినారు. 3 గం॥ ఒకసారి గొట్టాల మందు వాడమని డాక్టరు చెప్పినారు. గాని నర్సులు ఒక్కొక్కసారి క్రమముగా వేసినా ఒక్కొక్కసారి ఒకగంట ఆలస్యముగా వచ్చేవారు. వారిమీద మేము పోట్లాడ లేదు గాని వారి పనిని గ్రహించి టైం ప్రకారము నేనే ఇచ్చేదాన్ని. వాళ్ల ధర్మాన మూడోరోజు జ్వరం తగ్గిపోయింది 10 వ రోజు ఇల్లు చేరుకున్నాము.

అసంతృప్తి

దేవుడే మానవులను తృప్తి పర్చలేడు. ఇక నర్సులేమి తృప్తి పర్చగలరు. ఒక ప్రమాదకరమైన కేసు వస్తే నర్సులు డాక్టర్లు తిండి కూడ మాని దానితో సతమత మౌతారు. ఇట్లాంటి పరిస్థితిలో కొద్దిగా బాగున్న వారిని విడిచిపెట్టి తరువాత నిదానంగా చూస్తారు. మనము గొంతుమీద కూర్చుంటే వారు మాత్రం ఏమిచేస్తారు. మనకేమో వాళ్ళు గంటగంటకు వచ్చి పలుకరించి వెళ్లితే తృప్తిగా ఉంటుంది. మనలాటి వారు అవుతల వందమంది ఉండగా అందరికి సమాధానం చెప్పాలి. పైగా ప్రమాద కరమైన కేసువస్తే వారి దగ్గరే కనిపెట్టుకొనిఉండాలి. ఇక వారి దురవస్థ ఆలోచించుకొనుట మన విధి. ఒక్కొక్కసారి భోజనానికి వెళ్ళుటకు కూడ వీలుండదు. ఇది సత్యము. మీరు నమ్మినాసరే మానినాసరే. 120 పౌనుల బరువుతో నర్సు ట్రైనింగులో చేరిన వ్యక్తి ముగించి ఇల్లు చేరువరకు 80 పౌనులున్నదంటే నమ్మండి. విశాఖపట్నంలో మా అక్క ఆపరేషన్ గది నర్సుగా పని చేసింది. ఉదయం 7 గం వెళ్ళితే సాయంత్రం 7 గం అయినా ఇల్లు ముఖము చూచుటకు వీలుండదు.

ఆపరేషన్లు అయినవి గదాఅని సామానులన్ని సర్దుకుని తలుపులు వేయుచుండగా మరియొక వార్డునుండి ఆపరేషన్ మెమో వస్తుంది అర్జంటని. ఏదో కొంచెము కాఫీ తెప్పించుకొని త్రాగి తిరిగి పని మొదలు పెట్టవలెను. అన్నము మానెయ్యాలి. బుక్కులను పరీక్షించి నర్సులను డాక్టర్లను సెలెక్టు చేసుకోవలెనంటె ఇక వైద్య చికిత్సేసున్న. తల్లిబిడ్డకు చేయదు, బిడ్డతల్లికి చేయదు చాల విసుగు, రక్తములో రక్తము కలిసిన వారే ఓర్మితో పరిచర్యచేయలేరే, ఇక ఎవరో చేస్తున్నారంటే గొప్ప సంగతే. నర్సులు డాక్టర్లు దేవతలుకారు మనబోటి మానవులే. మనలాటి బుద్ధులుగల్గిన వారే. వారు ఆ ఉద్యోగానికి ఏర్పాటు చేసు

సినిమాలో ధూమపానంపై నిషేధం

రాష్ట్రంలోని సినిమాప్రదర్శనశాలలన్నిటిలోను ధూమపాన నిషేధాన్ని మరింత కట్టుదిట్టంగా అమలుజరపాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఈ నిషేధం అనేది ప్రస్తుతానికి పుస్తకాలలోమాత్రమే ఉంది. దాన్ని ఆచరణలోకి తీసుకురానంతకాలం అది ఉన్నా మానినా ఒకటే. ఎటొచ్చినవ్వు వస్తుంది "పొగత్రాగరాదు"అన్న బోర్డు చూచినపుడు. ఇంకోనిమిషం తరవాత, పిల్లలూ ఆడవాళ్ళూ ఆపొగఘాటుకే ఉక్కిరిబిక్కిరిఅయి చికాకుపడుతున్నపుడు విచారం కలుగుతుంది.

ప్రభుత్వం ఇప్పుడు ఇందులో సాధకబాధకాలు గమనించి ఈనిషేధాజ్ఞని 'పకడ్ బందీ'గా అమలు జరుపాలని చూస్తోంది. ఆరంభంలో పగటివేళ ఆటలలో మాత్రమే నిషేధించే పద్ధతి (ఇపుడు మద్రాసులో అమలులో ఉంది.) ప్రవేశపెడతారట.

సి. వి. విజయలక్ష్మి.

అసంతృప్తి

చిన్నందున ఉద్యోగధర్మం నెరవేరుస్తున్నారు. మారుటి తల్లి మారుబిడ్డలను తన కడుపునపుట్టిన బిడ్డను చూచినట్లు చూడాలంటే కొంతవరకు చూడగలదేమోగాని నిజమైన తల్లిప్రేమ ఎట్లావస్తుంది. మొగ డాక్టర్లకు ఆడువారికి కాన్పులు చేయాలన్న ఆశకాదుగాని రోగిని రక్షించాలన్న విధి అది మనము ఇష్టపడితేనేగాని ఇష్టపడకపోతే మన ముఖముచూడాలన్న అవసరం వారికి లేదు. పెద్దపెద్దమెడికల్ కాలేజీఆసుపత్రుల యందు నేర్చుకునే డాక్టర్లు ప్రేక్టికల్స్ చేయకపోతే ఎట్లా నేర్చుకుంటారు ఎట్లా బిరుదు పొందుతారు ఎట్లా అనేకులను రక్షించ గలుతారు. ఆసుపత్రులు మురికిగా ఉన్నవంటే నర్సులు డాక్టర్లు మురికి చేయరు వెళ్లిన రోగులే దానికికారణం. నర్సులు రెండుపూటలు వాళ్ల విధి ప్రకారము కడిగిస్తూనే ఉంటారు. ఆసుపత్రియందు కొంత అవస్థలేకపోలేదు. ఇల్లుమాదిరి జరగాలంటె ఎలా జరుగుతుంది. మనకు కలిగిన కష్టాన్నిబట్టి సర్దుకు పోకపోతే ఎలాగ మరి, మనఇంట్లో జీతమిచ్చి అన్నంపెట్టి ఉంచుకున్న పని మనిషినే "అమ్మా, అయ్యా" అనిచేతులు గడ్డాలు పట్టుకొని పనిచేయించుకుంటున్నాము. అట్లాంటప్పుడు ఇక ఆసుపత్రులందు అధికారాలు చెలాయించేనర్సులు డాక్టర్లదగ్గిర ఎట్లాఉండాలో ఆలోచించుకోవలెను. చల్లని చూపు చల్లని మాట ముఖ్యముగా వారికే ఉండాలిగాని, వెళ్ళినరోగుల యందు గూడ కొంత ఓర్మి ఉంటేనేగాని సరియైన పరిచర్య చేయించుకోలేము. ఏది ఎట్లున్నా మన ప్రాణాన్ని రక్షించేవారు దేవుని తరువాత నర్సులు, డాక్టర్లే.

ఎ. చంద్ర

* * *

వారినిబట్టి వీరా వీరినిబట్టి వారా

(8-5-57) పత్రికలో బేరాలు గురించి వ్రాశారు. కాని అట్లా గీచి గీచి బేరంచేసేవారికే ఇస్తారు చాలామంది. నాకు చాల అనుభవం. ఒక చీరెల వ్యాపారిని 15 రూ చీరను 12 రూపాయలకు నేను అడిగితే ఇవ్వనన్నాడు. అదే చీరను ఆవీధిలో మరొకరు బేరంచేసి 9 రూపాయలకు తీసుకున్నారు. మనం న్యాయం ఆలోచించి 1, 2 రూపాయలు తగ్గించినా ఇవ్వరు కొందరు.

మా స్నేహితురాలు ఒకామె వుంది. ఆమె కచ్చితంగా ఇరవై రూపాయలన్న చీరని 10 కే అడుగుతుంది. వాడు తిరిగి తిరిగి వచ్చి 10 రూపాయలకే ఇస్తాడు. ఇట్లా చాలా చిన్న చిన్న విషయాల్లోకూడ అంతే. పెద్ద పెద్ద షాపుల్లో నవ్వుతారని వాళ్లు ఎంత చెపితే అంతా నోరుమూసుకొని తీసుకుంటాము. మా స్నేహితురాలు అక్కడ బేరం ఆడితే జాకెట్టు బట్టలు చెప్పిన ధరకన్న 4 అణాలు తగ్గించి ఇచ్చాడు.

దుకాణాల వాళ్ళూ వచ్చేచోట రాబట్టుకొంటారు. లేని చోట్ల వాళ్లకు కడితే అడిగినధరకు ఇస్తారుకూడా. అందుచేత కొత్తసబబూ బేసబబూ ఆలోచించి గట్టిగా బేరంచేసినా తప్పులేదని నా ఉద్దేశ్యం. ★

ఎస్. సూర్యాభాయి, (తిరుపతి)


* * *

నేను చెప్పేది

ఆంధ్ర పత్రికలో వనితాలోకంలో ఎవరు దేనినిగురించి వ్రాసినా మరొకరు దానిలో వున్నటువంటి తప్పులను ఎంచి దానికి విమర్శలు చేస్తున్నారేగానీ, ఎవరూ వూరుకోవడములేదు. అందుచేత ఒకరిని ఒకరు తప్పు లెంచుకోవడానికి అర్థమం రెండు కాయితాలయినా అనవసరంగా వేస్తుచేస్తున్నారు. అందుచేత నేను చెప్పేదేమిటంటే మనకి తెలియనిది తెలుసుకోవడం. మనకి తెలిసినది తోటి సోదరీ మణులకు చెప్పడం మంచిది. ఆమధ్య పనివాళ్ల సమస్యగురించి కూడా కొన్ని వారాలు వాదాలు జరిగినాయి. ఇదరు సోదరీమణులు, ఎందుకొచ్చినవి అనవసరం అని రాయబట్టేకదా తగ్గాయి. క్రిందటి వారం, ఈవారం వ్రాసిన గృహవైద్యం బాగుంది. చక్కగా అటువంటివి వ్రాస్తే నలుగురికి వుపయోగంకానీ, నీవు వ్రాసినది తప్పు, నీవువ్రాసినది బాగు లేదు, అనడంతోనే సరా. అనవచ్చు. బాగుంది, లేదు అని అనకూడదని కాదు. దానికి ఒకపరిమితి వుండాలి.

బి. వరలక్ష్మి, (విజయనగరం.)





మాట మెలకువ

భుక్కుండు డనెడు చోరుడు
భోజ మహారాజేంద్రుని
కంఠహార మెట్లైనను
కాజేయ తలంపు గొనెను.

ఒక్కనాటి అర్థరాత్రి
ఒరుల కంటబడ కెట్లో
నేర్పుమీఱ ప్రవేశించె
నృపుని శయన మందిరంబు.

ఱేడు తత్సమయము నందు
గాఢ నిద్రచెంది యుండె;
"బలేమంచి సమయమునకు
వచ్చితి" నని తలచె నతడు.

చాకచక్యమున హారము
చల్లగ కాజేయు చుండ
దురదృష్టము కొలది నపుడె
ధరణీశుడు మేల్కాంచెను.

తక్షణమే భటుల జీరి
తస్కరు జూపి వారలకు
"ఉరితీయుడు వీని నిపుడె
ఊఁ! కానిపొండ"నెను ప్రభుడు.

రాజాజ్ఞకు భుక్కుండుడు
రవ్వంతయు చలియింపక
"ప్రభూ! దీని విని పిమ్మట
పంచు డల్లై" యని యిట్లనె.

"భట్టి యన్నవాడు చచ్చె,
భారవి యనువాడు చచ్చె,
భిక్షుడన్నవాడు చచ్చె,
భీమసేనుడును చచ్చెను!

భుక్కుండుడ నేను చావ
భూపతి నీవును చత్తువు!
భభ్భాల గుణింతములో
ప్రవేశించె నిపుడె యముడు."

అతని సమయస్ఫూర్తికి
అక్కజపడి మెచ్చి నృపుడు,
హారము సైతము నొసంగి
కూరిమితో విడిచి పుచ్చె.

ఆర్. దొరసామి

తగిన శాస్తి

పూర్వం ధారానగరమును విజయదత్తుడనే రాజు పరిపాలించుచుండెడివాడు. అతని ఆస్థానములో శంభుశర్మ అనే పండితుడు గలడు. పేరుకుమాత్రము పండితుడు. నిజముగా అతనికి పాండిత్యములో ప్రవేశము సున్న. ఎవరైనా పండితులు అతనితో వాదించుటకు వచ్చినఎడల ఆ సంగతి మహారాజునకు తెలియనీయక పండితులకు లంచము ఇచ్చి వారిని పంపించెడివాడు శంభుశర్మ. ఒకానొక రోజున మహారాజు ఇట్లు రాజ్యమంతటను చాటింపు వేయించెను "పండిత సింహ, పండిత బ్రహ్మ శ్రీ శ్రీ శ్రీ శంభుశర్మను ఎవరైనా వాదములో ఓడించగలిగితే వారికి సహస్ర గోదాన బహుమానము."

ఈ చాటింపు విని తెలివిగల విష్ణుశర్మయను యొక నిరుపేద పండితుడు శంభుశర్మ నగరమున లేని రోజున మహారాజును దర్శించి తాను వాదించగలనని విన్నవించెను. ఇంతలో శంభుశర్మ ఊరిలోనికి వచ్చి యీ సంగతి తెలుసుకొని కొంచెము విచారించెను. ఐనను ఎట్లో ధైర్యము తెచ్చుకొని వాదనకు అంగీకరించెను.

మహాసభ ఏర్పాటు చేయబడినది. పండితులిద్దరు చెరి యొక వైపున కూర్చొనియుండిరి. అప్పుడు వారిద్దరు ఇట్లు సంభాషించుకొనిరి.

ముందుగా విష్ణుశర్మ ఇట్లు చెప్పెను. "అయ్యా తమకు ఏ శాస్త్రములో ప్రవేశము గలదు."

"మాకు సర్వశాస్త్రములలోను అనుభవము గలదు."

"ముందు మీరు మీమాంస చెప్పెదరా లేక సిద్ధాంతీకరించెదరా?"

మునుపెన్నడు ఆ పేర్లను వినని శంభుశర్మ ఇట్లు జవాబిచ్చెను.

యస్. వి. రామారావు

"ముందుపని మీరు చేయుడు తర్వాతపని నేను చక్కబెట్టెదను."

"'యతోయజ్ఞోపవీతం బ్రహ్మ జిజ్ఞాస' ఇక మీరు సిద్ధాంతీకరించవచ్చును" అనెను విష్ణుశర్మ.

ప్రజలు తమ పండితుడయిన శంభుశర్మ ఏమి చెప్పునోయని ఎదురు చూచుచుండిరి.

శంభుశర్మ కాసేపు ఆలోచించి ఏమియు తోచక వెంటనే నదురు బెదురు లేక "కర్ర జిజ్ఞాస, మానవుని బుర్ర జిజ్ఞాస; అన్నం జిజ్ఞాస, సున్నం జిజ్ఞాస; వళ్లు జిజ్ఞాస, రెండు కళ్ళు జిజ్ఞాస; నీవు జిజ్ఞాస, నేను జిజ్ఞాస, సర్వం జిజ్ఞాస; తెలిసిందా" అని తడుముకోకుండా జవాబు చెప్పెను. తమ పండితుడు గొప్పవాడని ప్రజలు, మహారాజు సంతోషించిరి.

విష్ణుశర్మ చేయునదిలేక యీ పండితునకు తగిన శాస్తి చేయవలెనని యొక ఉపాయమాలోచించెను. కొంతసేపైన తర్వాత విష్ణుశర్మ, శంభుశర్మదగ్గరకు వెళ్ళి అతని పాదమునకుగల ఒక వెండ్రుకను తీసుకొని తనతలపై నుంచుకొనెను. ఆ తర్వాత రాజు అట్లేల చేసితివని విష్ణుశర్మను ప్రశ్నించెను. విష్ణుశర్మ దానికి తగినరీతిని "మహారాజా ఈ శంభుశర్మగారు గొప్ప పండితులు. ఈయనతో తర్కమునకు ఎవ్వరు చాలరు. ఈయన దైవాంశసంభూతుడు. ఈ మహానీయుని వెండ్రుకను శిరమున దాల్చినవారికి ఏ బాధలు రావు" అని జవాబు చెప్పెను.

వెంటనే మహారాజు తనరాజ్యములోని ప్రజలకు బాధలు రాకూడదని ఎంచి తన సైనికులను పిలిపించి శంభుశర్మ వెండ్రుకలను తీయుటకాజ్ఞాపించెను. సైనికులు తలా ఒక వెండ్రుక తీసుకొని ప్రజలకు సరఫరా చేయుచుండిరి. శంభుశర్మకు మంటపుట్టెను. రక్తము కారెను. చేయునది లేక అతడుపోయి సరాసరి విష్ణుశర్మను క్షమాపణకోరెను. రాజు అప్పుడు నిజమును గ్రహించి విష్ణుశర్మను తగినరీతిని సత్కరించి పంపెను. ప్రజలు మూర్ఖపు పండితునకు తగినశాస్తి జరిగినదని సంతోషించిరి. ★

కొడైకెనాల్

(8-వ పేజీ తరువాయి)

ధరించలేం. సిమ్లా డార్జీలింగుల్లో అలా కాదు మరి.

ఊరికి రెండుమైళ్ళ దూరంలో Happy Home అని ఓ హోటలు, అక్కడికి ఓ మైలున్నరదూరంలో కొడైకెనాల్ అబ్జర్వేటరీ ఉంది. ఇంకా అలా ఆ Happy Home నుంచి పైకి పోతే మరో రెండు మైళ్ళ దూరంలో Pillar Rocks అని ఉన్నాయి. ఇక్కడ కొండలు, చరియల్లో స్తంభాకృతిని కలిగి ఉండడంవల్ల ఈపేరు వొచ్చింది. యిక్కడ లోయ చాలా ప్రమాదకరంగానూ లోతుగానూ ఉంటుంది. ఈ జాగాలో ఆత్మహత్యలు ఎక్కువట. దీనికి Suicidal point అని కూడా అంటారు. అటువంటి అఘాయిత్యాలు జరక్కుండా యిక్కడ యిప్పుడు రాత్రిపూట పోలీసు బందోబస్తు ఉంది.

కొడైకి దక్షిణపుటంచునే "కోకర్సువాక్" (Coaker's walk) గుండా పోతే, మధుర వరకూ పల్లపు భూములన్నీ చిత్రపటంలో చూసినట్టు మంచి మనోరంజకంగా కనిపిస్తాయి.

సిల్వర్ కాస్కేడ్ గురించి పైన మనవి చేసేను. ఆమోస్తరుగానే ఊరికి మూడు మైళ్ళ దూరంలో Fairy falls అని యింకో జలపాతం. ఇక్కడ పిక్నిక్కులు చేసుకోడానికి మంచి సదుపాయంగా ఉంటుంది. కాగా ఓస్నానాలరేవూ, అక్కడ బట్టలు మార్చుకోడానికి రెండు చిన్నగదులున్నూ ఏర్పాటు.


టవునుకి రెండుమైళ్ళ దూరంలో గోల్ఫు లింక్సు (Golf links), మరో మూడుమైళ్ళు పోతే డాల్ఫిన్సు నోసున్నూ. విశాఖపట్నం డాల్ఫిన్సు నోసులాగే యిదీ లోపలికి నిడువుగా జొచ్చుకుని పోయిన ఓపర్వతం. ఇంత ఎత్తుని నిలుచుని, కళ్లు తిరక్కుండా, దొలిచినట్టు నిటారుగాఉన్న కింద లోయ చూడాలంటే బాగా గుండెధైర్యం ఉన్న వాడికి కాని సాధ్యపడదు మరి.

అక్కణ్ణుంచి "బెరిజం" వెళ్లేం. దారిలో ఎదరగా ఓ కొండశిఖరం చూపించి అది ఎనిమిదివేల తొంభైరెండు అడుగుల ఎత్తుని ఉందనీ, ఆకనుమల్లోకల్లా అదేఉన్నతోన్నత శిఖరం అనీ చెప్పేడు, కూడా ఉన్న ఫారెస్టు ఆఫీసరు. బెరిజంలో యింకో పెద్దసరస్సు, కొండలోయిల్లోను.

యీ తూర్పు కనుమల్లో చెట్లు కొట్టేస్తూ ఉంటారు. కలపకీ, పేకింగుకేసులకీ, వంట చెరుక్కీని. కాని "షోలా" చెట్లని మాత్రం ముట్టుకోరు. ఈ "షోలా" చెట్లు Tropical countries లో మాత్రమే ఉంటాయనీ, వీటిని కొట్టేస్తే, అవి మళ్లీ వాటంటతట అవి ఉత్పత్తి అవుతాయో లేదో, అవుతే ఎన్నేళ్లకి అవుతాయో, వాటి వృత్తా, సంరక్షణా యిత్యాది విషయాలు యింకా పరిశోధకులకి ఏంవీ తొడూబొంగరం అన లేదుట. అంచేత ఏ చెట్లయినా కొట్టేస్తారు గాని "షోలా" చెట్లనిమాత్రం ముట్టుకోరుట.

మధుర, పళని, తిరుప్పరంగుండ్రం— యీ మూడూ యీ మధురజిల్లాలో ఉన్న పరిసర యాత్రాస్థలాలు. అన్నీ కొడైకెనాల్ నుంచి డెబ్భై ఎనభైమైళ్ళ కంటె దూరం లేదు. ఎక్కడికి వెళ్లాలన్నా బస్సులు చాలావీలుగా ఉన్నాయి. ఉక్కకి తట్టుకుంటేను! మధురలో మీనాక్షి కోవెలా, పళనీ, తిరుపురంకొండ్రంలలోసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయాలున్నూ.

ఇలా యింకా ఉన్నాయి. కొడైకెనాలు విశ్రాంతికోసం వెళ్లాలి, యింకయేబాదరబందీ లేకుండాను. అప్పుడే నాలుగూ చూడ్డానికీ, చూసి మెచ్చుకోడానికీ సాధ్యం అవుతుంది. అయితే నేను వెళ్ళింది కచెరీ పనిమీద, స్వర్గానికి వెళ్ళినా సవతిపోరు తప్పదు, మరి కొంతమందికి!! ★


ఆరోగ్యవంతులైన జనులు ప్రతిరోజూ
లైఫ్‌బాయ్ సబ్బుతో స్నానము చేయుదురు
—అది ప్రతిదిన*మలినములోని
క్రిములను కడిగివేయును!
*మనకు ప్రతిదినం తార్కపడేమామూలు మురికిలో క్రిములున్నాయి. మనలో ప్రతివారికీ యీ క్రిములవల్ల రోగాల ప్రమాదంవుంది. అందుచేతనే చాలా మంది ఆరోగ్యవంతులగు జనులు లైఫ్‌బాయ్ సబ్బుతో మురికిని మరియు క్రిములను రోజూ కడిగివేసుకొనుటవల్ల తమ ఆరోగ్యమును కాపాడుకొనుచున్నారు—అది ఆరోగ్యవంతమయిన హాయిని గలిగించును.
LIFEBUOY SOAP
LIFEBUOY
SOAP
L 256-X52 TL
భారత దేశంలో తయారు చేయబడినది.

★ పన్నులు ! పన్నులు !! ★

[4 వ పేజీ తరువాయి]

వ్యక్తులమీదను, నాలుగువేల హిందూ అవిభక్త కుటుంబాలమీదనూ, ఆరువేల కంపెనీల మీదనూ మొత్తం 86 వేలమందిమీద పడుతుందని అంచనా.


పన్నుకు గురికాబోయే సంపదలో వ్యవసాయభూమి చేరదని ఆర్థికమంత్రి హామీ ఇచ్చారు. ప్రభుత్వం చూపే అభయహస్తం అక్కడే నమ్మదగిందిగా కనబడడంలేదు. ఒక చేత్తో అభయం చెబుతూ మరో చేత్తో ప్రజాధనాన్ని కొల్లగొట్టే వైఖరి దేశాభివృద్ధికి తోడుపడదు. ఒకచోట పన్ను తగ్గిస్తూ, మరోచోట పన్ను పెంచడమో, కొత్తగా పన్ను వేయడమో జరుగుతోంది. భూమి సంస్కరణలు అమలు జరిగితే, భూమికి సంపదపన్ను వర్తించదనే హామీ విలువ ఏముంటుంది?

ఖర్చు పన్ను

ఇకపోతే ఖర్చుపన్ను. ఇది ఏదేశంలోనూ లేనిపన్ను అని ఆర్థిక మంత్రి ఒప్పుకున్నారు. వెనకటికి ఔరంగజేబు నున్నగా 'తలపని' చేయించుకోనివాళ్ళమీద 'తలపన్ను' తగిలించాడు. అలాగే ఎక్కడా ఎవరూ అమలుచేసి బాగోగులు తేల్చుకోని ఒక కొత్త పన్నును ఈ దేశంలో ప్రయోగంచేయడం అర్థరహితంగా ఉంది. ఈ ప్రయోగాన్ని 1958-59 సం॥ నుంచీ అమలు చేస్తామని ఆర్థికమంత్రి తెలియజేశారు. ఆడంబరంగా, దుబారాగా [illegible] పెట్టేవాళ్లకే ఈపన్ను తగులుతుందని మీన హామీ ఇచ్చారు. ఇలా ఖర్చుపెట్టే వాళ్ళలో ప్రభుత్వాన్ని మాత్రం ఎందువల్లనో ఆయన చేర్చలేదు. నిజానికి ఆడంబరపు ఖర్చులకూ, దుబారా ఖర్చులకు ప్రభుత్వాన్ని మించిన వారెవరు?

ఖర్చుకు హద్దూ, పద్దూ

ఈపన్నును వ్యక్తులమీదా, హిందూ అవిభక్త కుటుంబాలమీదా వేస్తారు. రాబడిపన్ను దృష్ట్యా రూ 60,000 లకు తక్కువ కాకుండా ఆదాయం వస్తున్నవారికే ఇది తగులుతుంది. ఒక పరిమితికి దాటి ఖర్చుపెడితే ఈ పన్ను వర్తిస్తుంది. ఈ పరిమితి ఇలా ఉంది: ఒక వ్యక్తికీ, అతనిభార్యకూ కలిపి రూ 24,000 ఖర్చు పరిమితి అనుమతించారు. అవ్యక్తిమీద ఆధారపడిన కొడుకులకు, కూతుళ్ళకూ ఒక్కొక్కరికి రూ. 5000 చొప్పున ఖర్చుపరిమితి అనుమతించారు. ఈ పరిమితులకు దాటి మొదటి పదివేల రూపాయల ఖర్చుమీద పదోవంతు



రక్షణశాఖ డిప్యూటీమంత్రిగా నియమితులైన శ్రీ కొత్తరఘురామయ్య.

పన్ను పడుతుంది. ఇంకా ఖర్చు పెరిగినకొద్దీ ఎక్కువరేటున పన్ను పడుతుంది. ఈ పన్ను పడే సంపన్నుల సంఖ్య అయిదారు వేలకు మించి ఉండదు. కనక దీనిమీద ప్రభుత్వ కోశాగారానికివచ్చే ఆదాయం అతిస్వల్పం. ఇకపోతే దీనివల్ల ప్రభుత్వం సాధించదలచిన ప్రయోజనం ఏమిటి? సంపదపన్నులాగే ఇది వసూలుచేయడానికీ, లెక్కలు కట్టడానికీ బోలెడుమంది అధికారులుంటారు.

ప్రతిగృహస్థూ, ప్రతిగృహిణీ ఇకనుంచీ చేసే ఖర్చుకు హద్దూ ఉండాలి; పద్దూ ఉండాలి. హద్దుదాటితే పన్నుపడుతుందనే బాధ; పద్దులేకపోతే శిక్షపడుతుందనే భయం. ఖర్చుచేసే ప్రతినయాపైసకూ సరైన పద్దు చూపించాల్సిందే. ప్రతి ఇంట్లోను చిన్నా అవసరాలు రాసేందుకు గుమాస్తాని పెట్టుకోవలసిందే. కుటుంబానికి రహస్యాలంటూ ఉండవు. ఎవరెంత ఖర్చుపెడుతున్నారో అధికార్లకి లెక్కలోకి వస్తుంది. అవినీతి, అధికార్ల నిరంకుశత్వం పెరిగిపోవడానికి ఎంతైనా అవకాశం వుంది. ఈ పన్నుపడేది కొద్దిమంది వ్యక్తులమీద నేగనక, వారు ఖర్చుతగ్గించుకుని మిగిల్చినదానివల్ల దేశంలో కొత్తగా పెరగబోయే పెట్టుబడి ధనం ఏమీ ఉండదు. లేకపోగా, ఈ పన్నుకోసం లెక్కలు తయారుచేయడానికీ, వసూలు చేయడానికీ ప్రభుత్వానికి నిష్కారణంగా బోలెడు ఖర్చు తగులుతుంది.

కాల్డర్ సూచనలు

పెట్టుబడిలాభాలపై పన్ను ఇదివరకే విధించారు. ఇప్పుడు సంపదపన్ను, ఖర్చుపన్ను కొత్తగా వేయడంతో బ్రిటిష్ అర్థశాస్త్ర నిపుణుడు ప్రొ॥ కాల్డర్ గత సంవత్సరం పన్నుల సంస్కరణపై చేసిన సూచనలలో కొన్నిటిని మాత్రమే భారతప్రభుత్వం ఆమోదించినట్లయింది. ప్రొ॥ కాల్డర్ సూచనల్లో తమకు లాభసాటి అయినవాటినే ఆమోదించి, పన్నుదారుకు లాభసాటి అయినవాటిని కొట్టివేసింది.

వ్యక్తిగత ఆదాయంపన్ను, అదనపుపన్ను రేట్ల గరిష్ఠ పరిమితిని నూటికి 92 వంతుల నుంచి 45 దాకా తగ్గించాలని కాల్డర్ సూచించారు. కాని ఈ సూచనప్రభుత్వం దృష్టికి రానట్లు స్పష్టమైంది. పైగా కాల్డర్ సూచనలు క్రమబద్ధంగా వృద్ధిపొందుతున్న ఆర్థికవ్యవస్థను దృష్టిలో పెట్టుకుని చేసినవి. వాటిని ద్వితీయ ప్రణాళికకు ఏదోవిధంగా ధనం చేకూర్చుకునేందుకే ఉపయోగించుకోవడం అనుచితం.

మొత్తంమీద చూస్తే ప్రభుత్వం ప్రతిపాదించిన పన్నుల విధానం అటు పరిశ్రమల అభివృద్ధికీ, పెట్టుబడి పెరుగుదలకూ గాని, ఇటు నిత్యావసరవస్తువుల ధరలతగ్గుదలకు గాని సహాయపడదని స్పష్టమవుతోంది. ఉత్పత్తి తగ్గిపోతూ, ధరలు పెరిగిపోతూ, పన్నులభారంకూడా ఎక్కువైపోతుంటేకొద్దికాలంలో దేశం ఏస్థితిలో పడుతుందో ఊహించుకోవలసిందే. ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించాలన్న పేరాసకొద్దీ, నిభాయించుకోలేనంత బరువైన ప్రణాళికను తయారుచేసుకోవడం, ప్రణాళిక నెరవేరితీరాలి గనుక, చేతిలోపనిగనక ఎడాపెడా పన్నులు పెంచేయడం — ఇదే భారత ప్రభుత్వపు ఆర్థికవిధాన సారాంశంలాగ కనబడుతుంది. ఇంతకంటే కాంగ్రెసు పార్లమెంటరీ సభ్యులు కొందరు సూచించినట్లు ప్రణాళిక కాలాన్ని ఆరేళ్లకో, ఏడేళ్లకో పొడిగించడమే వాస్తవికంగా వుంటుంది ★

కథ; వ్యథ

(33-వ పేజీ తరువాయి)

మీకూ గల పవిత్ర ప్రేమకు నేనడ్డం రాదలచుకోలేదు. కలకలం మీరు సుఖంగా వుంటమే నాకు కావలసింది. నయం, యీనాటికైనా నిజం బయటపడింది. లేకపోతే ముసుగులో గుద్దులాటలాగ మీరూ నేనూ ఎంతో కాలం బాధపడాల్సి వచ్చేది. మీరు మీ ప్రేయసీ సుఖంగా వుండండి. ఇక నా సంగతంటారా, నేను యీ క్షణమే పుట్టింటికి వెళ్లిపోతున్నాను. ఇక సెలవ్..."

"హాతవిధీ! కమల పుట్టింటికి వెళ్లిపోయిందా? ఎంత ఘోరం! కథ యింత కల్లోలం తెచ్చిపెడుతుందనుకోలేదు. ఏదో పత్రికలవాళ్ళు నాలుగురాళ్లు పడేస్తున్నారుగదా అని కథలు వ్రాయడం మొదలెడితే పర్యవసానం యిదా? ఆవిడకు అసలుసంగతి వివరించి కోపం చల్లార్చి పుట్టింటి నుంచి తీసుకురావాలంటే తాతలు దిగొస్తారు. ఇంకేముంది శశీ! గుండె ఆగిపోయింది. చచ్చాను!!"

"ఆ! ఆ!! చావద్దు! చావు మాత్రం అంత తేలికగా వుందిటండీ భానుమూర్తిగారూ?"

"నవ్వుతావేం శశీ? కొంప మునిగి పోతుంటే నీకు నవ్వులాటగా వుందిగదూ!"

"అయ్యో! మీరలా మాటిమాటికీ చావటం నాకే మాత్రం యిష్టంలేదు. మిమ్మల్ని బ్రతికించేస్తున్నాను. చూడండి, ఒక్క చిన్న విషయం. ఇప్పుడు నేను ఫోనులో మాట్లాడినదంతా ప్లాటుగా తీసుకొని ఒక చిన్న కథానిక వ్రాస్తే ఎలాగుంటుందం దంటారు 'భానుశ్రీ' గారూ?"

"చంపావ్ ఫో! నీ కథ సంగతేమో గానీ నే నిప్పుడు రెండు మూడు కాఫీలు తాగితే గానీ తేరుకు నేట్లు లేను." ★

మంచాలు-వానిపరిశుభ్రత

(36-వ పేజీ తరువాయి)

అక్కడవున్న అరుగుయొక్క ఇంట్లో ప్రవేశించినాయి పాపం కొన్ని ఆ యింటి ఆవిడ వంటిమీద కూడా ఎక్కినాయి. అంతటితో ఆవిడ మంచానికున్న నల్లులు దులపటంమాని, ఆవిడ వంటిమీదనున్న నల్లులు దులుపుకోనవలసి వచ్చినది.

మంచాలకు వార్నీషు వేశాక, మాసిపోయిన నవారు అల్లితే బాగుంటాదు. శుభ్రపరుస్తే బాగుంటుంది. సులభంగా శుభ్రపరిచే విధానం చెప్తాను. నవారు మంచాన్ని విప్పేసి, ఈటుకు టకు వీలుగా కట్టలుకట్టి రాత్రి చన్నీళ్లలో నానబెట్టవలెను. ఉదయం చారెడు బట్టల సోడా, చారెడు సున్నం మనం నీళ్ళు కాచుకునే కాగులో వేసి నీళ్లుపోసి, నానిన నవారు కాగులో వేసి మూతిపెట్టి పుడకపెట్టవలెను. ఒకగంటతరువాత కాగులోంచి పొగ వస్తుంది. అపుడు కాగు పొయ్యిమీంచి దింపి నవారు చల్లారినాక, దాన్ని ఇంట్లో పని మనిషిచేతకాని, చాకలిచేతకాని శుభ్రంగా ఉతికించవచ్చు. పంపులున్నవాళ్లు ఇంట్లో నే వుతుకుకోనవచ్చు. ఒక అణా నీలిమందు తెచ్చి, పొడిచేసి గుడ్డలో మూటకట్టి, కొద్ది నీళ్లలో పడవేస్తే నీళ్ళు నీలంగా అయిపోతాయి. శుభ్రముగా జాడించిన నవారు ఈ నీళ్ళలో ముంచి ఆరవేస్తే తెల్లగా వుంటుంది. నీలిమందు మూటకట్టి ఎందుకు వెయ్యాలి? నీలిమందు నీళ్లలో కలిపితే నీళ్లలో సరిగా కలువదు. అందుచేత నవారుకు సరిగా పట్టదు. నవారు తెల్లతెల్లగా, నల్లనల్లగా వుంటుంది. నీలిమందు మూటకట్టి వేస్తే నీలిమందు నీళ్లలో సరిగా కలసి నవారంతటకు సమానంగా పట్టుకుంటుంది. బాగుంటుంది. అపుడు నవారు తీరిక చూచుకొని మంచానికి అల్లుకోనవచ్చును. నవారు రెండు మూడు రోజులలో మనకు వుపయోగపడుతుంది. తొందరగా చిరిగిపోదు. బాగుగా స్వంతం చేసుకున్నామనే తృప్తికూడా వుంటుంది. బస్తీలో నవారు వుతుకుటకు చాకలి రెండు మూడు రూపాయలు తీసుకుంటాడు. పైగా 15 రోజులు చేస్తాడు. అంతడబ్బు యివ్వలేని మధ్యతరగతి కుటుంబీకులు, ఆ మాసిపోయిన నవారే వాడుకోవలసి వస్తుంది. కాబట్టి అర్ధ రూపాయి మాత్రం ఖర్చుపెట్టి నవారును పైచెప్పిన విధంగా బాగుచేసుకోవచ్చు. ఈ విధంగా చేస్తే నల్లులబాధ షుమారు నాలు సంవత్సరముల వరకు వుండదు. ★

జి. సీతాదేవి

సినిమా

గర్వకారణం

కాన్స్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఈసారికూడా భారతీయచిత్రం పర్వేసర్వత్రా మన్ననలందుకొంది. అది, ప్రభుత్వం పనుపున బిమల్‌రాయ్ ప్రొడక్షన్స్ వారు నిర్మించిన డాక్యుమెంటరీ చిత్రం "గౌతమబుద్ధ."

కాన్స్ ఉత్సవ సంఘంవారు ఈ చిత్రాన్ని "ప్రత్యేకం చెప్పుకోతగ్గ మంచి చిత్రం" అని ఏకగ్రీవంగా ఎన్నికచేసి ప్రశంసన జరిపారు.

విదేశదేశాలలోని శాద్ధశిల్ప చిత్రకళాఖండాలను సంఘటీకరిస్తూ, ఆ రూపేణా బుద్ధభగవానుడి కథను ఆయన ప్రబోధాన్ని ఇందులో తెలియ చెప్పారు. దర్శకుడు రాజ్‌బన్స్‌ఖన్నా ఈ 'సంకలనం'లో విశిష్టమైన శిల్పాన్ని ప్రదర్శించారు. విద్వాంసుల ఆమోదం పొందిన వ్యాఖ్యానాన్ని దీనికి జోడించారు. సలిల్ చౌదరి నేపథ్య సంగీతం కూర్చారు.

గత సంవత్సరం మనదేశంపంపిన "పథేర్ పాంచాలీ," మానవ హృదయాన్ని ఉత్తమంగా చిత్రించిన మంచి చిత్రంగా బహుమతి నందుకోవడం విదితమే.

ఈసారి కాన్స్ ఉత్సవంలో ప్రథమ బహుమతి, గారీకూపర్ నటించిన "ఫ్రెండ్లీ పెర్సువేషన్" అనే అమెరికన్ చిత్రానికి లభించింది.

ప్రత్యేక బహుమతులు: "ది సెవెన్త్ సీల్" (స్వీడన్), "కెనాల్" (పోలెండు) లకు లభించాయి. "రొమాంటిక్ డాక్యుమెంటరీ"లుగా ఎన్నిక అయిన "రూఫ్ ఆఫ్ జపాన్", "కివిలోక్" (డెన్మార్క్) ఆ శాఖలో ప్రథమ బహుమతిని పంచుకొన్నాయి.

ఉత్తమ దర్శకుడి బహుమతి రాబర్ట్ బ్రెసన్ (ఫ్రాన్స్-'పారిపోయిన ఖైదీ' అనే చిత్రానికి) అందుకున్నాడు.

ఉత్తమ నటుడు జె. కిట్రోమిలర్ (యుగోస్లావియా చిత్రం "వాలీ ఆఫ్ పీస్"). ఉత్తమనటి: జి. మజీనా (ఇటాలియన్ చిత్రం "నైట్స్ ఆఫ్ కాబిరియా"). సినేరియో: సోవియట్ చిత్రం "ఫార్టీఫస్ట్". ఈ నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా జరిగాయి.

ఇపుడు "గౌతమబుద్ధ" చిత్రాన్ని టోక్యోలో జరుగుతున్న ఆసియా చలన చిత్రోత్సవాలలో ప్రదర్శిస్తున్నారు. దీనితోపాటు హోమీవాడియా నిర్మించిన గెవాకలర్ చిత్రం "హాతింతాయ్" ని కూడా ఆ ఉత్సవానికి పంపారు.



ప్రతిభావారి కొత్త చిత్రం "దొంగలున్నారు జాగ్రత్త" లో నర్తకి లలితారావు.



భరణీవారి "వరుడు కావలెను" చిత్రంలో రమణారెడ్డి, అమర్‌నాథ్.

సినిమా వార్తలు

శ్రీ ధనసాయి ఫిలింస్‌వారి తొలి కానుక "బలేబావ" ఈ నెల 30 న విడుదల అవుతోంది. జానకి, గిరిజ, జగ్గయ్య, రేలంగి, గుమ్మడి, చదలవాడ, నల్ల రామమూర్తి ప్రభృతులు ఇందులో పాల్గొన్నారు. మాటలు కొండముది గోపాల రాయశర్మ, పాటలు అనిసెట్టి సుబ్బారావు వ్రాశారు. సంగీతం సుసర్ల దక్షిణామూర్తి సమకూర్చారు. ఛాయాగ్రహణం సి. నాగేశ్వర రావు.

దర్శకుడు ఎస్. రజనీకాంత్. నిర్మాత టి. రంగయ్య.

సంకల్పం

ఈ నెల 31 న సాధన ("సంసారం", "సంతానం") పిక్చర్స్ వారి "సంకల్పం విడుదల అవుతోంది. ఎన్. టి. రామారావు, రేలంగి, రమణారెడ్డి, చదలవాడ, ఆర్. నాగేశ్వరరావు, కుసుమ కుమారి, రాజసులోచన, సూర్యకాంతం పాల్గొన్న ఈ చిత్రానికి దర్శకుడు రంగనాథ దాస్. ప్రసాద్ పర్యవేక్షణ.

మాటలు పినిశెట్టి, పాటలు అనిసెట్టి వ్రాశారు. సంగీత దర్శకుడు దక్షిణామూర్తి. నృత్య దర్శకుడు గోపాలస్వామి. కళ టి. వి ఎస్. శర్మ.

వరుడు కావలెను

ధరణీవారి హాస్యరస ప్రధాన చిత్రం "వరుడు కావలెను" జూన్ 7 న విడుదల అవుతుంది. ఈ చిత్రం తమిళ ప్రతి "మనమగన్ తేవై" ఈ నెల 17 న విడుదల కావడం విదితమే.

భానుమతి, ప్రమీల, రాగిణి, అమర్‌నాథ్, జగ్గయ్య, రామన్న పంతులు, రమణారెడ్డి మొదలగువారు నటించారు.

రచన రావూరు సత్యనారాయణ, సంగీత దర్శకుడు జి. రామనాథన్. నృత్యాలు వెంపటి సత్యం. ఛాయాగ్రహణం వెంకట్. దర్శకుడు పి. రామకృష్ణ.

దొంగలున్నారు జాగ్రత్త

ప్రతిభావారి చిత్రం "దొంగలున్నారు జాగ్రత్త" చురుకుగా తయారవుతోంది. ఈ చిత్రాన్ని జూలై రెండో వారంలో విడుదలచేయ సంకల్పించారు.

జి. వరలక్ష్మి, గిరిజ, నర్తకి లలితారావు, జగ్గయ్య, గుమ్మడి, రాజనాల చదలవాడ, సి. ఎస్. ఆర్, శివరావు, కోటీశ్వరరావు, బాలకృష్ణ పాల్గొంటున్నారు.

రచన ఆత్రేయ. సంగీతం కె. వి. మహాదేవన్. ఛాయాగ్రహణం ప్రకాష్ అన్నయ్య.

దర్శకుడు బి. ఎస్. ఆర్., పర్యవేక్షణ కే. పుల్లయ్య.

"వినాయక చవితి"

అశ్వరాజ్ వారి "వినాయక చవితి"

(-55వ పేజీ చూడండి)



నవకేతన్‌వారి "నౌ దో గ్యారా" లో దేవానంద్, కల్పన. దేవ్ సోదరుడు విజయ్‌ఆనంద్ దీనికి దర్శకుడు.



రావల్ ఫిలింస్‌వారి "మిస్ ఇండియా"లో ప్రదీప్‌కుమార్, నర్గీస్.

★ బొంబాయి సినిమాలేఖ ★

[ఆంధ్రవారపత్రిక ప్రతినిధి]

గత వారం ఇద్ ఉత్సవాలతో ఉత్సాహభరితంగా గడచిపోయింది. హిందూ ముస్లిములు పరస్పరాలింగనంతో శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రముఖ దర్శక నిర్మాతలు మెహబూబ్, కర్దార్ ప్రభృతులు మసీద్‌కు వెళ్ళి ప్రార్థనలు జరిపారు. అనంతరం తమ ఇళ్ళకూ, స్టుడియోలకూ వచ్చినవారందరికీ ప్రత్యేకంగా చేయించిన ఇద్ పిండి వంటలతో విందులు చేశారు. దర్శకుడు కె. ఆసిఫ్, మోహన్‌స్టుడియో (అంధేరీ) లో వేసిన "మొగల్-ఇ-అజాం" సెట్‌పై గొప్ప విందు చేశాడు. ఫిలిం ప్రముఖులు దాదాపు అందరూ అందులో పాల్గొన్నారు. అక్కడి విందు రుచిచూచిన మీదట బొంబాయిలో పదేళ్ళనాటి ఇద్ పండుగ పిండివంటల మాధుర్యం మళ్ళీ ఈనాడు గుర్తుకు వచ్చింది.

జపాన్ ఫిలిం

గత సంవత్సరం మన పరిశ్రమ, లక్స్ అనుగుల జపాన్ ముడి ఫిలింను వాడుకుంది. ఆ ఫిలింమీద షూట్ చేసిన చిత్రాల ఫలితాలు చాలా బాగున్నా యనిపించుకొన్నాయి. మనదేశానికి ఈ ఫిలింను సరఫరా చేసే టోక్యో సంస్థ ఫ్యూజీఫోటో ఫిలింస్ ప్రతినిధి 'ఓమారా' మొన్న నిక్కడ తమ గౌరవార్థం జరిగిన విందు సందర్భంలో ఈ విషయం వెల్లడిస్తూ, ఇటుపై తాము, ఇంకా మంచిరకం ఫిలింను సరఫరా చేయబోతున్నారనీ, అది నాణ్యంలో ఏ దేశానికీ తీసిపోదనీ అన్నారు.

"పరదేశి"

భారత రష్యన్ కళాకారులు కలిసి నిర్మిస్తున్న "పరదేశి" చిత్రనిర్మాణం కొంత ఇపుడు రష్యాలో జరుగుతోంది. ఇందునిమిత్తం దర్శకుడు క్వాజా అహమద్ అబ్బాస్ నటీనటులు నర్గిస్, పద్మిని, జైరాజ్, డేవిడ్, బల్‌రాజ్ సాహ్నీ, అచలాసచ్‌దేవ్, సంగీత దర్శకుడు అనిల్‌బిశ్వాస్, మాస్కో వెళ్ళారు. ఈ సందర్భంలో బిమల్ రాయ్ ఫిలింస్ (డిస్ట్రిబ్యూషన్) లిమిటెడ్‌వారు, యీ బృందం గౌరవార్థం విందుచేశారు.

ఈ చిత్రనిర్మాణం పూర్తికావచ్చినదనీ, కాని భాగం కాస్తా ఇపుడు మాస్కోలో పూర్తిచేస్తామనీ నయాసన్సార్ దర్శక నిర్మాత అబ్బాస్ చెప్పారు (ఈ చిత్రాన్ని దక్షిణభారతంలో జైలక్ష్మి ఫిలింస్‌వారు విడుదలచేస్తున్నారు. తమిళనాడుకోసం అని కొన్ని ప్రతులను తమిళంలోకి డబ్ చేస్తున్నారు.)

కొత్త జంటలు

బొంబాయిచిత్రాలలో ఇపుడు కొత్త జంటలు చాలా ఏర్పడ్డాయి.

ఒకప్పుడు ఇలసాటిలేని జంటగా పేరుమణి అయిన దిలీప్‌కుమార్, మధుబాల



నాగేశ్వరరావు చిత్ర షష్టిపూర్తి

ప్రముఖనటుడు నాగేశ్వరరావు, తాను పాల్గొన్న 60 వ చిత్రం విడుదల సందర్భంలో, ఆయా చిత్రాల నిర్మాతలకూ, వాటిని ఆదరించిన ప్రజలకూ కృతజ్ఞత తెలుపుతూ చిత్ర షష్టిపూర్త్యుత్సవాలు జరుప సంకల్పించడం పాఠకులకు విదితమే. ఈ ఉత్సవాలను జులై నెల పూర్వార్థంలో (బహుశా రెండోవారం) జరుపడానికి నాగేశ్వరరావు భారీ ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు!

ఈ ఉత్సవంలోనే, బీదవిద్యార్థుల సహాయార్థం ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయానికి 25 వేల రూపాయలు విరాళం ఇస్తున్నారు. ఈ ఉత్సవంలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వచ్చి పాల్గొనగలరని తెలుస్తోంది.

ఈ సందర్భంలోనే నాగేశ్వరరావు, తాను పాల్గొన్న 60 చిత్రాలనుండీ కొన్ని కొన్ని ఘట్టాలను ఏరి, ఒక చిత్రంగా సంపుటీకరించి విడుదల చేయాలని, సంకల్పించారు.

బొంబాయి సినిమా లేఖ

ఇపుడు విడిపోయారు. దిలీప్ కు, వైజయంతి మాల రెండు చిత్రాలలో నాయిక. బి. ఆర్. చోప్రా చిత్రం 'నయాదౌర్' నుండి మధుబాల విరమించుకోగానే, ఆ భూమికను వైజయంతికి ఒప్పగించారు. తరవాత, బిమల్ రాయ్, తన కొత్త చిత్రం "మధుమతి"లో వారిద్దర్నీ బుక్ చేశాడు.

నిమ్మీతో అనేక చిత్రాలలో నటించిన భరత్ భూషణ్ ఇపుడు ఆమెతో కొత్త చిత్రాలలో కలసి పని చేయడానికి సరదా పడటం లేదు. ఫిలింస్థాన్ వారి "చంపాకలి"లో అతడి నాయిక బెంగాలీ నటి సుచిత్రాసేన్. పది చిత్రాలలో పనులు, అటు భర్త, కుమార్తె, కలకత్తా బొంబాయిల మధ్య ప్రయాణాలతో తీరుబాటులేని సుచిత్రకు అతనికీ పొసగలేదు.

ఈతలో సామర్థ్యం చూపి, చలనచిత్ర నటవర్గంలో చోటు సాధించిన మహారాష్ట్ర నటి శుభాఖోటే తనకు జంటగా ఉంటే బాగుంటుందని ఒకప్పుడు అభిప్రాయపడినా ఇపుడు, వైజయంతిమాలతో నటిస్తే చిత్రం రాణించి అదృష్టం కలసి వస్తుందని భరత్ భూషణ్ అంటున్నట్లు, అనుకుంటున్నట్లు తెలిసింది. ఈ ఇద్దరూ ప్రస్తుతం బి. మైత్రా రంగులలో నిర్మిస్తున్న "ఫగుణ్" చిత్రంలో నటిస్తున్నారు.

*　　*　　*

అశోక్ కుమార్, ప్రదీప్ కుమార్ లతో తరచుగా నటించే మీనాకుమారి, ఇపుడు ఒక చిత్రంలో రాజ్ కపూర్ తో కలిసి నటిస్తోంది. (ప్రదీప్ కుమార్ తో కలిసి ఆమె నటించిన కొన్ని చిత్రాలలో ప్రణయ ఘట్టాలకు ఆమె భర్త కమాల్ అమ్రోహీ అభ్యంతరం తెలిపాడట) ఇపుడు మీనా రాజ్ కపూర్ ల జంట, ఎల్. వి. ప్రసాద్ నిర్మిస్తున్న "శారదా" లో కనబడుతుంది.

రాజ్ నర్గిస్ లు ఇప్పుడు కలిసి కనబడటం లేదు. నర్గిస్, ఆమెతో "మదర్ ఇండియా" లో నటించిన సునిల్ దత్ వివాహం చేసుకుంటారని పుకార్లు బయలుదేరాయి కాని, సునిల్ దత్ వాటిని మొన్న ఖండించాడు.

"మదర్ ఇండియా చిత్రంలో నేను నర్గిస్ కుమారుడుగా నటించాను. నిత్య జీవితంలో కూడా ఆమెపట్ల నా భావం అంతే" అన్నాడు సునిల్.

*　　*　　*

రెండు చిత్రాలు

గతవారం విడుదల అయిన "ఛోటేబాబు" "ఆధీరోటీ" చిత్రాలలో మొదటిదానికి సంగీతం, రెండవదానికి కథ ప్రధానాకర్షణలు. మొత్తంమీద రెండూ జీవరహితంగా విసుగెత్తించే తరహాలో ఉన్నాయి.

"ఛోటేబాబు"లో నిమ్మి, శేఖర్, అభిభట్టాచార్య నటించారు. పాత్రల రూపకల్పన, చిత్రణ సవ్యంగా లేవు. అసంభవం అనిపించేటంత అతిగా సాగింది.

"ఆధీరోటీ"లో బాక్సాఫీస్ నటులు లేరు. కాని కథ మంచిది. సులోచన, భగవాన్ డెయిసీ ఇరానీ, మాస్టర్ డాబో పాల్గొన్నారు. చిత్రం ఆరంభం బాగుంది. మంచి చిత్రం చూడవచ్చునన్న ఆశ కలిగించింది. క్రమంగా రక్తికట్టించింది. సులోచన, భగవాన్ తెరమీద ఉన్నంతసేపూ బాగానే సాగింది. కాని ఇంటర్ వెల్ వచ్చేసరికి వారి ప్రాణాలూ, వాటితోపాటు యీ చిత్రం రక్తి, ఆకర్షణశక్తి ఒక్కసారే అంతరిస్తాయి.

★

అదీ-ఇదీ

సినర్వా మూవిటోన్ పేరిట సొహ్రాబ్ మోడీ నిర్మించిన తొలి టెక్నికలర్ చిత్రం "ఝాన్సీకీ రాణీ" రేపు ఆగస్టులో చైనాఅంతటా విడుదల కాబోతోంది. చైనాప్రభుత్వం ఈ చిత్రాన్నికొని చైనీస్ భాషలోకి డబ్ చేయించి దేశవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. భారత స్వాతంత్ర్య సమర శతవార్షికోత్సవ సమయాన, ఆనాటి వీరవనిత ఝాన్సీలక్ష్మీబాయిని చైనీస్ ప్రజలు ఈ రూపేణా కూడా చూచి తెలుసుకొనే అవకాశం ఏర్పడింది.

మనదేశీయులుకూడా ఇతర దేశాలచిత్రాలను చూచి ఆయా దేశాల సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, జీవనవిధానాలూ తెలుసుకోవడానికి చలనచిత్రాల రూపేణా దోహదం జరగడం అత్యంత వాంఛనీయం. ప్రస్తుతం మనదేశం వచ్చే "విదేశీయ" చిత్రాలు ప్రధానంగా అమెరికన్ చిత్రాలే. కొన్ని బ్రిటిష్ చిత్రాలుకూడా వస్తున్నాయి. ఇటలీ, ఫ్రాన్సు, జపాన్, రష్యా, చైనా, ఆపైన జెకోస్లొవాకియా ప్రభృతి తూర్పు యూరప్ దేశాల చిత్రాలూ, అంతర్జాతీయ చలనచిత్రోత్సవం జరిగినపుడు వచ్చాయి. దరిమిలా చిన్న చిన్న ఉత్సవాల పేరిట వచ్చాయి. తెలిసినవారు చూచారు. చూడని వారు చూచే అవకాశం మళ్ళీ రాలేదు. అందువల్ల ఈ రంగంలో, బాధ్యతగలవారు శ్రద్ధవహించి కృషిచేయడం వాంఛనీయం. మన చిత్రాలకు విదేశాలలో విఫణులు విస్తరించడానికికూడా ఇది చాలా మంచిది! అవసరం.

*　　*　　*

ఈ సంవత్సరాంతాన, దేశవ్యాప్తంగా బాల చలనచిత్రోత్సవాలు జరుపడానికి "నేషనల్ ఎడ్యుకేషన్ ఫిలింస్" సంఘం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికి జరుగుతున్న ఏర్పాట్ల ప్రకారం దేశవ్యాప్తంగా అంటే, చలనచిత్ర నిర్మాణ కేంద్రాలు బొంబాయి, పూనా, కలకత్తా, మద్రాసు, బెంగుళూరు, కేంద్రరాజధాని ఢిల్లీ, కేరళ రాజధాని తిరువేంద్రం, ఆపైన అలహాబాద్ లక్నో, కాన్పూర్, నాగపూర్ నగరాలు అని స్థూలంగా తేలింది.


సెప్టెంబరునుండి డిసెంబరు వరకూ నగరానికొకవారం చొప్పున జరిగేఉత్సవాలను, బాల చలనచిత్రాల వ్యాప్తి విషయంలో ఆది నుండి ఉత్సాహం చూపిస్తున్న విజయవాడలోనూ, ఆంధ్రరాజధాని హైదరాబాద్ లోనూ కూడా ఏర్పాటు చేయడానికి ఇప్పటి నుండీ బాధ్యతగలవారు కృషిచేయడం వాంఛనీయం. బాల చలనచిత్ర నిర్మాణంలో అగ్రశ్రేణికి చెందిన బ్రిటిష్ (బాల చలన చిత్ర సంస్థ), సోవియట్ చిత్రాలను ఈఉత్సవంలో చూపిస్తారు. బహుశా మనదేశంలో తయారైన జల్ దీప్, చార్ దోస్త్ చిత్రాలను కూడా చూపడం జరగవచ్చు. వ్యవధి ముగిసే వరకూ ముభావంగా ఉండి, ఆనక ఆ సంగతి చెప్పలేదని సమాధానపడడంకన్న, ఇప్పటి నుండి ఈ విషయమై ప్రయత్నించడం మంచిది.

మీ కుటుంబమునకు ఒక చక్కని


నేషనల్-ఎక్కో రేడియో కొనిపెట్టండి!

దేశమంతటాగల లక్షలాది కుటుంబములు నేషనల్-ఎక్కో రేడియో ద్వారా పొందే సంగీతము మరియు వినోదముల క్రొత్త ప్రపంచములోని ఆనందమును మీరూ పొందండి! ధర రు. 195/- నుండి రు. 1200/- వరకు దొరకుతున్న వాటిలో ఎంచుకుందుకు 12 దివ్యమైన మోడలులు ఉన్నాయి.


నేషనల్-ఎక్కో రేడియోలు మాన్‌సూనైజ్ చేయబడినవి



మీ నేషనల్-ఎక్కో వ్యాపారినైనా యీ రేడియోలను ఉచితముగా పెట్టమని వినండి! ధరలలో బేరము లేదు; స్థానిక పన్నులు అదనము. వీనిని మీరు సులభమైన వాయిదాల పద్ధతిలో కొనగలరు.



మోడలు 241: 5 వాల్వులుగల ఎసి/డిసి సెట్ మరియు 4 వాల్వులుగల డ్రై బ్యాటరీ సెట్. అన్ని వేవులపై ప్రసారములను వినవచ్చును. ... రు. 195/-




మోడలు 270/1: 'మ్యూ కుమార్' రేడియో—5 వాల్వులు, 3 బ్యాండులు, త్రిప్పుతూ మార్చుకోగలిగే టోన్ కంట్రోలు, పూర్వము కంటె పెద్ద ట్యూనింగ్ స్కేలు మరియు క్యాబినెట్, పిక్-అప్ మరియు లౌడ్‌స్పీకరు పెట్టుకొను ఏర్పాటు. మోడలు ఎ-270/1 ఎసి కరెంటుతోను, మోడలు యు-270/1 ఎసి లేక డిసి కరెంటుతోను పనిచేయును. ధర రు. 300/-

జెనరల్ రేడియో & అప్లయన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్

ఒపేరా హౌస్, బొంబాయి 4 • 3 మదన్ స్ట్రీట్, కలకత్తా 13 • 1/18 మౌంట్ రోడ్, మద్రాసు • 36/79 సిల్వర్ జూబ్లీ పార్క్ రోడ్, బెంగుళూరు • లోగ్దియాన్ కాలనీ, చాందినీ చౌక్, ఢిల్లీ

GRA. 4987 (R)



పారమౌంట్ వారి "రెయిన్ మేకర్" చిత్రంలో ఒక సన్నివేశం.

రెయిన్ మేకర్

వర్షం కురిసి ఎన్నో వర్షాలయినట్లనిపించింది కర్షకులకు. బీళ్ళు ఎండిపోయాయి. పశువులు బక్కచిక్కిపోతున్నాయి. మనుషులు బిక్కమొహాలు పెడుతున్నారు. 'త్రీ పాయింట్' పట్టణంలో హెచ్. సి. కరీ, అతని కుమారులు నోవా, జిమ్మీ, కుమార్తె లిజీ వర్షంకోసం తపించిపోతున్నారు. వాళ్లందరూ ఆకాంక్షించేది మరొకటికూడా ఉంది. ఇంటిఆడపడుచు లిజీపెళ్లి. అదికుదిరితే వర్షం వచ్చినంత హర్షం కలుగుతుంది వాళ్ళకి. లిజీ పెళ్లీడు దాటి, ముప్ఫయోపడిలో పడింది. అసలు అతిలోకసుందరి కాదు. అందువల్ల ఏ రోమియో ఆమెకు హృదయం అర్పించటం లేదు. "నీకింక పెళ్లికాదనుకుంటాను చెల్లీ" అనేశాడు ఒకరోజున వాళ్లన్న నోవా.

తమ్ముడు జిమ్మీ, బొమ్మలాటి ఓ అమ్మాయిని ప్రేమించి ఆమెవెంట తిరుగుతూ ఉంటాడు. చెల్లెలుకు పెళ్లికావటం లేదన్న బాధని, తమ్ముడి చిల్లర తిరుగుళ్లమీద కోపంగా తర్జుమా చేస్తుంటాడు నోవా. పనివాళ్లకిమల్లె ఉండుండి పోట్లాడుకునే ఆ తల్లిలేనిపిల్లలు ముగ్గుర్నీ తండ్రి కరీయే లాలించి, మందలించి సర్దుకుని వస్తున్నాడు.

* * *

అందం, ఆకర్షణ లేనందువల్లనే తనను ఎవరూ వరించటంలేదనీ, తనకింక ఎన్నడూ పెళ్లి కాదనీ దిగులుపడి, క్రమంగా ఆత్మవిశ్వాసం, ఉత్సాహం కోల్పోయి చిక్కిపోతున్న లిజీని అన్నదమ్ములు, తండ్రి కలసి ఒకసారి పొరుగూరు చుట్టాలింటికి పంపారు. అక్కడ ఎవరేనా ఆమెను వరించవచ్చునన్న ఆశతో.

కాని మూడోనాడు లిజీ దిగులు మొహంతో తిరిగివచ్చింది. వరించడంమాట అలాఉండగా ఆమెను పలకరించినవాళ్లు కూడా లేకపోయారు.

"పలకరించినా ఏంలాభం లేనాన్నా. నాకేం మాట్లాడాలో ఎలా మాట్లాడాలో కూడా తెలీదు. అసహ్యంగా ఉంటుంది" అంది లిజీ తలవంచుకుని.

* * *

లిజీ వద్దంటున్నా మరోప్రయత్నం చేశారు తండ్రీ, అన్నదమ్ములూను. ఆ ఊరి షెరీఫ్ ఫైల్, బ్రహ్మచారి. అతన్ని తమయింట విందుకుపిలిచి లిజీ పరిచయంచేసి పెళ్ళిమాట ప్రస్తావించాలని తలపెట్టారు. తీరా వారు అతగాణ్ణి పిలవబోయేసరికి "నిష్కారణంగా వీళ్లకి నామీద ఇంతప్రేమ ఎందుకు ముంచుకొచ్చిందీ" అని ఆ పెళ్లికొడుక్కి అనుమానం కలిగింది. ఇది దేనికో పన్నాగం అనుకుని రానుపొమ్మన్నాడు.

పిండివంటలు సహా పెద్ద ఎత్తున విందు సిద్ధంచేసి, చాతనైనంత చక్కగా ఆకర్షణీయంగా అలంకరించుకున్న లిజీకి, ఈవార్త వినేసరికి కంటనీరు తిరిగింది. ఇంకెప్పుడూ

వా పెళ్ళిగొడవ ఎవరూ ఎత్తకండి అంది.

* * *

స్టార్ బక్ అనే పూలరంగడొకడు ఆడుతూ పాడుతూ ఆ ఊరికొచ్చాడు. దొంగలకూ పోలీసులకూ సుపరిచితుడు. దొంగలతో తిరుగుతూ వాళ్ల గుట్టూమట్టూ పోలీసులకి చేరేస్తూ ఉంటాడు. కలలు కని, నమ్మి, డబ్బు తక్కొచ్చి అయినపుడు నమ్మించి నాలుగు డబ్బులు చేసుకుంటాడుకూడా. దీన్నే గిట్టని వాళ్లు టోకరా అంటారు.

“నూరు డాలర్లిస్తే వానకురిపిస్తా” అన్నాడు స్టార్ బక్ ఆ ఊరికొస్తూనే. 24 గంటలు గడువిస్తే చాలన్నాడు. ఇది టోకరా వ్యవహారమని తెలిసిన, స్టార్ బక్ ముఖారవిందం వచ్చినందువల్ల సరే చూతామని సరదాగానే నూరూ ఇచ్చాడు కరీ.

స్టార్ బక్ దర్శకత్వం క్రింద, వానకై కృషి ఆరంభమైంది. జిమ్మీ పెద్డ్రోలు వాయించాడు. వాళ్ల నాన్న కరీ ఇంటిదగ్గర ఒక పెద్దబాణం బొమ్మ వేశాడు. పిడుగులు పడ్డపుడు ఆ బొమ్మ వాటిని దూరానికి తరిమేస్తుందట. అలాగ స్టార్ బక్ చెప్పాడు. అలాగే అతని పనుపున నోవా, వెళ్లి ఒకకంచర గాడిద వెనక్కాళ్లు రెండూ కట్టేశాడు.

తెల్లారేసరికి వానొస్తుందన్నాడు స్టార్ బక్. ఈ లోగా షెరీఫ్ ఫైల్ వాళ్లింటికొచ్చాడు—స్టార్ బక్‌ను చూచిపోయే మిషమీద. అతను నిజంగా వచ్చిన పని లిజీతో మాట్లాడడం. కాని వాళ్ళిద్దరూ రెండు నిముషాలు మాట్లాడేసరికి, వాదం పెరిగిపోట్లాడుకున్నారు. ఫైల్ వెళ్లిపోయాడు.

“నాకు మాట్లాడ్డం కూడా చాతకాదు. ఛీ ఎందుకూ పనికిరాని వెధవబతుకు.” అని తిట్టుకుంటూ లిజీ కుమిలి కుమిలి ఏడ్చింది గడ్డి వామిదగ్గర కూర్చుని.

ఆ పక్కనే షెడ్‌లో ఉన్న స్టార్ బక్ ఆమెను ఓదార్చాడు. ఆ ఇంటికి వచ్చిన తక్షణాన అతడు లిజీకథను ఊహించుకోగలిగాడు. పెళ్లికాక, ఇక కాదన్న నిరాశ చేత ఆమె కుమిలిపోతున్నదని పసిగట్టాడు.

ఆమెను లాలించాడు. ధైర్యం చెప్పాడు. “అందరిలాంటి అందమూ కాదు నీది. హృదయగతమైనసౌందర్యంనీలో ఉంది. అపురూపమైన, శాశ్వతమైన సౌందర్యం అదే” అన్నాడు ఆమెకురులుసవరిస్తూ. తన గురించి కూడా అతను గొప్పలు చెప్పుకోలేదు. తను కలలు కంటాడు. నమ్మిస్తాడు. అది టోకరావే కావచ్చుగాని తన మనుగడకుఅవసరం. పోలీసులకు అతడితో తరచు పని ఉంటుంది...

ఇన్నాళ్ళకి తనను ప్రేమించిన మనిషి దొరికాడని లిజీ మురిసిపోయింది ఆ ముచ్చట తండ్రికి చెప్పడానికని ఇంట్లోకి పరుగెత్తింది.



శ్రీ ధనసాయి ఫిలిమ్స్‌వారి “బలేబావ” లో జానకి, జగ్గయ్య.

అక్కడ షరీఫ్ ఫైల్ ఉన్నాడు. స్టార్ బక్‌ను అరెస్టు చేయడానికి వచ్చాడతడు.

అంతా నిర్ఘాంత పోయారు.

“వెర్రిబాగులవాడు వదిలిపెట్టెయ్యి. పోతాడు” అని బ్రతిమాలారు షరీఫ్‌ను.

“నాతో వచ్చెయి లిజీ నిన్ను సుఖపెడతాను” అన్నాడు స్టార్ బక్ బయలుదేరుతూ.

అంతవరకూ తన ఊహాలు తనలోనే దాచుకున్న షరీఫ్ ఫైల్, తొలిసారిగా మనసు విప్పి లిజీ ప్రేమను అర్థించాడు, తనను వివాహం చేసుకోవలసిందని కోరాడు.

అటూ ఇటూ అని తటపటాయించింది లిజీ క్షణం సేపు. చివరకి బికారి స్టార్ బక్‌ను వదలి షరీఫ్ ఫైల్‌ను పెళ్లాడితే సాఫీగా సుఖంగా జీవితం సాగుతుందని తోచిందామెకు. ఆసంగతే చెప్పింది.

బికారిగా వచ్చిన స్టార్ బక్ సరేనని, మళ్లీ తన షికారుమీద వెళ్ళిపోయాడు. కొద్దినిముషాల తేడాలో ఆకాశంలో ఉరుములు వినబడ్డాయి. కుంభవృష్టిగా వర్షం కురవడం మొదలెట్టింది.

అది అద్భుతం కావచ్చు! లేదా బికారి స్టార్ బక్ గారడీయే కావచ్చు.

ఏమైతేనేం, భూమికి వర్షాగమనం, లిజీకి హర్షాగమనం ఏక కాలంలోనే సంభవించాయి.

* * *

న్యూయార్కు బ్రాడ్వే రంగస్థలం పై ప్రసిద్ధికెక్కిన నాటకం “రెయిన్ మేకర్” కథ ఇది. దీనిని పారమౌంట్ పిక్చర్స్ పేరిట హాల్ వాలిస్ విస్టావిజన్‌లో చలన చిత్రంగా నిర్మించాడు. నాటక రచయిత రిచర్డ్ నాష్ ఈచిత్రానికి స్క్రీన్‌ప్లే వ్రాశాడు. లిజీగా కేథరిన్ హెప్‌బర్న్, షరీఫ్ ఫైల్‌గా వెండెల్ కొరీ, వర్ష, హర్ష సంభవాలకు కారకుడైన బికారిస్టార్ బక్‌గా బర్ట్ లంకాస్టర్ నటించారు. దర్శకుడు జోసెఫ్ ఆంతోనీ. ★

సినిమా వార్తలు

(50-పేజీ తరువాయి)

నిర్మాణం పూర్తి కావచ్చింది. జమున, రామారావు ముఖ్య భూమికలు నిర్వహిస్తున్న ఈ చిత్రానికి రచయిత సముద్రాల రాఘవాచార్య దర్శకుడు. (ఇటీవల ఈయన దర్శకత్వం స్వీకరించిన మరో చిత్రం భారతీ ప్రొడక్షన్స్‌వారి “బభ్రువాహన”)

“వినాయక చవితి’ చిత్రం జూన్‌లో విడుదల కావచ్చునని తెలుస్తోంది. ★

బావా మరదలు

(11-వ పేజీ తరువాయి)

అనుకుని సిగ్గుతో అక్కడ ఆగిపోయేది. త్వ‌ంలో తనకూ రానున్న ప్రణయగాథ కప్పుడే అంకురార్పణ అయేది. అస్ఫుటమైన చిత్రాలేవో కనపడేవి. ఆ పిల్ల చిన్నది గనుక, చతురకాదు కనుక ఇవన్నీ స్పష్టంగా ఊహించుకోనూలేకవచ్చును. బావతోనైనా చెప్పలేకనూ పోవచ్చును. కాని ఈ పద్ధతుల నేర్పాటుచేసిన పెద్దలు మట్టుకు ఈ పరిణామాలన్నీ ఊహించి, వాంఛించి చేశారనే నా నమ్మకం,

కాని ఏమిలాభం? ఆయనెవరో అన్నట్టు రోజులుమారాయి. పాశ్చాత్య నాగరకత మన కొంపతీసింది. ఎన్నివేల శతాబ్దాలకు పూర్వమో ఏర్పాటైన సమిష్టికుటుంబాలను ఒక్క శతాబ్దంలో నేలమట్టం చేసింది. ఈనాడు ఆ వివాహాలూ లేవు; ఆమరదళ్ళూ లేరు; ఆ హాస్యమూ లేదు; ఎలావుంటుంది? పట్నంలో విద్యాభ్యాసం చేస్తున్న షడ్డ్వి మిది నుంచి పాతిక సంవత్సరాలదాకావున్న పడుచువధువు, పల్లెటూళ్లో వ్యవసాయం చేతనో, పట్నాలలో ఉద్యోగం చేతనో బ్రతికే తలిదండ్రులు కన్యాదాతలు. ఏ ఢిల్లీ లోనో, బొంబాయిలోనో ఉద్యోగములో వున్న నడివయసువాడు వరుడు. బంధువులు ఆఖరుకు తోడపుట్టినవాళ్లు కూడా రావడానికి వ్యవధిలేని ఒంటిపూట వివాహాలు. వెంటనే భర్తను భార్య వెంటనంటిపోవడం. ఇంక మరదలు పరాచికాలకు సావకాశమేది? ఏ శెలవులలోనో రెండు రోజులు కలుసుకున్నప్పుడు ఓమోస్తరు చదువుకున్న మరదలు, ఏంబావా మీవ్రాళ్లో ... సినిమా లేవన్నా చూచావా? అనో షేక్స్పియర్ లా అలావున్నావేమనో సంభాషణ కుపక్రమిస్తుంది. అంతకంటె విద్యాధికురాలయిన మరదలయితే, అణుశక్తినిగురించో, సూయజ్ సమస్యను గురించో, ... పత్య రహస్యాలను గురించో స్వేచ్ఛగా ... బావను భయపెడుతుంది. ఇందులో ... యేమానంద ముంటుంది? అసలే దుఃఖమయమైన జీవితం నానాటికి మరీ దుర్భరమవుతున్న రోజులలో హాస్యం మనుగనేనా ... మనం మరచిపోవడానికి వీలులేని పరిస్థితు... వచ్చాయి. అందుకని, ఈ నూతన వా... వరణానికి అవసరమైన నూత్న సాంసారిక హాస్యం మనం సృష్టించుకోవాలి. లేకపోతే, జీవితం దుర్భరంకాదూ? మనం అధైర్యపడ నక్కరలేదు. కొత్తరకం హాస్యం, మృదువైన హాస్యం, మనస్సునీ బుద్ధినీ వికసింప... అద్వితీయమైన ఆనందానికి దారితీసే హాస్య... తప్పక వస్తుంది. శుభం భవతు.

[మద్రాసురేడియో సౌజన్యంతో.]

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.

ఆంధ్ర ప్రజలు ఆదరాభిమానములతో చూచుచున్న అత్యుత్తమ చిత్రం

నేడే చూడండి

